Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

సంపుటి: 56 • సంచిక: 307 • శనివారం 17 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ ✻ పేజీలు: 12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇక వేగిరం

తగ్గింపు ధరలకే స్టీల్ సరఫరా చేసేందుకు కంపెనీల అంగీకారం
మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్ రెడ్డిల సమక్షంలో ఎంవోయూ
కాంట్రాక్టర్లకు వెసులుబాటు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూమ్ గృహ నిర్మాణ పథకం మరింత వేగవంతంగా అమలయ్యేందుకు మార్గం సుగమమైంది. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే రూ.5.5 లక్షల మొత్తంలో ఇళ్ళు నిర్మిచడం ఇవ్వడం కష్టసాధ్యమని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపారు. ఉక్కు కంపెనీల ప్రతినిధులతో చర్చించి డబుల్‌బెడ్‌రూం ఇళ్ళకు తక్కువ ధరకే స్టీల్ సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. బస్తా సిమెంట్ రూ.240కే సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యమైన స్టీల్ రూ.60వేలకు మెట్రిన్ టన్ను చొప్పున ఉండగా, ప్రభుత్వం కుదుర్చుకున్న ఎంవోయూ ప్రకారం రూ.43,660కే కంపెనీలు సరఫరా చేయనున్నాయి. వివిధ స్థాయిల్లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మా ణ ప్రక్రియ మరింత వేగవంతంగా పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. స్టీల్ ధరలు తగ్గించిన కారణంగా ఈ పథకం నిర్మాణ అంచనా వ్యయంలో రూ.264.60 కోట్ల భారం తగ్గుతోంది. దీంతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఈ పథకం యుద్ధ ప్రాతిపదికన పూర్తయి లబ్ధిదారులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. బేగంపేటలోని మంత్రి కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సంబంధిత ఉన్నతాధికారులు, ఇంజనీర్లు స్టీల్ పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు సహకరించాలని మంత్రులు కోరారు. ఈ ప్రతిపాదనపై వివిధ కంపెనీల ప్రతినిధులు యాజమాన్యాలతో మాట్లాడి అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్మించి ఇచ్చే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళు నాణ్యతతో ఉంటే నాలుగు కాలాల పాటు గుర్తుండిపోతుందని అన్నారు. కాంట్రాక్టర్లు కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించే ప్రతి లక్ష ఇండ్లకు 1.45 లక్షల మెట్రిక్ టన్నుల స్టీల్ అవసరం అవుతుందని తెలిపారు. అలాగే పట్టణాల్లో ప్రతి 60వేల ఇళ్ళకు 1.04 మెట్రిక్ టన్నులు, జిహెచ్ఎంసి పరిధిలో ప్రతి లక్ష ఇళ్ళకు 2.78 లక్షల మెట్రిక్ టన్నుల స్టీల్ అవసరం అవుతుందని వివరించారు. ఆ మేరకు ఫిబ్రవరి 16 నుంచి నుంచి ఏప్రిల్ 16 వరకు అవసరమైన స్టీల్‌ను ముందుగానే సరఫరా చేసేందుకు కంపెనీలు తగిన చొరవ చూపాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ పథకం ప్రారంభించిన సమయంలో ప్రతి మెట్రిక్ టన్ను స్టీల్ ధర అన్ని పన్నులతో కలుపుకుని రూ.32,550 మాత్రమే ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో జిఎస్‌టితో కలుపుకుని స్టీల్ ధర రూ.53,100కు చేరుకుంది. కంపెనీల యాజమాన్యాలతో చర్చించిన తర్వాత కుదిరిన ఒప్పందం మేరకు స్టీల్‌ను రూ.43,660కే సరఫరా కానుంది. అది కూడా అన్ని పన్నులు అందులోనే కలపాలన్న విజ్ఞప్తికి అన్ని కంపెనీలు అంగీకారం తెలిపాయి. బహిరంగ మార్కెట్‌తో పోలిస్తే ఒక్కో టన్నుపై స్టీల్ ధర రూ.9,440 తగ్గుతోంది. ఈ సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ ముడుపు భూంరెడ్డి, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అధికారులు చిత్రారామచంద్రన్, అరవింద్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, ఆల్ ఇండియా స్టీల్ అసోసియేషన్ చైర్మన్ సురేష్ కుమార్ సింఘాల్‌లతో పాటు వివిధ స్టీల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కేసీఆర్ బర్త్‌డే



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదినోత్సవ వేడుకలకు రాష్ట్రం ముస్తాబవుతోంది. కార్యకర్తలు, నేతలు, ప్రజా ప్రతినిధులు వేర్వేరుగా, సమిష్టిగా పలు కార్యక్రమాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆపన్నులను ఆదుకోవడంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. శనివారం ఉదయం ప్రగతిభవన్‌లో కెసిఆర్ పలువురు మంత్రులు, అధికారులు, కుటుంబసభ్యులతో కలిసి భారీ కేక్‌ను కట్ చేసి వేడుకలను జరుపుకోనున్నారు. గులాబీ కార్యకర్తలు ఆస్పత్రులలో రోగులకు పండ్లు పంపిణీ, ఆపన్నులకు దుప్పట్ల పంపిణీతో పాటు అన్నదానం, వస్త్రదానం కూడా చేయనున్నారు. దేవాలయాలలో పూజలు కూడా నిర్వహించనున్నారు. మసీదులలో ప్రత్యేక ప్రార్థనలకు టిఆర్‌ఎస్ మైనారిటీ విభాగం కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. చిత్రపురి కాలనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న రక్తదాన శిబిరాన్ని మంత్రి హరీష్‌రావు ప్రారంభించనున్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరుగనున్న ఆయుష్షు హోమానికి ఎంపి కల్వకుంట్ల కవిత పాల్గొంటారు. జలవిహార్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, మంత్రి శ్రీనివాస్ యాదవ్ ప్రారంభిస్తారు. ప్రగతి భవన్‌లో కేక్ కట్ చేసిన తర్వాత సిఎం కెసిఆర్ తనను కలిసేందుకు వచ్చిన అధికారులు, ముఖ్యుల నుంచి శుభాకాంక్షలను అందుకోనున్నారు. కెసిఆర్ జన్మదినం సందర్భంగా రాష్ట్రమంతా కటౌట్‌లు, హోర్డింగులు వెలిశాయి. ఎక్కడికక్కడ కెసిఆర్ అభిమానులు తమ ఆరాధ్యనేతకు జన్మదిన శుభాకాంక్షలను తెలియజేస్తూ బ్యానర్లు, పోస్టర్లను వేశారు. కొన్ని చోట్ల కూడళ్లను గులాబీ జెండాలతో సుందరంగా అలంకరించారు. అనేక చోట్ల కార్యకర్తలు ప్రత్యేక కేకలను తయారు చేయిస్తున్నారు. అభిమానులు, పార్టీ కార్యకర్తల సమక్షంలో కట్ చేసి తమ అభిమానాన్ని చాటుకునేందుకు ఉత్సుకతతో ఉన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు భారీగా తరలి రానున్నందున ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. కెసిఆర్ జన్మదినం సందర్భంగా టిఆర్‌ఎస్ అభిమానులు, జాగృతి సంస్థ కార్యకర్తలు పలువురు విదేశాలలోనూ ఉత్సవాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. బహ్రెయిన్‌లోని సల్మానియా ఆస్పత్రిలో రక్తదానం నిర్వహించనున్నారు. ఇదే తరహాలో వేర్వేరు దేశాలలో కార్యకర్తలు కేక్ కట్ చేసి పలు కార్యక్రమాలను చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

ప్రత్యేక ఆల్బమ్ విడుదల

కెసిఆర్ జన్మదినం సందర్భంగా టిఆర్‌ఎస్ యూత్‌వింగ్ రూపొందించిన వీడియో సాంగ్ ఆల్బమ్‌ను ఎంపి కవిత ఆవిష్కరించారు. సిఎం ఆలోచనల ప్రతి రూపంగా రూపుదిద్దుకున్న పథకాల వివరాలు, వాటి ఫలాలను తెలియజెప్పేలా వీడియో ఆల్బమ్‌ను రూపొందించిన టిఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎల్‌సి శంబీపూర్ రాజును ఎంపి కవిత అభినందించారు.

ఇంద్రకరణ్ రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ తినిపిస్తున్న మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకకరణ్‌రెడ్డికి గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్, మంత్రి కెటిఆర్‌లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో కలకాలం ఆనందంగా జీవించాలని గవర్నర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డిని దేవుడు చల్లగా చూడాలని, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. బేగంపేటలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి అల్లోలకు కెటిఆర్ పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మడుపు భూంరెడ్డి, ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గువ్వల బాలరాజు, భాస్కరరావు, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రామచంద్రన్ మంత్రికి శుభాకాంక్షలు తెలియ జేశారు. సచివాలయంలోని మంత్రి ఇంద్రకరణ్ ఛాంబర్‌లో బోథ్ ఎంఎల్ఏ రాథోడ్ బాపురావు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శివశంకర్, న్యాయశాఖ కార్యదర్శి నిరంజన్ రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



పిఎన్‌బి కుంభకోణానికి రాహుల్ రంగు?!



ముంబై/న్యూఢిల్లీ: నీరవ్ మోడీ, అతడి వ్యాపార భాగస్వామి మెహుల్ చోస్కీలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శుక్రవారం సమన్లు జారీ చేసింది. వారం రోజుల్లోగా ఏజెన్సీ ఎదుట హాజరుకావాలని మనీ లాండరింగ్ నిరోధక చట్టం(పిఎంఎల్ఎ) కింద జారీ చేసిన సమన్లల్లో ఇరువురిని ఆదేశించింది. ఉభయులు దేశంలో లేని కారణంగా వారి కంపెనీల డైరెక్టర్లకు నోటీసులు అందజేసినట్టు అధికారులు తెలిపారు. నీరవ్ మోడీ కేసులో దేశవ్యాప్తంగా 35 చోట్ల ఈడీ శుక్రవారం మరింత సోదాలు జరిపింది. పుస్తక విలువ ప్రకారం రూ.549 కోట్ల విలువైన వజ్రాభరణాలు, స్వర్ణాభరణాలు స్వాధీనం చేసుకుంది. ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న వాటి విలువ రూ.5,649 కోట్లకు చేరుకుంది అని ఏజెన్సీ ఒక ప్రకటనలో తెలిపింది. మకావు, బీజింగ్, న్యూయార్క్, లండన్‌తో సహా విదేశాల్లో నిర్వహిస్తున్న స్టోర్స్ తాలూకు విక్రయాల వివరాలు అందించాలని ముంబైలో నీరవ్ మోడీ కంపెనీ ప్రధాన కార్యాలయాన్ని ఈడీ ఆదేశించింది. గురువారంతో మొదలైన సోదాలు శనివారం కూడా కొనసాగుతాయని తెలిపింది. వాటి విలువ స్వతంత్రంగా నిర్ధారించే ప్రక్రియ మొదలైంది అని ఏజెన్సీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది.

నీరవ్, మెహుల్ పాస్‌పోర్టుల సస్పెన్షన్

పిఎన్‌బి కుంభకోణంలో ప్రధాన నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ, అతడి వ్యాపార భాగస్వామి



మెహుల్ చోక్సీ పాస్‌పోర్టులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ(ఎంఈఏ) శుక్రవారం నాలుగు వారాల కాలానికి సస్పెండ్ చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సూచన మేరకు ఎంఈఏలోని పాస్‌పోర్టులు జారీ చేసే విభాగం 1967 నాటి పాస్‌పోర్ట్ చట్టంలో సెక్షన్ 10(ఎ) కింద నీరవ్ మోడీ, మెహుల్ చోస్కీ పాస్‌పోర్టులను తక్షణం అమల్లోకి వచ్చేలా నాలుగు వారాల కాలానికి సస్పెండ్ చేస్తున్నది అని ఎంఈఏ ఒక ప్రకటనలో తెలిపింది. పాస్‌పోర్ట్ చట్టంలో సెక్షన్ 10(3) (సి) కింద ఇద్దరి పాస్‌పోర్టులు ఎందుకు రద్దు చేయకూడదో తెలియపరుస్తూ వారం రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని వారిని ఆదేశించినట్టు ప్రకటన పేర్కొంది.

నీరవ్ ఆచూకీ కోసం ఇంటర్‌పోల్ సాయం

జనవరి మొదటి వారంలో దేశం విడిచి వెళ్ళిపోయిన నీరవ్ మోడీ, అతడి కుటుంబం ఆచూకీ తెలుసుకోనేందుకు సిబిఐ అధికారులు ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించారు. విస్తార(డిఫ్యూషన్) నోటీసు ఇవ్వాలని కోరారు. ఇది సాధారణ నోటీసు కన్నా తక్కువ ప్రభావం కలిగినది. కానీ ఒక వ్యక్తి ఆచూకీ లేదా అరెస్టు లేదా పోలీసు దర్యాప్తునకు సంబంధించిన అదనపు సమాచారం కోసం దీనిని కూడా వినియోగిస్తారు. ఒక ఎన్‌సిబి(ఈ కేసులో సిబిఐ) తాము ఎంచుకున్న సభ్య దేశాలు లేదా యావత్ ఇంటర్‌పోల్ సభ్యదేశాలకు నేరుగా విస్తార నోటీసును పంపిణీ చేయవచ్చు. అది ఇంటర్‌పోల్‌కు చెందిన సమాచార వ్యవస్థలో రికార్డవుతుంది అని ఇంటర్‌పోల్ వెబ్‌సైట్ పేర్కొంది. మోడీ, అతడి కుటుంబం ఆచూకీ ఒక్క రోజులో క నిపెట్టగలమనే ధీమాతో సిబిఐ ఉందని అధికారులు తెలిపారు.

మరో 8 మంది అధికారుల సస్పెన్షన్
మార్చి 31నాటికి ఇతర బ్యాంకులకు పిఎన్‌బి బకాయిల చెల్లింపు


వేల కోట్ల రూపాయల కుంభకోణానికి సంబంధించి మరో ఎనిమిది మంది అధికారులను పంజాబ్ నేషనల్ బ్యాంక్(పిఎన్‌బి) సస్పెండ్ చేసింది. వారిలో జనరల్ మేనేజర్ స్థాయి అధికారి కూడా ఉన్నారు. పిఎన్‌బి అంతర్గత వనరుల నుంచి నిధులు సేకరించి మార్చి 31 నాటికి ఇతర బ్యాంకులకు వారి బకాయిలను తిరిగి చెల్లిస్తుందని ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. బుధవారం 10 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో సస్పెండైన ఉద్యోగుల సంఖ్య 18కి చేరుకుంది. పూచీకత్తుగా పరిగణించే ఎల్ఓయూలు ప్రాతిపదికగా ఎంత మొత్తం రుణం పొందారనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నది అని అధికారి చెప్పారు. మరింత బకాయిలను వసూలు క్రమంలో సంబంధిత 36 ఖాతాలపై దర్యాప్తును బ్యాంకు ప్రారంభిస్తుందని తెలిపారు.

ఎస్‌బిఐకి పిఎన్‌బి కుంభకోణం సెగ... నీరవ్‌కు రూ.1,360 కోట్ల రుణం

నీరవ్ మోడీకి పంజాబ్ నేషనల్ బ్యాంక్ జారీ చేసిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్‌కు సంబంధించి తాము రూ.1,360 కోట్లు రుణం రూపేణా ఇచ్చినట్టు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఛైర్మన్ రజనీష్ కుమార్ శుక్రవారం ఇక్కడ విలేకరులతో అన్నారు. అయితే నీరవ్ మోడీతో తమకు నేరుగా ఆర్థిక లావాదేవీలు లేవని తెలిపారు. అయితే మెహుల్ చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ కంపెనీకి తాము కొద్ది మొత్తంలో మాత్రమే రుణం ఇచ్చినందున, దాని గురించి అంతగా కలత చెందడంలేదని ఆయన చెప్పారు.

యూబీఐ ఇచ్చింది రూ.1,915 కోట్లు

పిఎన్‌బి కుంభకోణానికి సంబంధించి తాము దాదాపు రూ.1,915 కోట్ల చెల్లింపులు జరిపినట్టు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) తెలిపింది. అయితే తాను చెల్లించిన నగదు ఎక్కడికి పోదని, ఆ మొత్తాన్ని రాబడతామని చెప్పింది. విదేశాల్లోని మా శాఖలు అధీకృత స్విఫ్ట్ మెస్సేజ్ ద్వారా పిఎన్‌బి జారీ చేసిన పలు లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్స్(ఎల్ఓయూలు) తో ఆర్థిక లావాదేవీలు జరిపాయని మీకు తెలియజేస్తున్నాము అని గురువారం రాత్రి పొద్దుపోయాక స్టాక్ ఎక్స్చేంజ్‌లకు యూబీఐ విన్నవించింది.





నీరవ్ ఆచూకీ తెలియదు: విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ స్పష్టీకరణ

పిఎన్‌బి కుంభకోణంలో ప్రధాన నిందితుడు నీరవ్ మోడీ ఎక్కడున్నది తమకు తెలియదని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) తెలిపింది. ఇదే విషయమైన ఎంఈఏ అధికార ప్రతినిధి రవీష్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. నీరవ్ మోడీ ఎంఈఏతో సంప్రదింపులు జరుపుతున్నాడా, అతడు ఎక్కడున్నది ప్రభుత్వానికి తెలుసా అని విలేకరులు ఆయన్ను ప్రశ్నించారు. నీరవ్ మోడీ తమ అధికారుల్లో ఏ ఒక్కరితోనూ సంప్రదింపులు జరపడంలేదని, అతడి ఆచూకీ మాకు తెలియదని రవీష్ కుమార్ బదులిచ్చారు. దావోస్‌కు ప్రధానమంత్రి అధికారిక బృందంలో నీరవ్ మోడీ భాగం కారని, వాణిజ్యవేత్తలతో ప్రధాని గ్రూప్ ఫొటో ఒక లాంఛనపూర్వకమైన ఘట్టమని ఆయన స్పష్టం చేశారు.

న్యూయార్క్‌లో నీరవ్ మోడీ మకాం

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు పంగనామం పెట్టి పత్తాలేకుండా పోయిన నీరవ్ మోడీ ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. కుంభకోణం వెలుగులోకి రావడానికి కొన్ని రోజుల ముందే భారత్ విడిచి వెళ్లిపోయిన నీరవ్ న్యూయార్క్‌లోని తన లగ్జరీ జ్యూయెలరీ స్టోర్‌కు సమీపంలోని జె.డబ్ల్యు మారియట్ ఎస్సెక్స్ హౌస్ హోటల్‌లో ఉన్నట్లు సమాచారం. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఈ నేపథ్యంలో నీరవ్ మోడీ ఆచూకీ కోసం సీబీఐ అధికారులు ఇంటర్ పోల్‌ను ఆశ్రయించారు. సీబీఐ అభ్యర్థన మేరకు ఇంటర్ పోల్ నీరవ్ మోడీతో పాటు ఆయన భార్య అమీ, తమ్ముడు నిశాల్ మోడీ, బిజినెస్ పార్టనర్ మెహుల్ చౌక్సీలపై లుకౌట్ నోటీసులు జారీ చేసింది. మరోవైపు కుంభకోణంతో సంబంధమున్న మరో 8 మంది సీనియర్ అధికారులను పంజాబ్ నేషనల్ బ్యాంక్ సస్పెండ్ చేసింది. మరోవైపు, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు మేరకు కుంభకోణానికి సంబంధించి సీబీఐ రెండో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.

ఇది యూపీఏ కుంభకోణం

రాహుల్ రాకతో నీరవ్‌కు రుణం
కాంగ్రెస్‌పై బీజేపీ ఎదురుదాడి

సంచలనం సృష్టిస్తున్న పిఎన్‌బి కుంభకోణాన్ని యూపీఏ కుంభకోణంగా బీజేపీ నేత, కేంద్ర మంత్రి ప్రకాష్ జవేదకర్ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ 2013, సెప్టెంబర్ మాసంలో ఢిల్లీలో నీరవ్ మోడీ ఏర్పాటు చేసిన ఆభరణాల ప్రదర్శనకు హాజరయ్యారు. ఆ మర్నాడే అలహాబాద్ బ్యాంక్ నీరవ్ మోడీకి రుణం మంజూరు చేసింది. బ్యాంక్ డైరెక్టర్లలో ఒకరైన దినేష్ దూబే వ్యతిరేకించినప్పటికీ రుణం మంజూరైంది అని తెలిపారు. పార్టీ అధ్యక్షుడు ఆభరణాల ప్రదర్శనకు హాజరుకావడానికి, నీరవ్ మోడీకి రుణం మంజూరు కావడానికి మధ్య సంబంధంపై కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేయాలి. కుంభకోణం నుంచి పరిశుద్ధంగా బైటపడాల్సిన వంతు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీది అని జవదేకర్ అన్నారు. బీజేపీ ప్రభుత్వం అప్రమత్తం చేయడంతోనే యూపీఏ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు.



మెహుల్ చౌక్సీతో పాటు ఆయనకు చెందిన గీతాంజలి గ్రూప్‌ను ఇందులో నిందితులుగా చేర్చింది. దాదాపు 4,887కోట్ల రూపాయల మేర అవకతవకలకు పాల్పడినట్లు పీఎన్‌బీ తన ఫిర్యాదులో స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో బ్యాంకు సమర్పించిన 143 లెటర్ ఆఫ్ అండర్ స్టాండింగ్స్, 224 ఫారిన్ లెటర్ ఆఫ్ క్రెడిట్స్‌ను సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పొందుపరిచింది.

అంబానీ కుటుంబంతో నీరవ్‌కు సంబంధాలు?

డైమండ్ కింగ్‌గా పేరొందిన నీరవ్ మోడీకి దేశంలో అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీకి సంబంధమున్నట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. అంబానీ బ్రదర్స్ మేనకోడలైన ఇషితా సల్గాంకర్‌ను నీరవ్ మోడీ తమ్ముడు నిశాల్ మోడీ ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరి ప్రీ వెడ్డింగ్ పార్టీని ముఖేష్ అంబానీ యాంటిలీనా హౌస్‌లో నిర్వహించడం విశేషం.

జెమ్స్ కంపెనీ సీజ్

రంగురాళ్లను లెక్కించే పనిలో ఈడీ అధికారులు



థానె: నీరవ్ మోడీ వివానా మాల్‌లో ఈడీ అధికారుల తనిఖీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం నేపథ్యంలో హైదరాబాద్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) అధికారులు పెద్ద ఎత్తున ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. పిఎన్‌బి కుంభకోణం వెలుగులోకి రావడం, అంతకు ముందే నీరవ్ మోడీ దేశం దాటి పారిపోవడంతో ఆయనతో పాటు ఈ కుంభకోణంతో సంబంధం ఉందని భావిస్తున్న వారందరి ఆస్తులు, సంస్థలు, కార్యాలయాలపై సిబిఐ, ఈడి అధికారులు దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ స్కాంతో సంబంధం ఉందంటూ సిబిఐ తన చార్జీషీట్‌లో నీరవ్ మోడీతో పాటు గీతాంజలి జెమ్స్ సంస్థల ఎండి మెహుల్ చోస్కీ పేరును కూడా పేర్కొంది. నీరవ్ మోడీతో పాటు మెహుల్ చోస్కీ కూడా పరారయ్యాడని సిబిఐ పేర్కొన్న విషయం తెలిసిందే. మెహుల్ చోస్కీకి చెందిన జెమ్స్ తయారీ కర్మాగారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని రావిర్యాల వద్ద ఉంది. ఈ కంపెనీలో ఈడి అధికారులు గురువారం అర్ధరాత్రి గం. 2 నుంచి శుక్రవారం ఉదయం గం. 6 వరకు సోదాలు జరిపారు. ఈ సోదాలలో దాదాపు మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల విలువ చేసే సామాగ్రిని, వస్తువులను సీజ్ చేసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా ఉన్న గీతాంజలి జెమ్స్ సంస్థలకు ఇక్కడి నుంచే జెమ్స్ వెళ్తుంటాయని, దేశంలోనే ఇది అత్యంత పెద్దదని ఈడి అధికారులు అంటున్నారు. రావిర్యాలలోని జెమ్స్ కంపెనీలో భారీ ఎత్తున రంగు రాళ్ళను స్వాధీనం చేసుకున్నామని, ఇందులో ఎన్ని జెమ్స్ ఉన్నాయి, ఎన్ని రంగురాళ్ళు అనేది తేల్చాల్సి ఉందని, ఇందుకు నిపుణులను రప్పిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. కంపెనీని తమ ఆధీనంలోకి తీసుకున్న ఈడి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేసింది. హైదరాబాద్ జెమ్స్ సెజ్‌లోని అయిదు సంస్థలు నక్షత్ర బ్రాన్స్ లిమిటెడ్, బ్రెజిల్ జ్యూవెల్లరీ ప్రైవేట్ లిమిటెడ్, నక్షత్ర వరల్డ్ లిమిటెడ్, గిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లను కూడా ఈడి అధికారులు సీజ్ చేశారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో దాదాపు 200 ఎకరాలలో ఈ సెజ్‌ను ఏర్పాటు చేయగా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. తన చేతుల మీదుగా మెహుల్ చోస్కీకి సెజ్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను అందించారు. ఈ సెజ్ అభివృద్ధికి రూ. 500 కోట్లను వెచ్చించనున్నట్లు చోస్కీ ఈ సందర్భంగా ప్రకటించారు. 2016 - 17 ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన బ్యాలెన్స్ షీట్‌లో సెజ్ రూ. 6.6 కోట్ల నష్టం వచ్చినట్లు పేర్కొన్నారు.



Estd 1938

ఆంధ్రప్రభ

www prabhanews com

Journalism first!

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: శుద్ధ విదియ తె. 4.07 వరకు, అనంతరం తదియ; నక్షత్రం: శతభిషం ఉ. 11.04 వరకు, అనంతరం పూర్వాభాద్ర;
అమృతకాలం: తె. 3.50 నుండి 5.30 వరకు;
వర్జ్యం: సా. 5.43 నుండి 7.23 వరకు;
దుర్ముహూర్తం: ఉ. 6.00 నుండి 7.36 వరకు;
రాహుకాలం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;
యమగండం: మ. 1.30 నుండి 3.00 వరకు;

సంపుటి:56 • సంచిక:307 • శనివారం 17 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల: 5.00 • Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad



నేడు కేసీఆర్ బర్త్‌డే

- గులాబీ శ్రేణుల ముమ్మర ఏర్పాట్లు • రక్తదానం, అన్నదానంతో పాటు సామాజిక కార్యక్రమాల నిర్వహణకు కసరత్తు • నగరమంతా గులాబీ మయం
- జలవిహార్‌లో ప్రత్యేక కార్యక్రమాలు • కేసీఆర్ బర్త్‌డే పాటల సీడీ ఆవిష్కరణ

2 లో



ప్రత్యేక కథనాలు 13, 14, 15, 16, పేజీల్లో

రాష్ట్రమంతటా... పెళ్లికళ


ఈ ఐదు నెలలూ పెళ్లి బాజాలే!

శుభ ముహూర్తాలతో పెళ్లిసందడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: పెళ్లిళ్లూ, శుభ కార్యాలకు ముహూర్తాలు సమీపించాయి. ఈ నెల 17నుంచి జూలై 7 వరకు మంచి ముహూర్తాలతో రాష్ట్రం సందడిగా మారనుంది. ఫిబ్రవరి నుంచి ఆషాడం వచ్చే వరకు అంటే జూలై7 వరకు ముహూర్తాలతో పెళ్లి భాజాలకు సర్వం సిద్ధమవుతున్నది. ఒక్కో నెలలో 5నుంచి 12 వరకు బలమైన ముహూర్తాలున్నాయని పండితులు చెబుతున్నారు. ఫిబ్రవరిలో 17, 19, 23, 24, 26లతోపాటు మార్చిలో 4, 8, 10, 12, 14 ఏప్రిల్‌లో 1, 2, 5, 11, 19, 20, 22, 25, 27, 28, 29, 30, మే నెలలో 2, 9, 10, 16, జూన్‌లో 16, 20, 21, 22, 27, 28, 30, జూలై 1, 5, 6, 7 తేదీల్లో దివ్యమైన ముహూర్తాలు వస్తున్నాయి. ఆ తర్వాతే ఆషాడం ప్రారంభం కానుంది. మే 16నుంచి జూన్ 13 వరకు అధిక జేష్ఠ్య మాసం ఉండనుంది. మార్చి 4, 8, 10, 14 తేదీల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. మార్చి 4వ తేదీ ముహూర్తానికి విశేష ప్రాధాన్యత ఉందని తెలిసింది. ఆదివారం కావడంతో పాటు మరింత మంది ఈ ముహూర్తానికి మొగ్గు చూపుతున్నారు. కాగా ఈ ఏడాది పెళ్లిళ్లు ఖరీదుకు ఆనవాళ్లుగా మారాయి. కేటరింగ్‌నుంచి మొదలుపెడితే అలంకారం, డెకరేషన్ వరకు అంతా కాస్టీలీగా మారింది. ధరలు పెరగడం, డిమాండ్ ఎక్కువ కావడంతో సహజంగానే కొరత నెలకొంది. ఏర్పాట్లు ఖర్చు కూడా విపరీతంగా ⇨ 9వ పేజీలో...

పిఎన్‌బి స్కామ్

రాహుల్ రంగు?!



నీరవ్ నివాసానికి సమన్లు అతికిస్తున్న ఈడీ అధికారులు



- కాంగ్రెస్ అధ్యక్షుడిపై బీజేపీ ఎదురుదాడి
- నీరవ్ మోడీ, మెహుల్‌కు ఈడీ సమన్లు
- తాత్కాలికంగా పాస్‌పోర్టుల నిలుపుదల
- నీరవ్ ఆచూకీ తెలియదన్న కేంద్రం
- రెండోరోజూ 35 ప్రాంతాల్లో సోదాలు
- రూ.549 కోట్ల మేర ఆభరణాలు సీజ్
- 8 మంది బ్యాంక్ అధికారులపై వేటు
- బాధిత బ్యాంకుల్లో ఎస్‌బిఐ, యూబిఐ
- న్యూయార్క్ హోటల్లో నీరవ్ ఫ్యామిలీ?
- లుక్‌అవుట్ నోటీసులిచ్చిన సీబిఐ, ఈడీ
- 29 ఆస్తులు జప్తు, 105 ఖాతాలు సీజ్

భారతీయ బ్యాంకింగ్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా పేరు గడించిన పిఎన్‌బి కుంభకోణం రాజకీయ రంగు పులుముకుంది. మోడీ సర్కారుపై ఎడతెరిపిలేకుండా విమర్శనాస్త్రాలు సంధిస్తున్న కాంగ్రెస్ పార్టీపై అధికార బీజేపీ ఎదురు దాడికి దిగింది. సాక్షాత్తూ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై బ్రహ్మాస్త్రాన్ని సంధించింది. రాహుల్ చొరవ కారణంగానే యూపీఏ హయంలో నీరవ్ మోడీకి అలహాబాద్ బ్యాంక్ రుణం ఇచ్చిందని ఆరోపించింది. కుంభకోణాన్ని యూపీఏ కుంభకోణంగా పేర్కొంది. కుంభకోణంపై చురుగ్గా స్పందిస్తున్న సిబిఐ కొత్తగా మరో ఎఫ్ఐఆర్‌ను దాఖలు చేసింది. నీరవ్ మోడీ, మోహుల్‌లకు ఈడీ సమన్లు జారీ చేసింది. దేశవ్యాప్తంగా శుక్రవారం 35 చోట్ల జరిపిన సోదాల్లో రూ.549 కోట్ల విలువైన వజ్రాభరణాలు, స్వర్ణాభరణాలు స్వాధీనం చేసుకుంది. నీరవ్, మోహుల్ పాస్‌పోర్టులను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నాలుగు వారాల కాలానికి తాత్కాలికంగా రద్దు చేసింది. కుంభకోణ బాధిత బ్యాంకులుగా ఎస్‌బీఐ, యూబీఐ వెలుగులోకి వచ్చాయి.

వివరాలు 2లో

ఎర్ర జొన్నకు మద్దతు ధర

- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు • అక్రమాలపై నిఘా • పొరుగు నుంచి రాకుండా చర్యలు
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి హరీష్ రావు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎర్రజొన్న సేకరణపై సవాళ్లను అధిగమించేందుకు మార్కెటింగ్ శాఖ సమాయత్తమవుతోంది. ఈ అంశంపై తక్షణమే ఆర్మూరును సందర్శించాల్సిందిగా వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులను మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు శుక్రవారం నాడు ఆదేశించారు. ఎర్రజొన్నల కొనుగోలుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆర్మూరు సందర్శనతో చర్యలు ముమ్మరం కానున్నాయి. ఎర్రజొన్న రైతులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని ఆయన ఈ సందర్భంగా ఆదేశించారు. నిజామాబాద్ ⇨ 9వ పేజీలో...



పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోడీ

ఫలితాలు ఆలోచించను

- ఇవ్వడంపైనే నా దృష్టి
- ఎన్నికలు కేవలం ఉపఉత్పత్తులు
- అదే నా రాజకీయ పంథా
- ఆత్మవిశ్వాసంతో పరీక్ష నెగ్గొచ్చు
- ప్రతి భారతీయ విద్యార్థి జన్మతః రాజకీయ నేత
- నా పరీక్షకు 125 కోట్ల మంది శుభాకాంక్షలున్నాయి
- మీ అందరికీ నా శుభాకాంక్షలు
- పరీక్షా పే చర్చలో ప్రధాని మోడీ

ఫలితాలు, మార్కులు పరీక్షల తాలూకు ఉప ఉత్పత్తులు. పరీక్షలకు వెళ్ళేవారెవరైనా సరే వారికి తెలిసినంతవరకు ఉత్తమమైనదాన్ని అందించడంపై శ్రద్ధ పెట్టాలి. నేను రాజకీయాల్లో అదే పద్ధతి అనుసరిస్తుంటాను. నా తోటి భారతీయులకు నా దగ్గరున్న ప్రతిదీ ఇవ్వడంపైనే దృష్టి పెడుతుంటాను. ఫలితాల గురించి మీరెక్కువగా ఆలోచించిన పక్షంలో అది ఇతర విషయాలను సాధించే మార్గానికి అడ్డుపడుతుంది. ఎన్నికలు, ఫలితాలు వస్తుంటాయి.. పోతుంటాయి. అవి ఉప-ఉత్పత్తులు లాంటివి. మీరు బోర్డు పరీక్షల్లో బాగా రాణించాలని శుభాకాంక్షలు చెబుతున్నాను. నా బోర్డు పరీక్షల విషయానికి వస్తే, 125 కోట్ల మంది భారతీయుల శుభాకాంక్షలు నాతోఉన్నాయి. పరీక్షా పే చర్చ కార్యక్రమం సందర్భంగా 2019లో తన పరీక్షకు తన సొంత సన్నాహకాల గురించి ప్రధాని నరేంద్ర మోడీ అన్న మాటలివి.

న్యూఢిల్లీ: ప్రధాని ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చ కార్యక్రమం శుక్రవారం ఇక్కడి తాల్‌కటోర స్టేడియంలో జరిగింది. దేశవ్యాప్తంగా 10, 12వ తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న 3,000 మందికి పైగా విద్యార్థినీ విద్యార్థులతో నరేంద్ర మోడీ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వారు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానాలు ఇచ్చారు. ముందుగానే ప్రకటించిన కార్యక్రమం కావడంతో ప్రధాని కార్యాలయానికి వేలాదిగా ప్రశ్నలు వచ్చాయి. ఒత్తిడి, తల్లిదండ్రుల ఒత్తిడి, యోగా, పోటీని తట్టుకోవడం ఎలా అనే అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పరీక్ష ఒత్తిడిని తట్టుకోవడంలో ఆత్మవిశ్వాసం, శ్రద్ధ తాలూకు ప్రాముఖ్యతను ప్రధాని నరేంద్ర మోడీ ⇨ 9వ పేజీలో...

కావేడీ



- తమిళనాడుకు తక్కువ నీరు
- బెంగళూరు అవసరాలకు 4.2 టీఎంసీలు
- 15 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- సుప్రీంకోర్టు తీర్పు వెల్లడి
- కర్నాటకలో సంబరాలు..
- తమిళనాడులో ఆందోళనలు
- ముందస్తు చర్యగా ఇరు రాష్ట్రాల్లో పోలీసు బందోబస్తు
- రెండు రాష్ట్రాల మధ్య నిలిచిన రాకపోకలు

10 లో



బయ్యారం స్టీల్ ప్లాంట్‌కు

లైన్‌క్లియర్!?

- మెకాన్ ముసాయిదా నివేదిక
- ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుపై పలు సూచనలు
- రాష్ట్రం ముందుకొస్తే ఓకే?

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో స్టీల్ ప్లాంట్లు నెలకొల్పడంపై మెకాన్ సంస్థ తమ ముసాయిదా నివేదికను కేంద్రానికి అందజేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కడప వద్ద, తెలంగాణ రాష్ట్రంలోని బయ్యారం వద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ రెండు స్టీల్ ప్లాంట్ల ఏర్పాటు కోసం తొలుత అధ్యయనం చేసిన కమిటీలు ఫీజిబిలిటీ లేదు అని నివేదికలిచ్చాయి. ఇంటిగ్రేటెడ్ ⇨ 8వ పేజీలో...

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నాన్రృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శనివారం 17 ఫిబ్రవరి 2018

మాల్యా సరసన నీరవ్!

దేశంలో రెండో అతి పెద్ద బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకును బురిడీ కొట్టించిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ అందరికళ్ళ ముందే విదేశాలకు జారుకున్న తీరు విజయ్ మాల్యా, లలిత్ మోడీ పరారీ ఉదంతాలను గుర్తుకు తెస్తోంది. మాల్యా, లలిత్‌కు రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలుండేవి. క్రికెట్ పోటీల పేరిట రాజకీయ,క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో ఫొటోలు దిగడం, ప్రారంభోత్సవాలకు హాజరు కావడంతో సెలబ్రిటీలుగా గుర్తింపు పొందారు. నీరవ్ వ్యాపారానికే పరిమితమైన వ్యక్తి. అయినప్పటికీ, 11 వేల కోట్లకు పైగా పిఎన్‌బి నుంచి రుణాలు ఎలా సంపాదించాడన్నది అంతుచిక్కని విషయమే. ద్వితీయ శ్రేణి అధికారులు, దిగువస్థాయిని మంచి చేసుకుని ఆయన ఈ పెద్ద మొత్తాన్ని జేబులో వేసుకున్నట్టు దర్యాప్తు సంస్థల అధికారులు అందిస్తున్న సమాచారం సంకేతిస్తున్నది. ఈ కుంభకోణం వెనక ఇంకా చాలా మంది ఉండి ఉంటారని, ప్రభుత్వ పెద్దల ఆశీస్సులతోనే వారు ఈ మోసానికి పాల్పడి ఉంటారని ప్రజలు అనుమానిస్తున్నారు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు, చిట్ ఫండ్ సంస్థల మోసాలకు విలవిల్లాడుతున్న మధ్యతరగతి వర్గాల కష్టార్జితానికి జాతీయకృత భరోసా ఇస్తున్న బ్యాంకులకే ఇంతపెద్ద మొత్తంలో టోపీ పెట్టే ఘనులు తయారైన ఉదంతాలు సామాన్యుల నమ్మకాన్ని చెదర గొడుతున్నాయి. రైతులు రుణాల కోసం కాళ్లరిగేలా తిరిగినా కనికరించని బ్యాంకులు బడా పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలకు ఇంత పెద్ద మొత్తాల్లో రుణాలు ఎలా ఇస్తున్నాయన్న ప్రశ్న సహేతుకమైనదే. ఇంతకీ ఇంత పెద్ద కుంభకోణానికి దిగువ స్థాయి ఉద్యోగులు ఇద్దరు మాత్రమే బాధ్యులను చేయడం మంటే మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నమే. నీరవ్ మోడీకి చెందిన సంస్థలపైన 280 కోట్ల రూపాయల అస్తులను, వజ్రాలను స్వాధీనం చేసుకున్నామని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. బ్యాంకుల మొండి బకాయిల గురించి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ మధ్యనే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ప్రస్తావించారు. బ్యాంకుల మూల ధనాన్ని పెంచేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యల గురించి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సోదాహరణగా వివరించారు. ఇవన్నీ సామాన్యులకు బ్యాంకులు మళ్ళీ పూర్వపు భరోసాతో పనిచేస్తాయన్న నమ్మకం కలిగించే ప్రయత్నంలో భాగమే. యూపీఏ ప్రభుత్వ హయాంలో బ్యాంకింగ్ వ్యవస్థ ఛిద్రం పట్టి పోయిందని ఇదివరలో చెప్పిన ప్రధానమంత్రి మోడీ తన హయాంలో ఇంత పెద్ద కుంభకోణం వెలుగు చూడటంపై ఎలా స్పందిస్తారో చూడాలి. దీనికి కూడా యూపీఏ హయాంలోనే బీజాలు పడ్డాయని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఎదురు దాడి చేస్తున్నారు. అది అసత్యం కాకపోవచ్చు కానీ, యూపీఏ హయాంలో జరిగిన అక్రమాలను సరిదిద్దుతున్నట్టు అదే పనిగా ప్రధాని, మంత్రులు ఒక వంకతో చెప్పుకుంటున్న తరుణంలో ఈ కుంభకోణం వెలుగులోకి రావడం, ప్రధాన సూత్రధారి చల్లగా విదేశాలకు జారుకోవడం విడ్డూరమే. కోర్ బ్యాంకింగ్ సిస్టమ్ ద్వారా జరిగే బ్యాంకింగ్ లావాదేవీలను పిఎన్‌బి సిబ్బంది కోర్‌లో అధారంగా ఎలా నిర్వహించారో నిగ్గు తేలాలి. అదీకూడా ప్రధాన బ్యాంకుల లావాదేవీలపై రిజర్వు బ్యాంకు కన్నేసి ఉంచినా ఈ మోసం జరిగిందంటే, కేంద్రబ్యాంకు సమర్థతపై అనుమానాలు రేకెత్తే ప్రమాదం ఉంది. పెద్ద నోట్ల రద్దు పర్యవసానంగా దేశంలోని బ్యాంకుల్లో నగదు నిల్వలు కాలిపోయిన లేకపోవడంతో ఏటీఎంల వద్ద మళ్ళీ నోక్యాష్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని బ్యాంకుల్లో నగదు నిండుకుందని, తక్షణం పదివేల కోట్ల రూపాయలను పంపమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి ఈ మధ్యనే లేఖ రాశారు. దాచుకున్న డబ్బును వాపసు తీసుకోవడానికి ఖాతాదారులు ఒక వంక నానా అగచాట్లు పడుతుండగా, ఘరానా మోసగాళ్ళు వేల కోట్ల రూపాయలను బ్యాంకుల నుంచి ఎలా పొందుతున్నారన్నది అంతుచిక్కని విషయమే. నీరవ్ మోడీ రాజకీయ సంబంధాల గురించి సమాచారం ఎక్కువ పొక్కకపోయినా, ఆయన 2013 నుంచి ఫోర్బ్స్ ఏటా ప్రకటించే కుబేరుల జాబితాలో స్థానాన్ని పొందుతున్నారు. ఆయన అంతర్జాతీయ కార్యకలాపాలపై రిజర్వు బ్యాంకు నిఘా వేసింది. అయినా ఎలా తప్పించుకోగలిగాడు. నీరవ్, లలిత్ మోడీలు, మాల్యాలు తామేమీ తప్పు చేయలేదనీ గడువు ఇస్తే బ్యాంకులకు చెల్లించాల్సిన సొమ్ము చెల్లిస్తామని ప్రకటిస్తారు. అలాంటి ప్రయత్నాల ద్వారా ఎంతో కొంత సొమ్మును రాబట్టడం తెలివైన పని అవుతుంది తప్ప, వారి గురించి అదే పనిగా ప్రకటనలు చేయడం వల్ల మరో హర్షద్ మెహతాగా పేరు మోస్తారే తప్ప జనానికి ఒరిగేదేమీ ఉండదు. విదేశాల్లో తలదాచుకున్న ఆర్థిక నేరస్తులను స్వదేశానికి రప్పించడంలో, విదేశీ బ్యాంకుల్లోని వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడంలో ఆనాడు యూపీఏ ప్రభుత్వం బాటలోనే ఇప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వం విఫలమవుతోంది. బోఫోర్స్ సూత్రధారి క్వత్రోచీని రప్పించడంలో, అతడి ఖాతాలను సీజ్ చేయడంలో యూపీఏ విఫలమైనప్పుడు తాము అధికారంలో ఉండి ఉంటే తాటతీస్తామని వాళ్లపని కుంభకోణాలకు తరచూ ప్రకటనలు చేసిన విషయం ప్రజలకు గుర్తుంది. తమది అవినీతి మరక అంటని ప్రభుత్వమని మోడీ పదేపదే చెప్పుకుంటున్నారు. ఇలాంటి కుంభకోణాలు వెలుగుచూసినప్పుడు ఆయన పాలనలోనూ అవినీతి రాజ్యమేలుతోందని స్పష్టం అవుతోంది.

త్రిపుర తీర్పు ఎటు!

కమలమా.. అరుణమా!

ఈశాన్య రాష్ట్రం త్రిపుర శాసనసభకు ఈ నెల 18న ఎన్నికలు జరుగుతాయి. 60 స్థానాలున్న ఈ శాసన సభలో ప్రస్తుతం సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దీన్ని గద్దె దించి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడానికి బిజెపి - సంఘ పరివారం ఇప్పుడు శక్తియుక్తులన్నింటినీ కేంద్రీకరించి పోరాడుతోంది. త్రిపుర జనాభాలో 69 శాతం బెంగాలీలు. 31 శాతం వివిధ తెగల ఆదివాసీలు. షెడ్యూల్డు తెగలకు రిజర్వు చేసిన 20 స్థానాల్లో ఎప్పుడూ కమ్యూనిస్టులదే ఆధిపత్యం. స్వర్గీయ దశరథదేవ్, బీరేన్ దత్తా వంటి కమ్యూనిస్టు యోధాన యోధులు 1940లో గణశిక్షా పరిషత్‌ను స్థాపించినప్పటి నుండి ఆదివాసీల్లో అక్షరాస్యతను పెంపొందించి వారి సర్వతోము ఖాభివృద్ధికి కృషి చేశారు. ఈ కారణంగానే త్రిపుర ఆదివాసీలు ఎర్రజెండాను వీడలేదు. 1982లో ఏర్పడిన తొలి వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వం ఆదివాసీల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణకై టిటిఎడిసి ద్వారా ప్రత్యేక కార్యక్రమాలను అమలుచేసింది. గత 20 ఏళ్ళుగా త్రిపుర ముఖ్యమంత్రిగా మాణిక్ సర్కార్ వ్యవహరిస్తున్నారు. ఆయన దేశంలోనే అతిపేద ముఖ్య మంత్రిగానూ, అత్యంత నిజాయితీ పరుడిగా నూ పేరుపొందారు. త్యాగధనుడిగా, నిరాడంబరునిగా కీర్తికెక్కారు. అయినా ప్రధాని మోడీ, ఇతర బీజేపీ - సంఘ పరివార నేతలు మాణిక్ సర్కార్‌పై దుష్ప్రచారం కొనసాగిస్తున్నారు. 2 దశాబ్దాల పాటు తప్పుడు మాణిక్యాన్ని విశ్వసించిన త్రిపుర ప్రజలు ఈసారి నిజమైన హీరా (హైవే, ఐవే, రోడ్ వే, ఏర్ వే) వజ్రాన్ని ఎంపిక చేసుకోవాలని, ప్రధాని మోడీ వివిధ ఎన్నికల ప్రచారసభల్లో కోరారు. మాణిక్‌సర్కార్ పేరు ప్రస్తావించకుండానే అవినీతిని, పాలనా వైఫల్యాలను నిజాయితీ ముసుగులో కప్పిపుచ్చుకున్న ముఖ్యమంత్రిని ప్రధాని మోడీ అభివర్ణించారు. ఈసారి మార్పు, అభివృద్ధి కోసం తీర్పివ్వాలని కోరుతున్నారు. ఇది దుష్పరిపాలన సాగిస్తున్న వామపక్ష ఫ్రంట్‌కు -బిజెపి మధ్య పోరుకాదనీ, మార్పు కోరుతున్న త్రిపుర ప్రజలు కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరనీ పేర్కొంటున్నారు. 25 ఏళ్ళుగా కట్టుకథలు చెబుతూ, అసత్యాలు వినిపిస్తూ వైఫల్యాలు, నేరాలు, అవినీతితో సామాన్యుల జీవితాలను వామపక్ష ఫ్రంట్ దుర్భరం చేసిందనీ, కాషాయ కూటమిని గెలిపిస్తే త్రిపుర ప్రజల జీవితాలలో వెలుగులు నింపుతామనీ మోడీ నమ్మకంగా చెబుతున్నారు. త్రిపుర రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసిన అప్పటి రాజు వీర విక్రమ్‌కు నివాళులర్పించడం ద్వారా సంస్థానాధీశులపై తన భక్తిని చాటారు. 2013 శాసనసభ ఎన్నికల్లో కేవలం 1.54 శాతం ఓట్లు మాత్రమే సాధించిన బిజెపి 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని 5.7 శాతానికి, 2015 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల శాతాన్ని 14.24 శాతానికి పెంచుకుని, క్రమేణా బలపడుతూ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్‌ను ఆవలికి నెట్టి ఇప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటను బద్దలు చేసి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడానికి వ్యూహరచన చేస్తోంది. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాలీల ప్రాబల్యం అధికంగా ఉండే 19 స్థానాల్లో సిపిఎం ఆధిక్యత 4 వేల కంటే తక్కువ. ఇప్పుడు ఆ స్థానాలను దక్కించుకోవడానికి కమలనాథులు చేయవలసిందంతా చేస్తున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి, డబ్బు, పదవులు ఎరవేసి ప్రత్యర్థి పార్టీలను ఎన్నికలకు ముందే నీరుగార్చి వారి స్థానాన్ని ఆక్రమిస్తున్నారు. అస్సాం, మణిపూర్ లలో బిజెపి ప్రభుత్వాల ఏర్పాటులో కీలక పాత్ర వహించిన అస్సాం ఆర్థికమంత్రి హిమంత బిశ్వశర్మనూ బిజెపి ఇప్పుడు త్రిపుర ఎన్నికల ఇన్‌ఛార్జిగా నియమించింది. కాంగ్రెస్ గుట్టుమట్లు తెలిసిన మాజీ కాంగ్రెస్ నేత హిమంత శర్మ 5 సార్లు అగర్తల ఎంఎల్ఏగా గెలిచిన సుదీప్ రాయ్ బర్మన్ సహా 8 మంది ప్రముఖ త్రిపుర కాంగ్రెస్ నేతలను కమలం పార్టీలో చేర్చుకోవడం ద్వారా కాంగ్రెస్‌ను బలహీనపరచారు. పటిష్ఠమైన సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల బలగం దండీగా ఉన్న సిపిఎంను ఎదుర్కోవడానికి సంఘ పరివారం మూడేళ్ళ ముందునుండే 60 అసెంబ్లీ స్థానాల్లో ఇంటింటికీ తన కార్యకర్తలను పంపి కరపత్రాలు, సమావేశాల ద్వారా వామపక్ష ఫ్రంట్ దుష్పరిపాలన నుండి విముక్తికి, మార్పుకోసం ఓటేయాలని ప్రచారాన్ని సాగిస్తోంది. మోడీ ప్రభుత్వం, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా త్రిపుర ఇన్‌ఛార్జి హిమంత బిశ్వశర్మకు అవసరమైన వనరులిస్తూ, ఎప్పుడు కావాలంటే అప్పుడు త్రిపుర వెళ్లడానికి గౌహతిలో ఆయన ఆధీనంలో అద్దె విమానాన్ని సిద్ధంగా ఉంచింది. 2013 ఎన్నికల్లో బిజెపి 50 స్థానాలకు పోటీచేసి 49 సీట్లలో ధరావతులు కోల్పోయింది. త్రిపుర జనాభా 36 లక్షలు కాగా బిజెపి 2 లక్షల కార్యకర్తల బలగముంది. 35 వేల మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు ప్రస్తుతం ప్రచారంలో నిమగ్నమై సిఎం మాణిక్ సర్కార్‌పై వ్యక్తిగత నిందా ప్రచారం సాగించడాన్ని అభ్యుదయవాదులు సహించలేకపోతున్నారు. మాణిక్ సర్కార్ బ్యాంకు ఖాతాలో ఉన్నది కేవలం రూ.3 వేలే. సిఎం గా తనకు అందే వేతన, భత్యాలను సిపిఎంకు విరాళమిచ్చి పార్టీ ఇచ్చే రూ.10 వేల అలవెన్సుతో నిరాడంబర జీవితం గడుపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసి రిటైరైన మాణిక్ సర్కార్ భార్య ఆర్భాటాలకు పోకుండా సామాన్యుల వలే సాదా సీదాగా సైకిలు రిక్షాలో తిరుగుతుంటారు. మాణిక్ సర్కార్ తన అధికార వాహనాన్ని ప్రచారానికి వాడుకోవడం లేదు. తనపై బిజెపి వ్యక్తిగత నిందా ప్రచారం చేయడాన్ని ప్రస్తావిస్తూ అది ఆ పార్టీ బలహీనతకు నిదర్శనమని, ప్రజలకు నిజమేమిటో తెలుసనీ, వారు ఎన్నికల్లో తగు తీర్పు చెబుతారనీ సిఎం మాణిక్ సర్కార్ అంటున్నారు. ఎవరెన్ని దుష్ప్రచారాలు చేసినా వామపక్ష ఫ్రంట్ త్రిపురలో 8వ దఫా గెలవడం ఖాయమని మాణిక్ సర్కార్ అన్నారు. ఆదివాసీల తిరుగుబాట్లతో అతలాకుతలమైన త్రిపురలో శాంతిని నెలకొల్పామని ఆయన అంటున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో కుల, మత, విద్వేషాలను రెచ్చగొట్టి జన విభజన ద్వారా శాంతిభద్రతలకు భంగం కల్గిస్తున్నారని, కమలనాథుల కుతంత్రాలపై అప్రమత్తంగా ఉండాలనీ మాణిక్ సర్కార్ ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో బిజెపి 51 స్థానాలకు, మిత్రపక్షం ఇండి జెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎస్‌టి) 9 స్థానాలకు పోటీ చేస్తుండగా సిపిఎం 57, సిపిఎం, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్‌ఎస్‌పి చెరో స్థానానికి పోటీ చేస్తున్నాయి. మొత్తం 297 మంది అభ్యర్థులు 60 స్థానాలకు పోటీలో ఉన్నారు వారిలో 20 మందే మహిళలు. పోటీలో ఉన్నవారిలో 35 మంది కోటీశ్వరులు. వారిలో 18 మంది కోటీశ్వరులు బిజెపికీ, 9 మంది కాంగ్రెస్,
నలుగురు సిపిఎం, ఐఎన్‌పిటి ఇద్దరు, ఐపిఎస్‌టి, ఎఐటిసికీ చెందిన వారు. వామపక్ష అభ్యర్థులలో 10 మంది కొత్తవారు 51 మంది బిజెపి అభ్యర్థుల సగటు ఆస్తులు రూ.1.35 కోట్లు, 59 మంది కాంగ్రెస్ అభ్యర్థుల సగటు ఆస్తి రూ.53.16 లక్షలు కాగా 57 మంది సిపిఎం అభ్యర్థుల ఆస్తుల సగటు విలువ రూ.39.91 లక్షలు.

సిపిఎం 2013 ఎన్నికల్లో 60 స్థానాలకు గాను 49 సీట్లు గెలిచి, 48 శాతం ఓట్లు తెచ్చుకోగా, కాంగ్రెస్‌కు 10 సీట్లు, 37 శాతం ఓట్లు, ఇతరులకు 1 సీటు 15 శాతం ఓట్లు వచ్చాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో సిపిఎం 2 సీట్లు గెలవగా ఓట్లు 65 శాతానికి పెరిగాయి. కాంగ్రెస్‌కు కేవలం 20 శాతం ఓట్లే వచ్చాయి. బిజెపి ఇప్పుడు కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేసి త్రిపురలో విజయభేరి మోగించాలని ఉవ్విళ్ళూరుతోంది.

మోడీ ప్రభుత్వం తూర్పు వైపు చూపు. ఆసియన్ దేశాలతో ఆర్థిక, వాణిజ్య, రవాణా సంబంధాలు పెంపొందించుకోవాలనే ప్రయత్నాలలో సరిహద్దు రాష్ట్రం త్రిపుర భూమార్గంగా కీలక పాత్రవహిస్తుంది. అందువల్ల అఖిల భారత వైద్య శాస్త్రాల సంస్థను పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగాన్ని రూపుమాపి, త్రిపుర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తామని ప్రధాని మోడీ సహా కమలనేతల హామీలిస్తున్నారు. కేంద్రం పైనే నిధులపై అధికంగా ఆధారపడుతున్నందువల్ల, ప్రజలు కమల వికాసానికి తోడ్పడుతారో, యధావిధిగా అరుణ పతాక నీడన కొనసాగుతారో 18న తేలనుంది.

◆ పతకమూరు దామోదర్ ప్రసాద్,
9440990381

తమిళనాట కా..వేడి

ఈ భూగోళంలో మూడో వంతు నీళ్ళుంటే...ఒక్క వంతు మాత్రమే భూమి. అక్కరకొచ్చేది తక్కువే. నదీనదాలే సమస్త మానవాళి జీవనానికీ ఆధారం, తాగేందుకయినా.. వ్యవసాయానికైనా..పారిశుద్ధ్య కార్యక్రమాలకైనా నీరు కావాల్సిందే. అలాంటి నీటిని ఎంత జాగ్రత్తగా వాడుకోవాలి. ఉన్నది సక్రమంగా పంచుకోవాలి. అందరికీ అందేలా చూసుకోవడమే కాక, భవిష్యత్తరాలకూ ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. గుక్కెడు నీటికోసం కిలోమీటర్ల కొద్దీ నడుచుకెళ్ళే దృశ్యాలు ఇప్పటికీ మనకు నిత్యం గోచరిస్తూనే ఉంటాయి. జలవివాదాల కారణంగా అక్కడక్కడా ఘర్షణలూ తప్పటం లేదు. గతంలో వ్యక్తులకే పరిమితమైన ఈ సంఘర్షణ రాష్ట్రాల నడుమా తలెత్తుతోంది. చైనాకూ-మనకూ బ్రహ్మ పుత్ర నదీజలాల వివాదం ఉండనే ఉంది. గోదావరి జలాలతో మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ తగవులాడుకున్నాయి. ప్రస్తుతం తెలంగాణ-నవ్యాంధ్ర ప్రదేశ్ నడుమ కృష్ణా జలాల పంపిణీ సమస్యగా మారింది. కృష్ణా జలాల వివాదం కర్ణాటకతో కొనసాగుతూనే ఉంది. ఎప్పటికీ వీడని పీటముడిలా కావేరీ జలాల సమస్య కర్ణాటక, తమిళనాడు మధ్య బిగుసుకుపోయింది. గోవా-కర్ణాటక నడుమ మహాదాయి నదీ జలాల పంపిణీ ఎప్పటికీ తెగనిదే. తాజాగా కావేరి సలసల మరుగుతోంది. ఏడాది క్రితం సుప్రీం తీర్పు కర్ణాటక-తమిళనాడు మధ్య అగ్గి రాజేసింది. కన్నడిగులు, తమిళులు పరస్పరం ఆగ్రహోదగ్రులై ఆస్తులను తగుల పెట్టుకున్నారు. బెంగళూరులో కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. సాగు నీరు లేక తమిళనాట రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఆత్మహత్యలకూ వారు తెగబడుతున్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తమిళ రైతులు నెలల తరబడి భిన్న రీతులలో నిరసనలు వ్యక్తం చేశారు. మూత్రం తాగడం, అర్ధనగ్నంగా ఉండడం, ఉరితాళ్ళు చేత బూనడం, ఎండా వానా లేకుండానూ.. చలిని లెక్కపెట్టకుండానూ ఆందోళనలు చేశారు. ఏం చేసినా కేంద్రం దిగిరాలేదు.. ఎగువనున్న కర్ణాటక వైఖరిలో వీసమెత్తు మార్పు లేదు. సాటి రైతుల ఇక్కట్లు చూసి, ఆ గుండె కరిగితే వచ్చే కొద్దిపాటి జలాలతో పంట వేసుకుందామన్న అన్నదాత ఆశలు ఆవిరైపోయాయి. శుక్రవారం అత్యున్నత న్యాయస్థానం కావేరీ జలాల పంపకంపై ఇచ్చిన తీర్పు వారి ఇబ్బందుల్ని మరింత పెంచేలా ఉంది. తమిళనాడుకు ఇస్తున్న కావేరీ జలాల వాటాలో కోతపెట్టి, కర్ణాటకకు 14.75 టిఎంసీల నీటిని అదనంగా కేటాయించింది. బెంగళూరును దృష్టిలో ఉంచుకుని ఈ కేటాయింపు చేసింది. దీనికి కారణం తమిళనాడుకున్న భూగర్భ జలాలని పేర్కొంది. నదీజలాల పంపిణీలో భూగర్భ జలాల ప్రస్తావన రావడం ఇదే మొదటి సారి. ఇదేదో కొత్త సూత్రంగా తెరమీదికి వచ్చినట్టుంది. ఇది ఇక్కడితో ఆగుతుందని అనుకోలేం. అంతర్రాష్ట్ర జలవివాదాలను భూగర్భ జలాల ప్రాతిపదికగా పరిష్కరించాలన్న డిమాండ్లు వెల్లువెత్తే ప్రమాదం ఉంది. అన్నింటి కంటే ప్రధానంగా కావేరీ నదీ జలాల నిర్వహణకు ఒక సంస్థ ఏర్పాటుకు సుప్రీం ఆదేశించింది. ఒక నదిపై ఏ రాష్ట్రానికీ యాజమాన్యం ఉండదని స్పష్టంచేసింది. 1892, 1924 సంవత్సరాలలో కుదుర్చుకున్న ఒప్పందాలు చెల్లుతాయని కూడా సుప్రీం ఉదహరించడం గమనార్హం. దివంగత ముఖ్య మంత్రి జయలలిత, డిఎంకె అధ్యక్షుడు కరుణానిధి మధ్య రాజకీయ వైరానికి కావేరీ జలాల వివాదం మరింత ఆజ్యంపోసేది. కర్నాటకలో మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ కేంద్రమంత్రి ఎస్ఎంకృష్ణ మధ్య మాటల యుద్ధాన్ని పెంచేది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, కావేరీ వివాదంలోకి కన్నడిగులు తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌నీ, బాహుబలి ఫేం కట్టప్పనీ లాక్కుని వచ్చే ప్రయత్నం చేశారు. కావేరీ జలాల వివాదానికి ఇంత సుదీర్ఘ నేపథ్యం ఉంది. ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పుతో ఈ రెండు ఇరుగుపొరుగు రాష్ట్రాల మధ్య మరోసారి అగ్గిరాజుకునే ప్రమాదం ఉంది. ట్రిబ్యునల్ తమిళనాడులో వ్యవసాయ పరిధిని అంచనా వేయడంలో విఫలమైందని పేర్కొని, తప్పెవరివైపుందో స్పష్టంగా చెప్పింది. 765 కిమీ పొడవున ప్రవహించే కావేరి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు జీవనాడి. ఇది కర్ణాటకలో ముఖ్యంగా రాజధాని బెంగళూరులో ఆనందోత్సాహాలను వెల్లివిరిసేలా చేసింది. తమిళనాట అందుకు వ్యతిరేకంగా ఆగ్రహావేశాలు మిన్నంటాయి. ఇదన్యాయమంటూ తీర్పును సమీక్షించాలని పిటిషన్ వేసేందుకు ఈపీఎస్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. నీరు ప్రాణావసరమనీ, రాజకీయాలు కూడదనీ కమల్ హాసన్ అభిప్రాయపడ్డారు. కిందటేడాది 192 టీఎమ్‌సీలను కేటాయించిన సుప్రీం ఈ ఏడాది తమిళనాట ఉన్న భూగర్భ జలాలలను పరిగణనలోకి తీసుకుని కావేరీ జలాల్లో వాటాను తగ్గించింది. తమిళనాడుకు ఇది ఇబ్బందికరమే అయినప్పటికీ.. వాస్తవాన్ని తెలుసుకుని భూగర్భ జలాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆలోచించడం మంచిది. అదే సమయంలో తన వాటాను వదులుకోకుండా ప్రయత్నమూ చేయాల్సిందే. కర్ణాటకలో భూగర్భ జలాలు తమిళనాట కంటే తక్కువని సుప్రీం తీర్పు చెప్పకనే చెప్పింది. పశ్చిమ కనుమల్లో కొడగు వద్ద తలకావేరి నుంచి బొట్లు బొట్లుగా ప్రారంభమైన కావేరీ కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల గుండా ప్రవహించి, తమిళనాడులోని పూంపుహార్ వద్ద బంగాళా ఖాతంలో కలుస్తోంది. కావేరి పరీవాహక ప్రాంతం మొత్తం 81వేల 155 చదరపు కిలోమీటర్లుంది. తమిళనాట 43 వేల 856, కర్ణాటకలో 34వేల 273, కేరళలో 2వేల 866, పుదుచ్చేరిలో 1107 కిలోమీటర్ల మేర ఇది విస్తరించింది. నాలుగు రాష్ట్రాల వారి దాహార్తిని తీరుస్తూ ప్రవహిస్తున్న కావేరి మా రాష్ట్రంలో పుట్టింది కాబట్టి తమకే ఎక్కువ వాటా జలాలు కావాలన్న కర్ణాటక డిమాండ్ వాదనకు నిలవదు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమకు ఎక్కువ నీటిని విడవాలన్న తమిళనాడు డిమాండ్ సరికాదు. ఒప్పందాలను ఎప్పటి కప్పుడు సరిచేసుకుంటూ.. అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకుంటే వివాదాలకు తావుండదు. ఇక్కడ కర్ణాటక ఒక ఆశ్చర్యకరమైన వాదన చేసింది. వర్షాలు పడకపోతే.. తమిళనాడుకు కేటాయించిన మేర నీటిని విడుదల చేయలేమనేదే ఆ వాదన. ఎటు చూసినా ఇబ్బంది తమిళనాడుకే. అటు కర్ణాటకైనా.. తమిళనాడైనా కోర్టుకెక్కకుండా వాస్తవ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని చర్చించుకుంటే సమస్యకు కచ్చితంగా పరిష్కారం దొరుకుతుంది. మధ్యలో రాజకీయ ప్రయోజనాలు తలదూర్చుతుండడం దీన్ని ఎంతకీ తెగనీయడం లేదు. రాజకీయాలకు అతీతంగా కొలిక్కి తెచ్చుకోవాల్సిన అవసరముంది. ఆవేశకావేశాలకు పోయి.. ఘర్షణలకూ.. విధ్వంసాలకూ దిగకుండా పరిష్కారం చూసుకోవాలి. కోర్టు తీర్పు ఒకరికి ఆనందం.. మరొకరికి విచారం కలిగించడం సహజం. గెలిచిన వాడు ఇంటికెళ్ళి ఏడిస్తే.. ఓడిన వాడు కోర్టులోనే భోరుమంటాడన్న నానుడి ఎలాగూ ఉండనే ఉంది. ఏ సమస్యయినా పరిష్కారం కావాలంటే రాజకీయాలకు తావివ్వకపోవడమే మందు.

◆ సుబ్రహ్మణ్యం విఎస్ కూచిమంచి



'కత'ల రాయుళ్ళు!



'స్టోరీ టెల్లింగు' స్టోనేజీ నుంచి వికసిస్తూ వస్తున్న కళ. మనిషికీ మిగతా జంతుజాతికీ మధ్యగల పెద్ద వ్యత్యాసం ఈ కథల్లల్లడంలోనే ఉంది. గొడ్డూగోదాకి అడ్డమైన గడ్డీ మేయాలన్న యావ ఉండదు. అడ్డదారిలో వెళ్ళైనా గద్దెలెక్కాలన్న కసి ఉండదు. కనక కతలు చెప్పుకు తిరగాల్సిన ఖర్మలేదు. పురుగూ పుట్రకి నాలుగ్గింజలు నోటికందితే రోజు గడిచిపోతుంది. కాబట్టి పిట్టకథలు చెప్పుకొనే దుర్గతి పట్టదు.'

'మనిషి జన్మకలా కుదరదురా అబ్బీ! చేతకన్నా ముందు కతల్చెప్పడం వచ్చుండాలి. కష్టం తరుముకొచ్చినా.. దుఃఖం తన్నుకొచ్చినా.. ఉద్వేగం ముంచుకొచ్చినా.. ఉత్సాహం ఉరకలెత్తినా.. కోతులైతే గంతులేస్తాయి. పాములైతే కోరలు చాస్తాయి. పిట్టలైతే పిచ్చిపిచ్చిగా కూస్తాయి. పులులుకా గాండ్రింపులు, ఏనుగులుకీ ఘీంకరింపులు కథలు చెప్పే కౌశలం పట్టుపడకే! మనిషొక్కడే తనక్కావాల్సినంత విషయాన్ని కావాల్సినంత మోతాదులో కథావిశేషంగా మలిచి మరీ బురిడి కొట్టించగలిగేది. అలా కొట్టించే విద్యలో ఆరితేరితేనే వాళ్లే రాజకీయాల్లో రాణించేది. దాన్నీ నువ్వు ఈసడిస్తే ఎట్లారా?'

'బాగుంది బాబాయ్! రాజకీయాల్లో కథన కౌశలం కరువైతే కరుణవాదం ఫలించదనా! కహానీలు కుదరకుంటే సహోదరత్వం రాణించదనా! కథలు వండే కళ ఎంతలా వంటపడ్డకపోతే ఎన్నికల జాతర్లప్పుడు నేతలు పోతురాజులకు మించి హొరతులు పట్టించుకోగలరు?! ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యం మనదని మహాఘనంగా కతలు చెప్పుకొంటున్నాం గదా! అంటే మనమెన్నుకుంటున్న నేతాశ్రీల బుర్రల్లో అంతలా సృజనాత్మకత సుళ్లుతిరుగుతుందనా అర్థం?'

'ఆ ఎద్దేవానేరా వద్దనేది! రాజకీయాల మీదేనా రాళ్లేసేదీ?'

'మరేం మనమంటావ్ చెప్పు బాబాయ్! మంటపుడుతుంటేను ఇక్కడా! ఇవాళా రేపూ కథలు 'రాయని భాస్కరుల'ని కనిపెట్టడమే మా కష్టంగా ఉంటేనూ! అంతరించిపోయే జాతుల్లో కాకి.. పిచ్చుకల్లాంటివి ఏవేవో ఉంటున్నాయని ఊరికే ఆందోళన చెందుతున్నాం గానీ.. కట్టుకతలు చెప్పి నెట్టుకొచ్చే సజ్జు మాత్రం అంతకంతకూ పెరిగిపోతోందని కంగారు మాత్రం ఎవరం పడ్డం లేదు! రకరకాల కాలుష్యాలు పెచ్చుమీరుతున్నయని ఆ మధ్య వందలొందల దేశాలా పేరిస్‌లోనో ఎక్కడో అంతలా బుర్రలు బద్దలు కొట్టేసుకున్నాయి కదా! వాటి వేటికీ ఈ కతల బాపతు హానిక రజీవులపైన కన్ను పడలేదు.. ఖర్మ!'

'మన గురజాడగారి గిరీశం వారసులెవరన్నా అక్కడా చేరి అసలు విషయాన్నేమైనా పక్కదారి పట్టించారంటావా?!'

'డౌటా! ఈ కతలరాయళ్లతో వచ్చే చిక్కే అది. మనకు తెలీకుండానే వాళ్ల వ్యూహాల్లో చిక్కడిపోతుంటాం! తనను సృష్టించిన గురజాడనే పెడదారి పట్టించిన ఘనుడు గిరీశం. ఆ గిరీశానిక్కూడా గాడ్ ఫాదర్లాంటి ఘనులు తయారవుతున్నారు కదా రాజకీయాల్లో ఘనపుటడుక్కి ఓ పద్దెదుగురు లెక్కన? కుంటికథలు చెప్పుకుంటూ ఊరేగే వాళ్లకు అస్సలు గుడ్డిగవ్వంతైనా విలువ ఇవ్వకూడదు బాబాయ్ నన్నడిగితే!'

'ఇప్పుడిస్తున్నారనేనా? ఎందుకురా నీకా ఏడుపు?'

'ఏడవక ఇంకేం చెయ్యగలం బాబాయ్ మా బోటి బక్కోళ్లం! టూ మినిట్స్ లో తయారయ్యే నూడీల్లో నిజంగా అన్నేసి హానికారక పదార్థాలున్నాయా' అనడిగమా ఆ మధ్యన! రెండు రీములకు సరిపడా నవల వినిపించిందో తయారుచేసే కంపెనీ! 'కట్టుకున్న దౌర్భాగ్యుడు కదా! అంత కర్కశంగా పొట్ట నెట్లా పెట్టుకొన్నావమ్మా!' అని ఓ మహాతల్లిని విచారించిందీ మధ్య మీడియా! అలవాటైన అంతర్జాతీయస్థాయి అత్యాచారం కథ వినిపించేసింది! లక్షలు కోట్లు గడించిన బడాబాబుల బ్యాంకప్పులకు మాఫీలవసరమా? అనడిగి చూడు! ఊకదంపుడు కతలు ఆపకుండా ఊరుతాయి చట్టసభల బావుల్లో! ఐపిఎల్ వంకతో విచిత్రమైన ఆటొకటి కనిపెట్టి పిల్లకాయల జేబులు కొల్లగొట్టిన లలిత్ మోదీ గుర్తున్నాడా బాబాయ్? అప్పనంగా బొక్కేసిన సొమ్ముకు లెక్కలడిగితే ఎక్కడెక్కడికో పోయి దాక్కున్నాడా?'

'దాకునుంతే కథేముందిరా బాబీ! ట్విట్టరు ఖాతా సాక్షిగా రోజుకో ట్విస్టిచ్చే కథ ప్రచారంలో పెట్టి మరీ పార్లమెంటు మొత్తంతో పేకాటాడేసుకొన్నాడు! దటీజ్ రియల్లీ గ్రేట్!'

'అది గ్రేటా?! జనం మర్చిపోయిన నేతాజీలను గూర్చి తాజాగా తయారయే కతల మాటో మరి?' 'కథలు చెప్పడం కవుల పనేరా! ఒప్పుకుంటాను.. నిజమే! కానీ ఆ కర్తవ్యం ఏ కవులూ సాకారం చేయడం లేదే! నాయకులే పూనుకొని కథాసాహిత్యానికి న్యాయం చేస్తున్నర్రా బాబూ? మెచ్చుకోకపోతే మానె.. ఈ నొచ్చుకోడాలేంటంట.. విచిత్రంగా!' 'చిత్రంగా ఉన్నాయ్ బాబాయ్ నీ మాటలు! అడ్డదారిలో గద్దెలెక్కిన కుర్ర కుంకలు వాళ్ల వాళ్ల వంశ చరిత్రలను గూర్చి చెప్పుకొంటున్న పురాణాలు వింటూనే..'

'కన్నవారిక్కాక పక్క పార్టీ కాకాకు వన్నె తెచ్చేందుకా బిడ్డలు కతలు చెప్పేది? కాక ఎక్కువైన పుడు ఏవో రెండు మూడు కబుర్లు శృతి మించే వీక్‌నెస్ శ్రీనాథుడంతటి కవిసార్వభౌముడికే తప్పింది కాదురా! 'కదిలేదీ.. కదిలించేదీ.. కావాలోయ్ నవకవనానికి' అని మీ మహాకవి కదా కవిత్వాన్ని గురించి కలవరించిందీ!' 'అహా! అందుకేనా.. సమాజాన్ని ఊరికే కదిలిస్తే ఉపయోగమేంటని ఏకంగా కుదుళ్లతో సహా కుదిపేస్తున్నదో మన రాజకీయ కతలరాయళ్ళు!' 'మరే! కథలనేవే లేకపోతే ఆదికవి వాల్మీకి సోదిలో కొచ్చేవాడు కాదు కదా?' 'ఆ సోది సంగతేమో కానీ.. ఒక్క సూక్ష్మం మాత్రం నువ్వు సూటిగా అర్థం చేసుకోవాలిరా అబ్బిగా! తన మానానికి తానేవేవో యుద్ధాలు.. తీర్థయాత్రలు చేసుకుంటూ తిరిగే శ్రీకృష్ణదేవరాయలుకే కల్లోకొచ్చి మరీ తన పెళ్ళిని గూర్చి కమ్మని కథలు చెప్పమని శ్రీకాకుళాంధ్ర దేవుడు ఎందుకు పోరు పెట్టాడంటావ్?! స్టోరీలతో నెట్టుకొచ్చే వాళ్లని గద్దె మీద నుంచి నెట్టి పడేయడం ఎన్ని లక్షల నెటిజన్లను కూడగట్టి అల్లరి పెట్టించినా వల్లయ్యే పని కాదు! ముందది తెలుసుకోరా! 'ఆహా! హేమాహేమీలు ఇచ్చేసే హామీలు, వాటి మీద అస్మదీయులుగా ఉన్నప్పుడు చేసే 'హై.. హైఉ'లు.. తస్మదీయులుగా మారినప్పుడు కూసే 'హ్హీ..హ్హీ'లు.. అన్నీ ఈ కథాప్రక్రియ చుట్టూతానే గింగిరాలు కొట్టే ప్రహసనాలు కదా బాబాయ్! ఈ కుర్చీకతల కిక్కుని గూర్చి ఓట్లేసే జనమైనా అప్రమత్తం కాకపోతే ప్రజాస్వామ్యానికి హ పర్మినెంటుగా 'జనగణమనే..'! జనం మనిషిగా అదే నా దిగులు' 'మరే! బాగుందిరా అబ్బాయ్ నీ దిగులు కత కూడా! హ్హీ.. హ్హీ..హ్హీ!'

◆ కర్లపాలెం హనుమంతరావు, 8142283676

కాళేశ్వరం జాతీయ హోదాకు
పోస్టు కార్డు ఉద్యమం

నూతన తెలంగాణ రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధివైపు పయనిం పజేయడానికి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిరంతర కృషి చేస్తున్నారు. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలకు పూర్తిగా చరమగీతం పాడాలని భావించి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జూన్, జులై, ఆగస్ట్ నెలలనందు కొంతమేర, ఈ ప్రాజెక్ట్ ద్వారా భూములకు సాగునీరు అందబోతున్నది. సరాసరిన తెలంగాణలో కోటి ఎకరాల మాగాణికి నీరందించాలనే లక్ష్యంతో దీని నిర్మాణం చేపట్టారు. కాళేశ్వరం నూతన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉంది. అక్కడ ప్రవహిస్తున్న గోదావరినది నుంచి (మేడిగడ్డ వద్ద) ఎత్తిపోతల ద్వారా నీటిని మళ్ళించాలి. ఈ ఎత్తిపోతల పథకంలో భాగంగా మధ్యలో ఐదారు రిజర్వాయర్లు తయారవుతున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద సొరంగ మార్గాన్ని నిర్మించారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద ప్రాజెక్ట్. సముద్రంలో వృధాగా కలుస్తున్న గోదావరినీటిలో 180 టిఎంసీలను వినియోగంలోకి తేనున్నారు. ఏడెనిమిది జిల్లాలలో పారిశ్రామిక అవసరాలకు కూడా ఈ నీరు ఉపయోగపడుతుంది. రాజధాని హైదరాబాద్ నగరానికి కూడా శాశ్వతంగా తాగునీటి సమస్య తీరుతుంది. మామూలుగా ఏదైనా ఒక ప్రాజెక్ట్ నిర్మించాలంటే... అటవీ భూముల అనుమతి, పర్యావరణ అనుమతి, భూసేకరణ సమస్య, నిర్వాసితులకు పరిహారం పంపిణీ, అన్నింటికంటే మించిన సమస్య నిధుల సేకరణ వంటివి ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని నిధుల సేకరణలో కేసీఆర్ భూనిర్వాసితులకు పరిహారం ఇప్పించడం వంటివి చేయడమేగాక కేంద్ర ప్రభుత్వం వద్ద తగిన చతురత చూపించి అన్నిరకాల అనుమతులు సాధించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 12న ముద్ర అగ్రికల్చర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ మల్టీస్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ తరపున ఢిల్లీలో కేంద్ర హోంశాఖ మంత్రి కార్యాలయంలో ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా ప్రకటించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 17న సీఎం కేసీఆర్ 64వ జన్మదినోత్సవం సందర్భంగా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం గం.10.30 నిముషాలకు పై కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ విషయం మీద పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని కూడా ప్రారంభిస్తున్నారు.

-జి.జైపాల్ యాదవ్, తిప్పినేని రామదాసప్ప నాయుడు

ముగిసిన కేసీఆర్ ఢిల్లీ పర్యటన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ పర్యటన ముగిసింది. శుక్రవారం సాయంత్రం ఆయన ఎయిరిండియా విమానంలో హైదరాబాద్ వెళ్లారు. ప్రధానమంత్రి, హోంమంత్రి సమావేశమవుతారని చెప్పినప్పటికీ అది జరగలేదు. ఈనెల 8న ఢిల్లీకి వచ్చిన సీఎం దంతాలకు రూట్ కెనాల్ చికిత్స తీసుకున్నారు. కొంతకాలంగా పంటినొప్పితో బాధపడుతున్న ఆయన ఇక్కడ చికిత్స తీసుకుని ఉపశమనం పొందారు. గురువారం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీని కలిసి ఎయిమ్స్, ఐఐఎం, వెనుకబడిన జిల్లాలకు నిధులు , ఎఫ్ఆర్‌బిఎం పెంపు తదితర అంశాలపై మాట్లాడారు.

ఆదాయ పన్ను ఎగవేతదారుల గుర్తింపునకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఆదాయపు పన్ను ఎగవేతదారులపై కీలక చర్యలకు కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. పన్ను ఎగవేతదారులు, పన్నులు కట్టకుండా పరారీలో ఉన్నవారిని పట్టుకునేందుకు హైదరాబాద్‌లో 12 మంది అధికారులతో కూడిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ప్రకటించారు. ఈ బృందానికి ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారు. ఈ బృందం సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌తో కలిసి పన్ను ఎగవేతదారుల భరతం పట్టనుంది.

బుద్ధగయలో చైర్మన్,స్పీకర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : బీహార్‌లో జరగనున్న కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సమావేశంలో పాల్గొనేందుకు పాట్నాకు వెళ్లిన శాసనమండలి చైర్మన్ కె స్వామిగౌడ్ బుద్ధగయను సందర్శించారు. సీపీఏ ఎగ్జిక్యూటివ్ సమావేశం తర్వాత ఆయన బుద్ధుడు ఆత్మజ్ఞానం పొందిన భోది వృక్షాన్ని, బౌద్ధుల ప్రసిద్ద దేవాలయం మహాభోద్‌ను సందర్శించారు. పాట్నా అసెంబ్లీ అధికారులతో కలిసి ఆయా ప్రాంతాలను సందర్శించి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు అసెంబ్లీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, సెక్రటరీ నర్సింహ్మాచార్యులు ఉన్నారు.

మోడల్ స్కూల్ దరఖాస్తు గడువు పెంపు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో ఫీజు చెల్లింపుకు గడువును పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 6వ తరగతి నుంచి 10వ తరగతిలో చేరడం కోసం విద్యార్థులు ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు పాఠశాల విద్య సంచాలకులు జి కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.



కేంద్ర సర్వీసులకు ఇద్దరు ఐపీఎస్‌లు

సీఐఎస్ఎఫ్‌కు సీవీ ఆనంద్ సీఆర్‌పీఎఫ్‌కు చారుసిన్హా


హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజి)లుగా పని చేస్తున్న ఇద్దరు ఐపిఎస్‌లు కేంద్ర సర్వీసులకు డిప్యుటేషన్‌పై వెళ్ళనున్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా పని చేస్తున్న సివి ఆనంద్‌ను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) ఐజిగా నియమిస్తూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆనంద్ ఈ పదవిలో ఐదేళ్ళు పని చేయను న్నా రు. కొన్నాళ్ళ నుంచే ఆనంద్ కేంద్ర సర్వీసులకు వెళ్ళా లన్న ఆలోచనతో ఉన్నారు. ముఖ్య మంత్రి కెసిఆర్ ను కొద్ది రోజుల క్రితం కలిసి తన మనసులోని మాటను తెలి య జేసి సమ్మతి కూడా పొందారు. మరో అధికారి చారుసిన్హా సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సిఆర్ పిఎఫ్) కు బదలీ అయ్యారు. చారుసిన్హా ప్రస్తుతం పోలీ సు శిక్షణా విభాగంలో ఐజిగా సేవలను అందిస్తున్నారు. పోలీసు శిక్షణా విభా గంలో పని చేయడానికి ముందు చారుసిన్హా ఎసిబిలో పని చేసి పలు సంచ లనా త్మక కేసులను నమోదు చేశారు. సిఆర్‌పిఎఫ్ ఐజిగా చారుసిన్హా ఐదేళ్ళు పని చేస్తారు.

అమిత్‌షా, రాహుల్‌ను తిరగనివ్వం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాదిగలను మోసం చేయడమే కాకుండా దేశ రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నాయని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు.వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించకుండా రాష్ట్ర పర్యటనకు వచ్చే బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీలు రాష్ట్రానికి వచ్చినప్పుడు ఎమ్మార్పీఎస్ నుంచి నిరసన సెగల తప్పవని, తెలంగాణలో తిరగనివ్వమని ఆయన హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు అసెంబ్లీలో తీర్మానం, ఉషామెహర కమిషన్ వేసిన కాంగ్రెస్ బీజేపీని ఎందుకు నిలదీయడం లేదని కృష్ణమాదిగ ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు తమ సభలకు వచ్చి మద్దతు, సానుభూతి ఇచ్చే బదులు వారి పార్టీల హై కమాండ్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆయన సూచించారు.రెండు తెలుగు రాష్ట్రాల ఎమ్మార్పీఎస్ , అనుబంధ కమిటిల సమావేశాలు శని, ఆదివారాల్లో జరుగుతాయని కృష్ణ మాదిగ తెలిపారు. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

కేసీఆర్ ఇక్కడ పులి..ఢిల్లీలో పిల్లి



హైదరాబాద్,ఆంధ్రప్రభ : సీఎం చంద్రశేఖర్‌రావు తెలంగాణలో పులి అని, ఢిల్లీకి వెళ్లగానే పిల్లిలా మారిపోతున్నారని మండలిలో విపక్ష నేత షబ్బీర్ అలీ విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడిని చూస్తే కేసీఆర్‌కు భయమెందుకో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్‌పైన ఉన్న కేసుల వల్లే మోడికి భయపడుతున్నారని ఆయన నిలదీశారు. రాష్ట్రానికి రూ. 40 వేల కోట్లు కావాలని అంటారని, ఢిల్లీకి వెళ్లి రూ. 450 కోట్లు మాత్రమే అడుగుతారని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఆయన సీఎల్పీ ఉప నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఢిల్లీకి వెళ్లిన సీఎం కేసీఆర్ విభజన హామీలు, పంటలకు మద్దతు ధర విషయంపై కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని షబ్బీర్‌అలీ సూచించారు. కంది రైతులకు కర్ణాటక ప్రభుత్వం బోనస్ ఇస్తుంటే.. మిగులు రాష్ట్రమైనా తెలంగాణలో బోనస్ ఎందుకివ్వడం లేదన్నారు. ఎర్ర జొన్న రైతులు ఆందోళన చేస్తుంటే టీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ విమర్శలు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. కందుల కొనగోలు కోసం కర్ణాటక ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 40 కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. పసుపు కంపెనీని ఏర్పాటు చేస్తామన్న నిజామాబాద్ ఎంపీ కవిత హామీ ఏమైందన్నారు. కేసీఆర్ కుటుంబమంతా మాటమీద నిలబడే వారు కాదన్నారు.

పెన్నా కేసులో జగన్‌కు ఈడీ సమన్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అక్రమాస్తుల కేసుల విచారణలో భాగంగా వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడి) ప్రత్యేక కోర్టు శుక్రవారం సమన్లను జారీ చేసింది. మార్చి 16 వ తేదీన కోర్టుకు హాజరు కావాలని కోర్టు తన ఆదేశాలలో పేర్కొంది. జగన్‌తో పాటు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, పెన్నా గ్రూప్ అధినేత ప్రతాప్‌రెడ్డి తదితరులకు కోర్టు సమన్లను జారీ చేసింది.

మార్చి నెలాఖరుకు ఇంటింటా కంటి పరీక్షలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : సీఎం కేసీఆర్ ముందు చూపుతో చేపట్టిన ఇంటింటికీ కంటి పరీక్షల పథకం మార్చి నెలాఖరుకల్లా ప్రారంభం కావాలని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అవసరమైన ప్రణాళికలతో సిద్ధం కావాలని ఆయన సూచించారు. శుక్రవారం (ఐపీఎం) ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడి సిన్ కార్యాలయంలో మంత్రి అధికారులతో ఈ అంశంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా టీఆర్ఎస్ సర్కారు ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను, అద్దాలను పంపిణీ చేయాలని నిర్ణయించిం దన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికనుగుణంగా మార్చి నెలాఖరుకల్లా ఈ పథకం ప్రారంభమయ్యే విధంగా అవసరమైన ప్రణాళికలతో సిద్ధం కావాలని ఆయన అధి కారులను ఆదేశించారు. శిబిరాల నిర్వహణ ఎలా..ఏయే పరికరాలుండాలి..ప్రస్తుతం ఉన్న పరికరాలు సరిపో తాయా..అదనంగా కావాలా..వాటిని సమకూర్చు కోవడం ఎలా..స్క్రీనింగ్‌కి వైద్యులు, సిబ్బంది అవసరం ఎంత.. స్క్రీనింగ్ ఎంత కాలం చేయాలని అన్న తదితర అంశాలపై ప్రణాళికలు రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. మొదటగా హైదరాబాద్ లోనైనా ఈ పథకం మార్చినెలాఖరు ప్రారంభం అయ్యేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

ఏసీబీ కోర్టులో లొంగిపోయిన పురుషోత్తమ్ రెడ్డి



ఏసీబీ కోర్టుకు హాజరవుతున్న పురుషోత్తమ్ రెడ్డి

- 14 రోజుల రిమాండ్
- వారం రోజుల కస్టడీకి ఏసీబీ పిటిషన్
- పురుషోత్తం రెడ్డి బంధువులు ఇళ్లల్లో ఏసీబీ సోదాలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెండు వారాలుగా పోలీసుల కన్నుగప్పి తిరుగుతున్న ఆదాయానికి మించిన ఆస్తుల కూడబెట్టిన కేసులో నిందితుడిగా ఉన్న హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్ పురుషో త్తంరెడ్డి శుక్రవారం అనూహ్యంగా ఏసీబీ కోర్టులో లొంగి పోయారు. పురుషోత్తంరెడ్డికి ఏసీబీ కోర్టు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. మరోవైపు పురుషోత్తంరెడ్డిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలంటూ ఏసీబీ అధికారులు పిటిషన్ దాఖలు చేశారు. పురుషోత్తం రెడ్డి దాదాపు రూ.300 కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టారన్న అభియోగాలు ఉన్నాయి. శుక్రవారం పురుషోత్తం రెడ్డి ఇంటితో పాటు అతని బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు నిర్వహిం చింది. బ్యాంకు లాకర్లు తెరిచిన అధికారులు భారీగా బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. కొద్ది రోజుల క్రితం ఆయన ముందుస్తు బెయిల్ కోసం చేసిన విజ్ఞప్తిని కోర్టు తిరస్క రించింది. ఇప్పటికే పరుషోత్త ంరెడ్డి బినామీలలో కొందరిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. మరికొందరు బినామీల కోసం వేట షురూ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా అక్రమార్జనకు పాల్పడ్డ ఈ అవినీతి అనకొండ ఏసీబీ అధికారులు దాడులు చేస్తారన్న ముందస్తు సమాచారంతో అధికారులు రాకముందే పరారయ్యారు. దీంతో ఏసీబీ అధికారులు బంజా రాహిల్స్‌లోని సాగర్‌సొసైటీలో ఉన్న ఆయన ఇంటిని సీజ్ చేశారు. అప్పట్నించీ పరారీలో ఉన్న పురుషో త్తంరెడ్డి ఆచూకీ కనుగొనేందుకు ఏసీబీ అధికారులు సకల ప్రయత్నాలు చేశారు. లుక్ అవుట్ నోటీసు సైతం జారీ చేశారు. అరెస్టయిన పురుషోత్తం రెడ్డి బినా మీలుగా పేర్కొంటున్న నిశాంత్‌రెడ్డి, యాద వ్‌రెడ్డిలు పురు షోత్తంరెడ్డికి ప్రధాన బినామీలుగా వ్యవహరి స్తున్నారని తెలుస్తోంది. కాగా, నిశాంతరెడ్డి, యాదవ్ రెడ్డిలను ఏసీబీ శుక్రవారం తన కస్టడీలోకి తీసుకుంది. పురు షోత్తంరెడ్డికి ఓ ఎమ్మెల్యే సహకరించాడన్న వార్తలు వెలువడ్డాయి. కాగా, సదరు ఎమ్మెల్యేను ఏసీబీ అధికారులు సంప్రదించిన క్రమంలో ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్ అయి నట్లు సమాచారం. ఇప్పటికే గత రెండు వారాల సమయంలో ఏసీబీ అధికారులు పురుషో త్తంరెడ్డి బంధువులు, కూతుళ్ల ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. మియాపూర్, కూకట్‌పల్లి, తార్నా కలలో ఈ సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో విలువైన సమాచారాన్ని ఏసీబీ అధికారులు రాబట్టా రు. పైపెచ్చు తన కూతుళ్లతో వాట్సాప్, ఆన్‌లైన్ ద్వారా పురుషోత్తంరెడ్డి టచ్‌లో వున్నారన్న సమా చారాన్ని సైతం ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ అధికారులకు చిక్క కుండా వారికి ముచ్చెమటలు పట్టించిన పురుషోత్తంరెడ్డి ఎట్ట కేలకు శుక్రవారం ఏసీబీ కోర్టులో లొంగిపోవడం గమనార్హం. కాగా, మంచిరేవుల విల్లాలో బిజినెస్ ద్వారా రూ.100 కోట్ల రాబడికి పురుషోత్తంరెడ్డి యత్నించినట్లు సమాచారం. ఇప్పటికే ఆయనకు సంబంధించి రూ.50 కోట్ల పైబడి అక్రమాస్తుల వివరాలను ఏసీబీ గుర్తించింది. పురుషోత్తంరెడ్డి అక్రమాస్తులు రూ.300 కోట్లు పైమాటేనని చెబుతున్న తరుణంలో ఆ దిశగా ఏసీబీ దృష్టిసారించింది.

పూర్తిస్థాయిలో వివరాలను రాబడతాం...

కాగా, శుక్రవారం కోర్టులో లొంగిపోయిన పురుషోత్తంరెడ్డిని కస్టడీలోకి తీసుకుని ఆయన నుంచి పూర్తి వివరాలు రాబట్టే దిశగా ఏసీబీ అధికారులు తదుపరి అడుగులు వేస్తున్నారు. ఆ దిశగా ప్రయత్నాలను ముమ్మరం చేశారు. స్వల్ప వ్యవ ధిలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని పురుషోత్తంరెడ్డి అడ్డగోలుగా అక్రమార్జనకు తెర దీసిన వైనం ఏసీబీ అధికారులను సైతం విస్తుపోయేలా చేసింది. ఈ అవినీతి అన కొండ నుంచి పూర్తి స్థాయిలో సమాచారాన్ని రాబట్టి తీరుతామని ఏసీబీ అధికారులు చెబుతున్నారు.

విచారణకు హాజరవుతా



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వివాదాస్పద దర్శకుడు రాంగోపాల్‌వర్మ శనివారం సీసీఎస్ పోలీసుల ఎదుట హాజరు కానున్నారు. వర్మ హాజరవుతారని పోలీసులు కూడా ప్రకటన చేశారు. తన షార్ట్ ఫిల్మ్ గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ (జీఎస్టీ)పై ఓ టీవీ షోలో మాట్లాడుతూ ఓ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా, తన మీద ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో ఓ బాధ్యత గల పౌరుడిగా తాను శనివారం విచారణకు హాజరు కానున్నానని రామ్ గోపాల్‌వర్మ కూడా తాజాగా ఓ ట్వీట్ ద్వారా తెలిపారు.

'ఎన్నారై పాలసీ రూపొందించాలి'

హైదరాబాద్,ఆంధ్రప్రభ : టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు అవుతున్నా ఎన్నారై పాలసీని రూపొందించడం లేదని టీ పీసీసీ ఎన్నారై సభ్యులు ఆరోపించారు. ఎన్నికల ముందు ఎన్నారైలకు అరచేతిలో వైకుంఠం చూపారని మండిపడ్డారు. గల్ఫ్ బాధితులను స్వదేశానికి తీసుకురావడంలో ప్రభుత్వం నిమ్మకు నిరేత్తినట్లుగా వ్యవహారిస్తోందని మండిపడ్డారు. శుక్రవారం లండన్ దేశంలో టీ పీసీసీ ఎన్నారై సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా టీ పీసీసీ ఎన్నారై సెల్ సలహాదారు గంగసాని ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కలను సాకారం చేసిన కాంగ్రెస్ పార్టీని మంత్రి కేటీఆర్ విమర్శించడం సరి కాదన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ లోఫర్ అయితే.. నాలుగేండ్లయినా ఎన్నారై పాలసీని ప్రకటించని టీఆర్ఎస్‌ను ఏమనాలో చెప్పాలన్నారు. ఏజెంట్ల చేతుల్లో మోసపోతున్న విషయాన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

నాభ్‌తో రోగికి చక్కని సేవలు




హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రోగులకు మరింత నాణ్యమైన సేవలందించడానికి నాభ్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ ప్రోవైడర్స్) ఎంతో ఉపయోగపడుతుందని, దీనివల్ల జవాబుదారీతనం కూడా పెరుగుతుందని మాక్సీవిజన్ ఐ ఆస్పత్రి ఫౌండర్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమాజీగూడ మ్యాక్స్‌విజన్ ఐ ఆస్పత్రికి నాభ్‌లో చోటు లభించిందని శుక్రవారం జరిగిన విలేక రుల సమావేశంలో ఆయన తెలిపారు. దీనివల్ల విదేశీ రోగులు పెరుగుతారన్నారు. చిన్న లోపాలు తలెత్తినా వెంటనే నాభ్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తారని ఆయన పేర్కొన్నారు. నాభ్ ప్రమాణాలకు అనుగుణంగా మరిన్ని సౌకర్యాలను పెంచుతామన్నారు. డాక్టర్ ప్రసాద్‌రావు, చైర్మన్ ఇండో-యూఎస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి (పద్మశ్రీ అవార్డు గ్రహీత) మాట్లాడుతూ నాభ్‌లో ఈ ఆస్పత్రికి చోటు దక్కడం సంతోష కరమన్నారు.

ఖమ్మం, వరంగల్ జిల్లాల టీఆర్‌టీ

ఫలితాలు వెల్లడించొద్దు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో జరగనున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) నిర్వహణ ప్రక్రియపై స్టే విధించేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఉపాధ్యాయ నియామక పరీక్షకు సంబంధించి ఖమ్మం, వరంగల్ జిల్లాల ఫలితాలను ప్రకటించ రాదని తెలంగాణ ప్రభుత్వ సాధారణ పరిపాలనా శాఖ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ కార్యదర్శిని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయా లని హైకోర్టు ప్రతివాదులందరినీ ఆదేశించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్. రామచంద్రరావు శుక్రవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేశారు. పిటిషనర్ల తరపు న్యాయవాది బూర.రమేశ్ వాదనలు వినిపిస్తూ..ఉద్యోగ ప్రకటనలో ఖమ్మం జిల్లా దివ్యాంగులకు ఒక ఎస్జీటీ పోస్టు, వరంగల్ జిల్లా దివ్యాంగులకు పది పోస్టులు కేటాయించినట్లు తెలిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి టీఆర్‌టీ పరీక్షల నిర్వహణపై స్టే ఇచ్చేందుకు నిరాకరించారు.అయితే ఖమ్మం, వరంగల్ జిల్లాల ఫలితాలను ప్రకటించొద్దని ప్రతివాదులైన అధికారులను ఆదేశించారు.తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేశారు.

ఐదువేల జీతంతో ఎలా జీవిస్తారు?




హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేవలం రూ.ఐదు వేల నెలసరి జీతంతో ఓ కార్మికుని కుటుంబం ఎలా జీవిస్తుందని హైకోర్టు ఎస్పీడీసీఎల్ అధికారులను నిలదీసింది. ఆ కార్మికునికి కనీస వేతనం చెల్లించే వ్యవహారాన్ని తిరిగి పరిశీలించాలని హైకోర్టు స్పష్టం చేసింది. విద్యుత్ ప్రమాదంలో కుడి చేయి ని పూర్తిగా పోగొట్టుకున్న ఓ కాంట్రాక్టర్ కింద పనిచేస్తున్న కార్మికునికి కార్యా లయ సహాయకునిగా తాత్కాలిక పోస్టు కేటాయించి నెలకు రూ.ఐదు వేల వేతనాన్ని నిర్ణయించిన తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) అధికారులపై హైకోర్టు అసంతృప్తిని ,అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. నెలకు రూ.ఐదు వేల వేతనంతో కార్మికుని కుటుంబం ఎలా జీవిస్తుందని? ప్రశ్నించింది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి, జస్టిస్ జి.శ్యాంప్రసాద్ లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదా వేసింది. నాగర్ కర్నూల్ జిల్లా, రాచూర్ గ్రామానికి చెందిన పి.వెంకటేశ్వర్లు 2011 లో విద్యుత్ ప్రమాదానికి గురై కుడి చేయిని పూర్తిగా కోల్పోయారు.

తెరాసను ఓడించడమే లక్ష్యం

● చెరుకు సుధాకర్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : టీఆర్ఎస్‌ను ఓడించడమే తెలంగాణ ఇంటిపార్టీ ధ్యేయమని, టీఆర్ఎస్ వ్యతిరేకంగా పనిచేసే పార్టీలతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధమని ఆ పార్టీ అధ్య క్షుడు చెరుకు సుధాకర్ పేర్కొన్నారు. వివిధ పార్టీలకు చెందిన 25 మంది తెలంగాణ ఇంటి పార్టీలో చేరిన సందర్భంగా శుక్రవారం హిమా యత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసి పోరాడితేనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల తరు వాతే మిగతా కులాల వారు ఉన్నారని ప్రస్తుతం తెలం గాణలో అగ్రకులాల రాజ్యం నడుస్తుందని ఆయన ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఇక్కడ మాట్లాడే తీరు ఢిల్లీలో మాట్లాడే తీరు వేరుగా ఉంటుందన్నారు.

రెండు తలల పాముకు ఎలాంటి శక్తి ఉండదు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెండు తలల పాముకు ఎలాంటి శక్తులు ఉండవని, దాని పేరిట జరుగుతున్నది మోసమని అటవీ శాఖ అధికారులు స్పష్టం చేశారు. రెండు తలల పాముకు వాస్త వానికి ఉండేది ఒకటే తల అని, దాని తోక కూడా తలను పోలి ఉండడం వల్ల రెండు తలల పాముగా వాడుకలోకి వచ్చిందని పేర్కొంటున్నారు. రెండు తలల పాముతో గుప్త నిధులు సాధించ వచ్చంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. గత నెల రోజుల్లో హైదరాబాద్ చుట్టుప్రక్కల నాలుగు చోట్ల నుంచి ఈ రెండు తలల పామును స్వాధీనం చేసుకుని రక్షిత అటవీ ప్రాంతాల్లో వదిపెట్టామన్నారు. విషపూరితం కాని ఈ పామును రెండ్ సాండ్ బోగా పిలుస్తారని అటవి శాఖ ప్రత్యేక అధికారి శంకరన్ స్పష్టం చేశారు. రెండు తలల పాము ఎవరైనా ప్రచారం చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. అవసరమైతే అటవీశాఖ ట్రోల్ ఫ్రీ నెంబర్ 18004255364కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కరవు నివారణ సదస్సుకు భార్గవి

మార్చి8, 9 తేదీల్లో బెంగళూరులో సదస్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కరవు నిర్వహణా వ్యూహాలు అనే అంశంపై వచ్చే నెల 8, 9 తేదీల్లో బెంగుళూరులో జరగనున్న జాతీయ సదస్సుకు విపత్తు నిర్వ హణ శాఖ స్పెషల్ కమిషనర్ సదా భార్గవి హాజర వనున్నారు.

కరవు గుర్తింపు లో రాష్ట్రం అను సరిస్తున్న విధా నాలు, పర్యవేక్షణ, స్పందనపై కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ మేరకు ఆమెకు ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఆన్ డ్యూటీ వసతిని వర్తింపజేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

జాతీయ ఎస్సీ కమిషన్ తెలంగాణ పర్యటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : షెడ్యూల్డు కులాల జాతీయ కమిషన్ ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో పర్యటించనుంది. రాష్ట్ర పర్యటనకు వస్తున్న వారితో కమిషన్ చైర్మన్ రామ్‌శంకర్ కతేరియా, వైస్ చైర్మన్ ఎల్. మురుగన్, సభ్యులు కె. రాములు, డాక్టర్. యోగేంద్ర పాశ్వాన్, డాక్టర్. స్వరాజ్ విద్వాన్ తదితరులు ఉన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె. జోషీ, పోలీసు డైరెక్టర్ జనరల్ మహేందర్ రెడ్డితో ఎస్సీ కమీషన్ సభ్యులు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ఎస్సీల సామాజిక, ఆర్థిక అభివృద్ధి, రక్షణ, సర్వీస్ భద్రత తదితర అంశాలను 21న జరిగే భేటీలో చర్చించబోతున్నారు. షెడ్యూల్డు కులాల సంఘాలతో కూడా కమీషన్ భేటీ కాబోతుంది. వినతులను స్వీకరించడం. ఫిర్యాదుల పురోగతిని పరిశీలించడం, సమస్య లను పరిశీలించడం జరుగుతుంది. ఎస్సీ కమీషన్‌ను కలవ డానికి ఒకొక్క సంఘం నుండి ఇద్దరికి మాత్రమే అనుమ తించడం జరుగుతుంది. ఎస్సీ కమీషన్‌ను కలవాలనుకునే సంఘాలు 1800 1800345, 040 - 23754907, 23754908 నెంబర్‌కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకొనవలసి ఉంటుంది.

ఎస్సీ గురుకులాల పనితీరు భేష్

ప్రభుత్వ సలహాదారు రామలక్ష్మణ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సాంఘీకసంక్షేమ ఎస్సీ విద్యాసంస్థల పనితీరును ప్రభుత్వ సలహాదారు ఏ. రామలక్ష్మణ్ అభినందించారు. ఎస్సీ బాలబాలికలు ఉన్నత స్థాయికి ఎదగడానికి తీసుకుంటున్న చొరవ అభినందనీయం అన్నారు. అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న బాలబాలికలను అయన అభినందించారు. ఎస్సీలు ఆర్థిక కారణాలతో చదువుల్లో వెనుకబడరాదనే లక్ష్యంతో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డిలోని ఎస్సీ బాలికల, బాలుర జూనియర్ రెసిడెన్సియల్ కళాశాలలను, నార్సింగ్‌లోని బాలికల జూనియర్ కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బందితో కలిసి భోజనం చేశారు. సిబ్బందితో చర్చలు జరిపారు. విద్యా ప్రమా ణాలను పెంచడానికి తీసుకుంటున్న చర్యలు, అనుసరిస్తున్న విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు, వారికి అందిస్తున్న వైద్య సౌకర్యాల గురించి కూడా ఆయన విచారించారు. మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని ఇప్పటికే ఈ విద్యా సంస్థల్లో చేరిన విద్యార్థిణీ, విద్యార్థులు మంచి భవిష్యత్ లక్ష్యంగా తమ జీవితాలను తీర్చి దిద్దుకోవాలని కోరారు. గౌలిదొడ్డి కళాశాల నుండి 30 మంది విద్యార్థులు ఎంబి బిఎస్, ఏడుగురు బీడీఎస్‌లో, ఐదుగురు బివిఎస్‌సిలో ఒకరు ఏఐఐఎంఎస్, మరొకరు ఎన్ఈఈటీ, ఐదుగురు హెచ్‌సియూలో ఉన్నత ర్యాంకులతో ఆయా ప్రభుత్వ కళాశాలల్లో స్థానాలు సంపాదించుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ వివరించారు.

ఫార్మా-డి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం

త్రిసభ్య కమిటీ సమావేశం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : నెలరోజులుగా ఫార్మా-డి విద్యార్థులు తమకు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రభ దినపత్రిక విద్యార్థుల కష్టాలపై ప్రత్యేక కథనం ప్రచురించింది. దీంతో ఒక మెట్టు దిగిన త్రిసభ్య కమిటీ శుక్రవారం సమావేశం అయ్యింది. 2015 సంవత్సరం ఆగష్టులో ఫార్మా-డి విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో తెలంగాణ ప్రభుత్వం జీఓ 515 కింద త్రిసభ్య కమిటీని నియ మించింది. ఇంతవరకు ఆ కమిటీ సమావేశం కాలేదని విద్యార్థులు గతంలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఆ కమిటీ సమావేశం అయ్యేలా చూడాలని విద్యా ర్థులు పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. త్రిసభ్య కమిటీలో డీఎంఈతో పాటు డ్రగ్ కం ట్రోల్ అధికారి, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ నుంచి మరొకరు ఉండాలని ఆ జీఓలో ప్రభుత్వం పేర్కొంది. డీఎం ఈ, డ్రగ్ కంట్రోల్ అధికారి తెలంగాణకు ఉన్నా తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మన రాష్ట్రానికి లేదు. దీంతో కమిటీ సమావేశం కాకపోవడానికి ఇదే కారణమని ప్రభుత్వం అనేకసార్లు విద్యార్థులతో పేర్కొంది. ప్రభుత్వ సూచన మేరకు శుక్రవారం డీఎంఈ కార్యాలయంలో డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి , డ్రగ్ కంట్రోలర్ డీడీ కైలాసంతో పాటు ఫార్మా-డికి చెందిన ఇద్దరు విద్యార్థులు సమావే శమయ్యారు. ఇద్దరు అధికారులు విద్యార్థుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. సమస్యలపై రెండు రోజుల్లోనే ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని వారు విద్యార్థులకు హామీనిచ్చారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

జనవరిలో1500 కోట్ల డాలర్ల విలీనాలు టేకోవర్లు

న్యూఢిల్లీ : భారతీయ కా ర్పొరేట్ రంగంలో గత నెలలో విలీనాలు టేకోవర్ల (ఎంఅం డ్ఏ) జోరు కొన సాగింది. ఏడా ది ప్రాతిపదికన చూస్తే ఆరు రెట్లు పెరిగి 1500 కోట్ల డాల ర్లకు చేరాయని టాక్స్ అడ్వయిజరీ కంపెనీ గ్రాంట్ థ్రాన్‌టన్ తాజా నివేదికలో వెల్ల డిం చింది. ఈ ఏడాది జనవరిలో మొత్తం 47 ఎంఅండ్ఏలు జరిగాయి. వాటిలో విలువ 15,137 మిలియ న్ డాలర్లు. క్రితం ఏడాది ఇదే నెలలో మొత్తం 45 లావా దేవీలు జరిగాయి. వీటి విలువ 2,301 మిలియన్ డాలర్లుగా తేలిందని తెలిపింది. దేశీయంగా మూడు ఒప్పందాలు బిలియన్ డాలర్లపైనే ఉంటాయని, ఇది మొత్తం ఎంఅండ్ఏ ఒప్పందాల్లో 98 శాతం ఆక్రమించాయని నివేదిక తెలిపింది. ఇక విదేశీ డీల్స్ విషయానికి వస్తే రెండు రెట్లు పెరిగాయి. మూడు అది పెద్ద ఒప్పందాలు సుమారు వంద మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలి గినవి ఉన్నయని గ్రాంట్ థ్రాంటన్ ఇండియా ఎ ల్ఎల్‌పీ డైరెక్టర్ పంకజ్ చోప్డా తెలిపారు. కేంద్రప్రభుత్వం కొత్త చట్టాలను ఉదాహరణ దివా లాచట్టాన్ని తీసుకురావడంతో విలీనాలు టేకోవర్ల జో రుపెరిగింది. ముఖ్యంగా ఇంధనం సహజవాయువు రంగాలతో పాటు పరిశ్రమలు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లో ఎక్కువగా కనిపించాయని చోప్డా వివరించారు.



హెచ్చరికలు బేఖాతరు!

• 2ఏళ్ల నుంచి చెబుతున్నా పట్టించుకోని పీఎన్‌బీ • చివరకు రూ.11,400 కోట్లు నష్టపోవాల్సి వచ్చింది



హైదరబాద్ : పీఎస్‌యు బ్యాంకుల్లో రెండవ అతి బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) బుధవారం నాడు రూ.11,400 కోట్లు మోసపోయినట్లు ప్రకటించి బ్యాంకింగ్ రంగాన్నే కాదు దేశానికి పెద్ద షాక్ ఇచ్చింది. పీఎన్‌బీ ఇచ్చిన లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎల్ఓయు) తీసుకొని నీరవ్‌మోడీ బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో డబ్బు విత్‌డ్రా చేసుకొనే వాడు. ఇది గత ఏడు సంవత్సరాల నుంచి నిర్విరామంగా కొనసాగింది. బ్యాంకుకు చెందిన సిబ్బంది మోడీతో చేతులు కలిపారని యాజమాన్యం చెబుతోంది. ప్రస్తుతం నీరవ్‌మోడీ న్యూయార్కులో కుటుంబంతో కలిసి కనిపించడాని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇదంతా పక్కన పెడితే పీఎన్‌బీలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న కేర్ రేటింగ్ ఏజెన్సీ ఫిబ్రవరి 2016లోనే బ్యాంకును హెచ్చరించింది. నీరవ్ మోడీకి చెందిన కీలకమైన కంపెనీ ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎఫ్ఐపీఎల్)కు అర్హతకు మించి పెద్దమొత్తంలో రుణాలు ఇస్తున్నారని గుర్తు చేసింది. కంపెనీ బ్యాలెన్స్‌షీటు చూస్తే ఆకర్షణీయంగా కనిపించినా, కస్టమర్ బేస్ చాలా పరిమితంగా ఉందని హెచ్చరించింది. అయితే ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే అదే రేటింగ్ ఏజెన్సీ జూన్ 7,2016న .. ఎఫ్ఐపీఎల్‌కు ఇచ్చే బ్యాంకు రుణాలపై గతంలో ఇచ్చిన రేటింగ్‌ను తక్షణమే ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించింది. బ్యాంకు నుంచి నో -ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) తీసుకున్న తర్వాత కేర్‌రేటింగ్ తను ఇచ్చిన రేటింగ్‌ను ఉపసంహరించుకుంది.తీరా చూస్తే బుధవారం మోడీ తమ బ్యాంకును రూ.11,400 కోట్లు మోసం చేశాడని పీఎన్‌బీఐ ప్రకటించింది. ఇక్కడ అసలు విషయానికి వస్తే .. మోడీ కంపెనీ ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పుడు రేటింగ్ ఏజెన్సీ ఎన్ఓసీ జారీ చేసి తర్వాత బ్యాంకు ఎన్ఓసీ జారీ చేయడంతో రేటింగ్‌ను విత్‌డ్రా చేసుకోమనంపై దర్యాప్తు చేయించాలని రేటింగ్ ఏజెన్సీ ఎగ్జిక్యూటివ్ ఒకరు చెప్పారు. ఆయన తన పేరు చెప్పడానికి ఇష్టపడలేదు.రేటింగ్ ఏజెన్సీ ముందుగా హెచ్చరికలు జారీ చేసినా మోడీ కంపెనీ మాత్రం పీఎన్‌బీ నుంచి నిరంతరాయంగా లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్(ఎల్ఓయు) పీఎన్‌బీ నుంచి దక్కించుకుంటూ వచ్చింది.

ఈ ఎల్ఓయులను తీసుకొని మోడీ కొన్ని వారాల్లోనే వివిధ బ్యాంకుల నుంచి నగదుగా మార్చు కోవడం జరిగేది.ఇదిలా ఉండగా మోడీకి చెందిన ఎఫ్ఐపీఎల్ కంపెనీ ఫలితాలను మార్కెట్ నియంత్రణా సంస్థకు అందించేది.మోడీ కంపెనీ ఫలితాలను చూస్తే.. మార్చి 2015తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఆయన కంపెనీ నిర్వహణా లాభం రూ.4,100 కోట్లు ప్రకటించింది. పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం రూ.99 కోట్లుగా వెల్లడిం చింది. అటు తర్వాత 2015-16 ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల కాలానికి రూ.1,458 కోట్ల నిర్వహణా లాభం ప్రక టించి, నికరలాభం మాత్రం రూ.26 కోట్లుగా చూపించారు. అటు తర్వాత నుంచి ఆయన మార్కెట్ నియంత్రణా సంస్థకు కానీ బీఎస్ఈకి కానీ కంపెనీ ఆర్థిక ఫలితాలను ఇవ్వడం మానుకున్నారు.

ఫిబ్రవరి 1,2016న కేర్ హెచ్చరిక

ఇదిలా ఉండగా ఫిబ్రవరి 1, 2016న కేర్‌రేటింగ్ ఒక ప్రకటనలో ఎఫ్ఐపీఎల్ మార్చి 2015 వరకు కంపెనీని సమర్థవంతంగా నిర్వహించిందని తెలిపింది. అయితే కంపెనీ పనితీరు రోజు రోజు దిగజారుతున్నా మోడీ కంపెనీ పూర్తిస్థాయిలో బ్యాంకు నుంచి ఎంత మొత్తం రుణ సదుపాయం పొందాలో వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటోందని చెప్పి కంపెనీ మొత్తం రుణ సదుపాయం అర్హత రూ.24,600 కోట్లకు తగ్గించేసింది. అదే సమయంలో ఫైర్‌స్టార్ డైమండ్స్ లిమిటెడ్.. హాంగ్‌కాంగ్‌కు చెందిన అనుబంధ సంస్థ. బ్యాంకులు మోడీ కంపెనీకి రుణాలు ఇవ్వాలనుకుంటే మాతృసంస్థ అంటే హాంగ్‌కాంగ్‌కు చెందిన కంపెనీ గ్యారంటీ ఇస్తేనే రుణాలు ఇవ్వండి అని సూచించింది. లేదంటే బ్యాంకులు మునిగిపోవడం ఖాయమని క ూడా హెచ్చరించింది. ఇలాంటి హెచ్చరిక నోటీసును మోడీకి చెందిన వేరే కంపెనీపై క ూడా జారీ చేసింది. ఇక్కడ మరో ఆసక్తి కలిగించే అంశం ఏమిటంటే మోడీతో పాటు ఫైర్‌స్టార్ గ్రూపునకు చెందిన కంపెనీలు కలిసి ఒకరికొకరు బ్యాంకు గ్యారంటీలు ఇచ్చుకున్నాయి. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా గ్యారంటీ ఇచ్చిన కంపెనీ నుంచి రుణాలను రాబట్టుకోవచ్చునని పేర్కొన్నాయి. ఎఫ్ఐపీఎల్ ఇలాంటి పలు కార్పొరేట్ గ్యారంటీలు పలు బ్యాంకర్లకు ఇచ్చాయి. ఇవన్నీ కలిసి క్రాస్ గ్యారంటీ స్ట్రక్చర్ కిందికి వచ్చాయి. ఇదిలా ఉండగా నీరవ్ మోడీ 2006లో ఎఫ్‌డీఐపీఎల్‌ను స్థాపించారు. ఈ గ్రూపు నగలు ఎగుమతి చేసే వ్యాపారంలో అడుగుపెట్టింది. సూరత్‌తో స్పెషల్ ఎకనమీక్ జోన్‌తో పాటు మహారాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఐడీసీ) ముంబైలో ఒక తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. 2014లో ముంబై, ఢిల్లీలో రెండు రిటైల్ జువెలరీ షాపులను ప్రారంభించారు. వాటిని ఆక్షన్స్, నీరవ్‌మోడీ జ్యువెలరీ అని పేరు పెట్టారు. స్టాక్ మార్కెట్ నుంచి లభించిన గణాంకాల ప్రకారం చూస్తే ఎఫ్‌డీఐపీఎల్ అమ్మకాలు 2014-15లో అమ్మకాలు రూ.1561 కోట్లు, పన్ను చెల్లించిన తర్వాత లాభాలు కేవలం 3.91 శాతం మాత్రమే చూపించారు.

2015-16 ఆర్థిక సంవత్సరం మొదటి సగభాగంలో కంపెనీ రెవెన్యూ రూ.740 కోట్లుగా చూపించారు. ఇవన్నీ గమనించిన నగల వ్యాపారవర్గాలు మాత్రం కంపెనీ ఆర్థిక పరిస్థితి చూస్తుంటే పక్కాగా సంక్షోభంలో చిక్కుకున్నట్లు తెలుస్తోందని చెబుతున్నారు. ఇక్కడ మరో అంశం ఏమిటంటే మోడీ అందుబాటులో ఉన్న అందరి దగ్గర నుంచి నిధులు సేకరించడం మొదలుపెట్టారు. 2017 జూన్‌తో ఇనిషియల్ పబ్లిక్‌ఆఫరింగ్ ద్వారా నిధులు సేకరించాలని ప్రయత్నించారు. అప్పటికే కంపెనీ ఆర్థిక పరిస్థితి దారుణంగా పడిపోవడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. మోడీ కీలమైనకంపెనీ ఫైర్‌స్టోన్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్, దీన్ని 1997లో స్థాపించారు. తర్వాత సెప్టెంబర్ 28, 2011న ఆయన దాన్ని ఎఫ్ఐపీఎల్‌గా పేరు మార్చారు. మళ్లీ ఎఫ్ఐపీఎల్‌లో మళ్లీ రెండు విభాగాలున్నాయి. వాటిలో స్టడెడ్ జ్యువెలరీ,, 2014-15లో 80 శాతం రెవెన్యూ దీన్ని సాధించారు. రెండోది కట్ అండ్ పాలిష్ డైమండ్స్ కంపెనీగా వ్యాపారం చేశారు.

CARE Ratings
Professional Risk Opinion



మోసగాళ్లను శిక్షించండి: సీఐఐ

CII

బ్యాం కులను మోసం చేసే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని భార త వాణిజ్య, పారిశ్రా మిక మం డలు లు ప్రభుత్వాన్ని కోరాయి. పీఎ న్‌బీఐకి చెందిన ఒకే బ్యాంకు బ్రాంచీలో ఈ మోసం జరి గినట్లు తెలు స్తోంది. పీ ఎస్‌యు బ్యాంకులోనే ఇలాంటి మోసాలు జరగడం ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని పారిశ్రామిక మండలి అసోచామ్ పేర్కొంది.

ఒక అధి కారి లేదా డిప్యూటి మేనేజర్ స్థాయి అధికారి ఒంటిచేత్తో బ్యాం కింగ్ రిస్కు మేనేజ్‌మెంట్ వ్యవస్థను గండి కొట్ట గలిగా రంటే .. బ్యాంకింగ్ వ్యవస్థలో నిఘా ఎంత లోపభూయిష్టంగా తెలిసిపోతోందని అసోచామ్ పేర్కొం ది. ప్రస్తుతం దేశ ఆర్థికవ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెం దు తోంది. అలాం టిస మయంలో దేశంలో కూడా అతి పెద్ద బ్యాంకింగ్ వ్య వస్థ కావాల్సి ఉంటుంద న్నారు. అ లాం టి సమ యంలో బ్యాంకింగ్ వ్యవస్థ తప్పుదారి పట్ట కుం డా చూడాల్సిన బాధ్యత బ్యాం కింగ్ యా జమాన్యాలపై ఉందని గుర్తు చేసింది.

సెబీ సీరియస్... విచారణ

•పీఎన్‌బీ,గీతాంజలిజెమ్స్ ట్రేడింగ్‌పై విచారణ



ముంబై : తాజాగా నీరవ్‌మోడీ స్కాం బహిర్గతం కావడంతో మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి పంజాబ్‌నేషనల్ బ్యాంకు, గీతాంజలి జెమ్స్ కంపెనీకి చెందిన షేర్ల ట్రేడింగ్‌పై విచారణ మొదలుపెట్టింది. సెక్యూరిటీ చట్టాన్ని అతిక్రమించినట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెబి ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఇదిలా ఉండగా జులై 2013లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) సెబిని సంప్రదించి గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీతో పాటు ఇతరులను స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్‌పై నిషేధం విధిస్తామని సూచించింది. చోక్సీ ట్రేడింగ్ నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొంది. ప్రస్తుతం సెబి, స్టాక్ ఎక్స్ఛేంజీలు రెండు కలిసి మోడీతో పాటు చోక్సీకి చెందిన కంపెనీల ట్రేడింగ్ వివరాలు సేకరించేపనిలో పడ్డాయి. వీరిద్దరిపై ఇప్పటికే పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో బ్రోకరేజి డిఫాల్ట్ ఒకటని తేలింది. ప్రస్తుతం క్యూ3 ఫలితాల సీజన్ కొనసాగుతోంది. చోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ ఈ వారం ప్రారంభంలో బోర్డు సమావేశం కావాలి. ఎలాంటి కారణంచూపకుండా బోర్డు సమావేశాన్ని రద్దు చేశారు. ప్రస్తుతం చోక్సీలో విదేశాల్లో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఆయన ఫోన్ స్విచాఫ్ చేసి ఉంది. గత మూడు రోజుల నుంచి గీతాంజలి షేరు భారీగా క్షీణించింది. శుక్రవారం మరో 20 శాతం నష్టపోయింది.

పీఎన్‌బీ మోసం పై నేడు ఐబీఏ సమావేశం

iba Indian Banks' Association

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకులో వెలుగు చూసిన రూ.11,400 కోట్ల మోసం కేసు నేపథ్యంలో ఇం డియన్ బ్యాంకు అసోసియేషన్ శనివారం నాడు సమావేశం కానున్నట్లు విశ్వ సనీయవర్గాల సమాచారం. ఇదిలా ఉండగా ఐబీఏ చైరపర్సన్‌గా ఉషా అ నంతసుబ్రహ్మణ్యం వ్యవహరిస్తున్నారు. గతంలో ఆమె పీఎన్‌బీఐ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆమె అలహాబాద్ బ్యాంకు చీఫ్‌గా ఉన్నారు. ఆమె పీఎ న్‌బీ ఎండీగా పనిచేస్తున్నప్పుడు నీరవ్‌మోడీ కంపెనీకి కొన్ని ఎల్ఓయూలను మంజూరు చేసినట్లు ఆయన వాటిని నగదు చేసుకున్నట్లు చెబు తున్నారు. ఇదిలా ఉండగా ఆర్థికమంత్రిత్వశాఖ అన్ని బ్యాంకులు ప్రస్తుతం రుణాలు వ్యవస్థపై పూర్తి స్థాయిలో సమీక్ష జరపాలని, భవిష్యత్తులో మోసాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



ఎంఅండ్ఎం నుంచి రూ. 256కోట్లు

• సేకరించిన జూమ్‌కార్స్

న్యూఢిల్లీ: కార్లు, సైకిళ్లు అద్దెకు ఇచ్చే జూమ్‌కార్స్ మహీంద్రా అండ్ మ హీంద్రా(ఎంఅండ్ఎం)తో పాటు ఇ తర ఇన్వెస్టర్ల నుంచి 40 మిలి యన్ డాలర్ల రూ.256 కోట్లు సేకరించినట్లు తెలిపింది. జూమ్‌కార్స్‌లో ప్రస్తుతం ఎంఅండ్ఎం కూడా భాగ స్వామి. తాజా పెట్టుబడులతో జూమ్‌కార్స్ ఇండియాలో ఎంఅండ్ఎం రూ.176 కోట్లు పెట్టుడులు పెట్టినట్లయింది. సేకరించిన నిధులతో మార్కెట్లో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటామని, కొత్త టెక్నాలజీని కొనుగోలు చేయడంతో పాటు కొత్త వాహనాలను కొనుగోలు చేస్తామని జూమ్‌కార్ సీఈవో గ్రెగ్ మోరాన్ తెలిపారు. ఈ నిధులతోనే మరిన్ని ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తామని తెలిపారు. జూమ్‌కార్‌లో మహీంద్రా వాటా తాజా పెట్టుబడితో 16 శాతానికి పెరిగింది. ఈ భాగస్వామ్యంలో దేశీయ రవాణా రంగంలో మరింత బలపడతామని ఎంఅండ్ఎం డైరెక్టర్ పవన్ గోయెంకా అన్నారు.

బోథ్‌ట్రీ లాభంలో 30శాతం వృద్ధి

హైదరాబాద్ : బోథ్‌ట్రీ కన్సెల్టింగ్ కంపెనీ లిమిటెడ్..ఐటి కన్సెల్టింగ్, సాఫ్ట్‌వేర్ సర్వీస్ ప్రొవైడర్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 30 శాతం వృద్ధితో రూ.0.77కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోరూ.0.59 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే ఏడాది ప్రాతిపదికన చూస్తే 50.2 శాతం వృద్ధితో రూ.26.23 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.17.48 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. తొమ్మిది నెలల కాలానికి రెవెన్యూలో 55 శాతం వృద్ధితో రూ.64.19 కోట్లు ఆర్జించగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.41.42 కోట్లని తెలిపింది. నికరలాభం విషయానికి వస్తే రూ.1.58 కోట్లు ఆర్జించగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.1.36 కోట్లని తెలిపింది.

ఆర్‌కాం ఆస్తుల విక్రయానికి వాటాదారుల ఆమోదం

న్యూఢిల్లీ : పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయిన ఆర్‌కామ్ అప్పులను తీర్చడానికి ఆస్తుల విక్రయ ప్రతిపాదనను వాటాదారులు ఆమోదించారని తెలిపింది. గురువారం నాడు జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఫలితాలను వెల్లడించింది. కంపెనీకి చెందిన స్పెక్ట్రమ్, టవర్స్, ఫైబర్, టెలికంఇన్‌ఫ్రాస్ట్రుకర్‌తో పాటు ఇతర ఆస్తులను విక్రయించాలన్న ప్రతిపాదనను 99.91 శాతం వాటాదారులు ఆమోదించారని ఆర్‌కామ్ ఒక ప్రకటనలో తెలియజేసింది. కంపెనీ మొత్తం రూ.45వేల కోట్ల అప్పులతో కునారిల్లుతోంది. ఆస్తులు విక్రయించిన తర్వాత ఇవి రూ.25వేల కోట్లకుదిగివస్తాయని తెలిపింది. భారీ నష్టాల్లో కూరుకుపోవడంతో వాయిస్‌కాల్ సర్వీసెస్‌ను నిలిపివేసింది.

జియో రూ.2,200 క్యాష్‌బ్యాక్ ఆఫర్

•స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై



హైదరాబాద్ : రిలయన్స్ జయోకు చెందిన ప్రస్తుతం ఉన్న కస్టమర్లతో పాటు కొత్త కస్టమర్లకు 22 కంపెనీలకు చెందిన స్మార్ట్‌ఫోన్లు అవి శ్యాంసంగ్, షామీ, నోకియా, ఇంటెక్స్, హువై, బ్లాక్‌బెర్రీ కొనుగోలు చేసి రూ.2,200 వరకు క్యాష్‌బైక్ పొందండని ఆఫర్ ఇస్తోంది. దీన్ని జియో ఫుట్‌బాల్ ఆఫర్ అంటారు.. జియోనెట్‌వర్కు నుంచి కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేస్తే అప్పటికప్పుడు (ఇన్‌స్టంట్)గా రూ.2,200 క్యాష్‌బ్యాంకు ఇవ్వనున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. జియోకు పోటీ కంపెనీలు మాత్రం రూ.1,500 నుంచి రూ.2,000 వరకు మాత్రమే క్యాష్‌బ్యాక్ ఆఫర్ ఇస్తున్నాయి. జియో ఆఫర్ జనవరి 15 నుంచి మార్చి 31 వరకు కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేసి రీచార్జి చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం కస్టమర్ మొట్టమొదటిసారి రూ.198, లేదా రూ.299 రీచార్జి చేసుకుంటే కస్టమర్ మై జియో ఖాతాలోరూ.44, రూ.50ల వోచర్లు జమ చేయబడతాయి. ఈ వోచర్లనుకస్టమర్ రూ.198, లేదా రూ.299కు రీచార్జి చేసుకోవచ్చునని కంపెనీ వర్గాలు చెప్పాయి.

ప్రభాత్ డెయిరీ లాభం రూ.15కోట్లు

న్యూఢిల్లీ: ప్రభాత్ డెయిరీ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంతో ఏకీకృత నికరలాభంలో 56 శాతం క్షీణించి రూ.14.76 కోట్లకు దిగిచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.33.74 కోట్లు నికరలాభాన్ని ఆర్జించినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. రెవెన్యూ విషయానికి వస్తే క్యూ3లో రూ.404.83 కోట్లకు దిగిరాగా..క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.408.31 కోట్లని తెలిపింది. కంపెనీకి నవీముంబైలో శ్రీరామ్‌పూర్‌లో పాల ఉత్పత్తి కేంద్రాలు నిర్వహిస్తోంది.

అమ్మకాల ఒత్తిడి

•ప్రారంభ లాభాల్లో చివర్లో ఆవిరి •287పాయింట్ల నష్టం



ముంబై : స్టాక్ మార్కెట్లకు చివరి ట్రేడింగ్ రోజైన శుక్రవారం సెన్సెక్స్ 287 పాయింట్లు నష్టపోయి 34,100 వద్ద ముగిసింది. ఆటో, మెటల్, పీఎస్‌యు, క్యాపిటల్‌గూడ్స్, రియల్టీ, బ్యాకింగ్ రంగానికి చెందిన షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకులో స్కాం బహిర్గతం కావడంతో దీని షేరు వరుసగా మూడో రోజు కూడా నష్టాలతో ముగిసింది. రూ.8,700 కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ నష్టపోయింది. మార్కెట్ ప్రారంభమైన వెంటనే సూచీలు లాభాలతో దూసుకుపోయి ఉదయం 34,508.24 పాయింట్ల మార్కుకు ఎగబాకింది. అటు తర్వాత మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డంతో 33,957.33 పాయింట్లకు దిగి వచ్చింది. చివరకు 286.71 పాయింట్లు నష్టపోయి 34,010.76 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 93.20 పాయింట్లు నష్టపోయి 10,452.30వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10,612.90 నుంచి 10,434.05 మధ్య ఊగిసలాడింది. మొత్తానికి రెండు సూచీలు ఈ వారం ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ స్వల్పంగా 5 పాయింట్లు పెరిగితే నిఫ్టీ మాత్రం 2.65 పాయింట్లు నష్టపోయింది. గురువారం నాడు విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.240.49 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే .. దేశీయ సంస్థాగత మదుపరులు రూ.49.92 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. గ్లోబల్ మార్కెట్లు లాభాలతో కొనసాగినా.. దేశీయ మార్కెట్లు మాత్రం నష్టాలతో ముగిశాయి. పీఎన్‌బీ స్కామ్‌తో మదుపరులు బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు కొనుగోలు చేయాలంటే హడలిపోతున్నారు. పీఎన్‌బీ జరిగిన స్కాం ఇతర బ్యాంకుల్లో కూడా జరగవచ్చునని మదుపరులు భావిస్తున్నారు. జనవరిలో నెలలో వాణిజ్యలోటు 16.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఎగుమతులు తొమ్మిది శాతం పెరిగి 24.38 బిలియన్ డాలర్లకు చేరగా.. దిగుమతులు 26.1 శాతం పెరిగి 40.68 బిలియన్ డాలర్లకు చేరాయి. బాండ్ ఈల్డింగ్ పెరగంతో మధ్య కాలికానికి మార్కెట్లో ఒడిదుడుకులు తప్పవని ఈ రంగానికి చెందిన నిపుణలు అభిప్రాయపడుతున్నారు. యూనియన్ బ్యాంకు షేరు 1.25 శాతం క్షీణించింది. పీఎన్‌బీ సెగ దానికి తగిలింది. గీతాంజలి జెమ్స్ 20 శాతం నష్టపోయింది. పీఎన్‌బీఐ 2.10 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ 2.55 శాతం వరకు క్షీణించింది.

ఎస్‌బ్యాంకు 2.52 శాతం, ఇ తర నష్టపోయిన షేర్లు ఐసీఐసీఐ బ్యాంకు, మారుతి సుజుకి, భారతి ఎయిర్‌టెల్, అదానీపోర్ట్స్, టా టాస్టీల్, ఎల్‌అండ్‌టి, ఇండస్‌ఇండ్‌బ్యాంకు, టాటామో టార్స్, కోల్ ఇండియా, పవర్‌గ్రిడ్, రిల్, యాక్సిస్ బ్యాంకు, హీరోమోటోకార్ప్, బజాజ్‌ఆటో, ఎంఅం డ్ఎం, ఓఎన్‌జీసీ, ఐటీసీలు 2.31 శాతం వరకు నష్టపోయిన వాటిలో ఉన్నాయి. వీటికి వ్యతిరేకంగా ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు 0.96 శాతం వరకు లాభపడ్డాయి. గ్లోబల్ మార్కెట్లు లాభాలతో ము గిశాయి.

జూన్ నాటికి 5జీ సర్వీసెస్ రోడ్ మ్యాప్



న్యూఢిల్లీ: డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికం (డాట్) వచ్చే జూ న్ నాటికి 5జీ రోడ్‌మ్యాప్ విడుదల చేసే అవకాశాలు న్నాయని టెలికం కార్యదర్శి అరుణా సుందర్‌రాజన్ శుక్ర వారం అసోచామ్ నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 5జీ సర్వీసు ప్రమాణాలు ఖరారవుతున్నాయని ఆమె అన్నారు. కాగా టెలికం మంత్రిత్వశాఖ 5జీ రోడ్‌మ్యాప్ రూపొందించడానికి ఉన్నతస్థాయి కమిటిని ఏర్పాటు చేసింది. గ్లోబల్ మార్కెట్లు 5జీ సర్వీసెస్ విడుదల అయినప్పుడు భారత్ మార్కెట్లో వీటిని అందుబా టులోకి తేవాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. అ యితే 5జీ సర్వీసెస్‌ను వాస్తవరూపంలోకి తేవడానికి పెద్ద ఎత్తున పైలట్ ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది.

గ్లోబల్ మా ర్కెట్లో 5జీ సర్వీసెస్ వచ్చిన వెంటనే భారత్‌మార్కెట్లో మనం ఆ టెక్నాలజాకి మారిపోవడానికి సిద్ధంగా ఉండాల నేది తమ లక్ష్యమని సుందరరాజన్ అన్నారు.ఇదిలా ఉం డగా డాట్... ఎస్ఎంఎస్‌లకు కొత్త నెంబరింగ్ స్కీంను తీసు కొస్తున్నట్లు తెలిపారు. ఇవి మెషిన్ టూ మెషిన్ (ఎం2ఎం) క మ్యూనికేషన్స్‌కు వినియోగిస్తారని ఆమె వివరించారు. 5జీ సర్వీసెస్‌లో ఎం2ఎం సర్వీసెస్‌పై ప్రధానంగా ఫోకస్ పెడు తామని ... ఉదాహరణకు కార్లలో సెన్సా ర్‌తో పాటు ఇతర వా హనాల్లో ప్ర మాదాలు నిర్వహించడానికి ఈ టెక్నాలజీని వి నియో గిస్తారు. వీటితో పాటు స్మార్ట్‌హోమ్స్, స్మా ర్ట్‌సిటీస్‌కుల వినియోగిస్తామని ఆమె వివరించారు. కేవలం 18-24 నాలుగు నెలలో టెలికం రంగంలో విప్లవాత్మకమైన మా ర్పులు చోటు చేసుకు న్నాయి. అదే వచ్చే 12నెలలో ఈ రం గంలో భారీ మార్పులు గమనిస్తారని ఆమె అన్నారు. రాబోయే నెలలో ఎం2ఎం అందుబాటులోకి వస్తుందని వివరించారు.

ఫిట్‌నెస్ ట్రయినింగ్ బ్రాండ్

•ఎఫ్45 నుంచి 100 స్టూడియోలు

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియాకు చెందిన ఫిట్‌నెస్ ట్రెయినింగ్ బ్రాండ్ ఫంక్షనల్ 45 (ఎఫ్45) 2020 నాటికి దేశవ్యాప్తంగా 100 స్టూడియోలను ప్రారంభిస్తామని శుక్రవారం నాడు ప్రకటించింది. ప్రస్తుతం ఎఫ్-45 భారత్ మార్కెట్లో 25 స్టూడియోలను నిర్వహిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు,చెన్నై, రాయ్‌పూర్‌లని ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవలే గురుగ్రామ్‌లో రూ.80 లక్షల పెట్టుబడితో కొత్త స్టూడియోను ప్రారంభించింది. గత కొన్ని సంవత్సరాలనుంచి సాధారణ భారతీయులు కూడా ఆరోగ్యంపై అవగాహన పెంచుకున్నారని, ఫిట్‌నెస్, హెల్త్, వెల్‌నెస్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ఎఫ్45 ట్రైనింగ్, గోల్ఫ్ కోర్స్ రోడ్ యజమాని గార్లపాటి దివ్య చెప్పారు. పెట్టుబడులపై ఒకటిన్నర ఏడాది తర్వాత లాభాలను ఆర్జిస్తామని ఆమె తెలిపారు.

శుభలోన్స్

హైదరాబాద్ : రుణాల కోసం దరఖాస్తు చేసుకొని తిరస్కరించబడుతు న్న వారికి డేటాసన్స్ అనే సంస్థ శుభలోన్స్ పేరుతో రుణాలు మంజూరు చేస్తోంది. వారికి సహాయ సహకరాలందిచేందుకు బెంగళూరు కేంద్రంగా ఉత్సాహవంతులైన యువకులు కొందరు శుభలోన్స్ పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేశారు. వీరు దేశంలోని రుణ విధానంపై పరిశోధన జరిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న రుణ వ్యవస్థలో పలు లోపాలున్నాయని, దీం తో లక్షలాది మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకొన్న రుణాలు లభించడం లేదని తెలియజేసింది. దేశంలో చాలా మంది విద్యారుణాలు, గృహ, వైద్య ఖర్చుల కోసం రుణాల కోసం దరఖాస్తు చేసుకుంటారు. అయితే శుభలోన్స్ వారి ఆండ్రి యాడ్ అప్లికేషన్ ద్వారా క్రెడిట్‌స్కోర్ నివేదికరూపొందించి వారికి రుణాలు ఇప్పిం చేందుకు సహకరిస్తుందని శుభలోన్స్ నిర్వాహకులు మోనిష్ ఆనంద్, రాహుల్‌శేఖర్‌లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

సీజీజీకి టీఎస్‌పీఎస్సీ గుడ్‌బై..!

● ఇకపై నోటిఫికేషన్లకు సీజీజీ వెళ్లొద్దని నిర్ణయం ● టీఎస్‌టీఎస్‌కు ఇవ్వాలనే ఆలోచనలో కమిషన్ ● సొంత టెక్నికల్ సపోర్టుకు ప్రయత్నిస్తున్న టీఎస్‌పీఎస్సీ ● టీఆర్‌టీ తప్పుల సవరణకు ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగాల భర్తీ చేపడుతున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ టెక్నికల్ సహకారం తీసుకుంటున్న సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) నుంచి తప్పుకోవాలని కమిషన్ ఆలోచిస్తోంది. ఇప్పటికే పలు సందర్భాల్లో సీజీజీ చేసిన పొరపాట్ల మూలంగా రాజ్యాంగబద్ధమైన టిఎస్‌పిఎస్సీ సంస్థ అబాసుపాలవుతోంది. ఈ నేపథ్యంలో తాము చేయని తప్పులకు అనవసరంగా తామెందుకు బదనాం కావాలనే ఆలోచన కమిషన్ వర్గాలు చేస్తున్నట్టు సమాచారం. టెక్నికల్ సపోర్ట్ విషయంలో టిఎస్‌పిఎస్సీ వేరే గత్యంతరం లేక సీజీజీని ఆశ్రయించాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఇప్పటి వరకు జరిగింది చాలని, ఇకపై వచ్చే నోటిఫికేషన్లకు టెక్నికల్ సపోర్ట్‌ను సీజీజీ నుంచి కాకుండా తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీసెస్(టిఎస్‌టిఎస్) నుంచి తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అదీ కూడా టిఎస్‌పిఎస్సీ సొంతంగా టెక్నికల్ విభాగాన్ని ఏర్పాటు చేసుకునే వారకు మాత్రమే టిఎస్‌టిఎస్ ద్వారా టెక్నికల్ సపోర్ట్ తీసుకోవాలని ఆలోచిస్తోంది.

గ్రూప్-1 పరీక్షలో నిర్వహణ అనంతరం టిఎస్‌పిఎస్సీ ఫలితాలను ప్రకటించింది. ఫలితాల తరువాత ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఆ తరువాత పోస్టింగుల విషయంలో సీజీజీ సహకారం తీసుకోవల్సి వచ్చింది. టిఎస్‌పిఎస్సీ చేపట్టిన పనుల్లో లోపాలు జరగకపోయినా, సీజీజీ చేసిన పొరపాటు మూలంగా పోస్టుల కేటాయింపులో మరోసారి నిర్ణయం తీసుకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా గురుకులాల జెఎల్, డిఎల్ పరీక్షల ఫలితాల వెల్లడిలో కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. ఇటువంటి సందర్భాలు ఎదుర్కొంటున్న టిఎస్‌పిఎస్సీ ఇకపై టెక్నికల్ సపోర్ట్‌కు ఇకపై సీజీజీపై ఆధారపడకుండా ఉండాలనే ఆలోచనకు వచ్చినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సీజీజీని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఉన్న సిబ్బందిలో చాలా మంది రాష్ట్ర విభజన అనంతరం ఏపికి వెళ్లారు. ప్రస్తుతం సీజీజీలో పనిచేస్తున్న సిబ్బందికి అంత అనుభవం లేదనే ఆరోపణలు, విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సీజీజీలో పలు సమస్యలు వస్తున్నాయి. సీజీజీలో గ్రూప్-1 ఫలితాలు, గురుకులాల పరీక్షల ఫలితాలే కాదు... డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల సమయంలో కూడా ఇటువంటి పొరపాట్లే జరిగాయి. సీట్ల కేటాయింపులో అన్ని అవకతవకలు జరిగాయి. ఒకసారి ఒక కాలేజీలో సీటు పొందిన వ్యక్తి మరోసారి ఇంకో కాలేజీలో సీటును పొందాడు. కొందరికి మొదటిసారి సీటు పొందినప్పటికీ రెండోసారి సీటు రాలేదు.

ఇలాంటి తప్పిదాల మూలంగా విద్యార్థులు తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు ధర్నాలు సైతం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ అనుభవాలను చూసిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి తమ అడ్మిషన్లకోసం సీజీజీ టెక్నికల్ సపోర్ట్ కాకుండా టిఎస్‌టిఎస్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇటువంటి పరిస్థితులు ఉన్న నేపథ్యంలో కొత్తగా వెలువడే నోటిఫికేషన్లలో మళ్లీ ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు టిఎస్‌పిఎస్సీ టెక్నికల్ సపోర్ట్‌ను సీజీజీ నుంచి కాకుండా తమ సొంత టెక్నికల్ సపోర్ట్ రూపొందించే వరకు టిఎస్‌టిఎస్ సహకారం తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది.

టిఆర్‌టి అభ్యర్థులకు ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్క్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష దరఖాస్తులో తప్పులను సరిచేసుకోవడంలో వస్తున్న ఇబ్బందులను తొలగించడం కోసం కమిషన్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. టిఆర్‌టి దరఖాస్తుల ఎడిట్ ఆప్షన్‌లో ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో శుక్రవారం సీజీజీ డిజీ రాజేంద్ర నిమ్జి, టిఎస్‌పిఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, కార్యదర్శి వాణిప్రసాద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభ్యర్థులు పడుతున్న ఇబ్బందులను టిఎస్‌పిఎస్సీ చైర్మన్, కార్యదర్శి సీజీజీ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని సరిచేసి అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా ఉండటం కోసం ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు హెల్ప్‌లైన్ డెస్క్ ఉదయం 9.30 గంటల నుంచి రాత్రి 6.30 గంటల వరకు పనిచేస్తుందని కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు.అభ్యర్థులు మెయిల్స్ ద్వారా గానీ, నేరుగా గానీ తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఫోన్ నంబర్ 8333923740 కు ఫోన్ చేసి అభ్యర్థులు తమ సమస్యలను తెలియజేయవచ్చని సూచించారు. అభ్యర్థులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు ఆందోళన చెందకుండా హెల్ప్‌లైన్‌డెస్క్ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రకటించిన షెడ్యూల్ మేరకు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయండి

హోంమంత్రిని కలిసిన వామపక్షాలు, ఐకాస నేతలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సిరిసిల్ల జిల్లా నేరెళ్ళ ఘటనలోబాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ వామపక్షాలు, తెలంగాణ ఐకాస చైర్మన్ కోదండరాం ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం శుక్రవారం హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డిని కలిశారు. మంత్రుల నివాస ప్రాంగణంలో జరిగిన సమావేశంలో నేరెళ్ళ బాధితుల కష్టాలను హోంమంత్రికి వివరించారు. నేరెళ్ళలో ఇసుక మాఫియా ఆగడాలను అడ్డుకున్న వారిపై పోలీసులు అత్యంత దారుణంగా వ్యవహరించారని, పోలీసులు బాధితులను కులం పేరుతో దూషించారని తెలిపారు. ఇసుక అక్రమార్కుల ఆగడాలను అడ్డుకున్న వారిని విచక్షణారహితంగా హింసించారని చెప్పారు. ఈ సందర్భంగా సిపిఐ, తెలంగాణ ఐకాస, తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రపతి, గవర్నర్, డిజిపికి ఫిర్యాదు చేసినా నేరెళ్ళ బాధితులకు న్యాయం జరగడం లేదని, ఎస్పీపై ఇప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. తీవ్రంగా గాయపడ్డ బాధితులకు ప్రభుత్వ ఉద్యోగం, ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు చెప్పిన అంశాలన్నింటినీ సావధానంగా విన్న హోం మంత్రి సానుకూలంగా స్పందించారని కోదండరాం చెప్పారు. ఈ విషయాలను సిఎం దృష్టికి తీసుకు వెళ్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

మైనింగ్ తవ్వకాలకు అనుమతులు

రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న

హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో మైనింగ్ తవ్వకాలకు నిర్ణిత గడువులోగా అనుమతులు ఇచ్చేలా సమన్వయ కమిటిని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. మైనింగ్ కార్యకలాపాల వల్ల నష్టపోతున్న స్థానికులకు పునరావాసం కల్పన కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి తెలిపారు. శుక్రవారం హైటెక్స్‌లో మైనింగ్ టుడే - 2018 ముగింపు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి, తెలంగాణ మినరల్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ సుభాష్‌రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి జయేష్‌రంజన్‌తో వివిధ శాఖ అధికారులు వినోద్‌కుమార్, వాసుదేవ్, నందా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రామన్న మాట్లాడుతూ మైనింగ్ ప్రక్రియతో పర్యావరణ అంశాలకు ముడిపడి ఉందన్నారు. మైనింగ్ శాఖ నిర్లక్ష్యం వహిస్తే పర్యావరణానికి ప్రమాదం ఏర్పడుతుందన్నారు. పర్యావరణ సమతుల్యాన్ని పెంచడానికి అటవీశాఖ ద్వారా హరిత హారం కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి రామన్న తెలిపారు. మైనింగ్ చేసేటప్పుడు నూతన సాంకేతికతను ఉపయోగించి ఖర్చు తగ్గే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి జగదీష్‌రెడ్డి సూచించారు.

సాంత్రగచ్‌కు రెండు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సికింద్రాబాద్ - సాంత్రగచ్ మధ్యన రెండు ప్రత్యేక రైళ్లను నడిపించబోతున్నారు. ఈ ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్ నుండి ఈ నెల 26న 21.40 గంటలకు బయదుదేరి మరుసటి రోజు 03.00 గంటలకు సాంత్రగచ్ చేరుకుంటుంది. అదే విధంగా తిరుగు ప్రయాణంలో సాంత్రగచ్ నుండి 28వ తేదీ 11.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 16.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

బీదర్ - గుల్బర్గ రైలు బయలుదేరు సమయాల్లో మార్పులు

బీదర్ - గుల్బర్గ రైలు బయలుదేరు సమయాల్లో మార్పులు చేశారు. ఈ నెల 19 నుండి కొత్త టైమ్ టేబుల్ ప్రకారం బీదర్ - గుల్బర్గ రైళ్లు తిరుగుతాయని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

ఎల్‌పీజీ సరఫరాకు ప్రత్యామ్నాయం


హైదరాబాద్, ఆంధ్రప్రభ : రవాణా ఆపరేటర్ల ఆందోళనతో వంట గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం జరిగిందని చమురు సంస్థలు తెలిపాయి. ఏప్రిల్ 2018 వరకు కాంట్రాక్టు కొనసాగనున్న ట్రక్ ఆపరేటర్లు సమ్మెలో పాల్గొనడం అంతకు ముందు కుదిరిన ఒప్పందాలకు విరుద్ధమని ఆయిల్ కంపెనీలు తెలిపాయి. దాదాపు 20 వేల ఆయిల్ టాంకర్ల ఒప్పందం ఏప్రిల్ వరకు ఉందని, ఆ తర్వాతనే కొత్త కాంట్రాక్టులు అమలులోకి వస్తాయని తెలిపాయి. ఆయిల్ టాంకర్ల యాజమాన్యాలు వాస్తవాలను గుర్తించి ఆందోళన విరమించుకోవాలని కోరాయి. కొత్త టెండర్ ప్రక్రియ పై అభ్యంతరం వ్యక్తం చేస్తు దేశ వ్యాప్తంగా ఆందోళనకు దిగిన అయిల్ టాంకర్ల యాజమాన్యాలు దశల వారిగా ఆందోళన విరమించుకొన్నారని, ఒక్క దక్షిణాధి టాంకర్ల యాజమాన్యాలే ఆందోళన కొనసాగిస్తున్నారని తెలిపారు. టాంకర్ల యాజమాన్యాల సమ్మెతో టాంక్ వ్యాగన్ ఆపరేషన్స్, పైప్ లైన ఆపరేషన్స్ ద్వారా వినియోగదారులకు సకాలంలో ఎల్‌పిజీని సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

సీఎం సహాయనిధికి ఉపాధ్యాయుల సాయం

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఐక్యకార్యాచరణ సమితి (టీటీజేఏసీ) ఉపాధ్యాయులు మార్చి నెలలో ఒక్కరోజు మూల వేతనాన్ని సీఎం సహాయనిధికి ఇస్తున్నట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి శుక్రవారం ఎమ్మెల్సీలు కె.జనార్ధన్‌రెడ్డి, పూల రవీందర్‌లు మంత్రి హరీష్‌రావుకు ఓలేఖను అందజేశారు. సైనిక సంక్షేమానికి సంబంధించి ఈ మూలవేతనాన్ని ఇస్తున్నట్టు వారు ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితో ముందుకొచ్చిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో టీటీజేఏసీ కన్వీనర్ సరోత్తంరెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు

హోటళ్లు, బేకరీలను తనిఖీ చేసిన మంత్రి లక్ష్మారెడ్డి



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ఆహార పదార్థాలు నాణ్యమైనవేనా, కల్తీ చేస్తున్నారా, ఏ కంపెనీ నూనె వాడుతున్నారు, నూనెను ఎన్నిసార్లు వేడిచేస్తారు, మీ ఇంటి కిచెన్‌ను ఇలాగే ఉంచుకుంటారా, హోటల్‌ను ఇంత అధ్వాన్నంగా ఉంచుతారా అంటూ వైద్య ఆరోగ్య శాఖా మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఓ హోటల్ యజమానిని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. శుక్రవారం వైఎంసీ చౌరస్తాలోని హోటళ్లను, బేకరీ, తినుబండరాలు విక్రయించే వాటిని ఆయన పరిశీలించారు. వారు తయారుచేసే ఆహార పదార్థాల్లో ఉపయోగించే కారం, టీ పొడి, నూనె తదితర వాటి శాంపిళ్లను సేకరించి మొబైల్ వాహనంలో ఉన్న ల్యాబ్‌కు వాటిని పంపించారు. పరీక్షల్లో వారు వాడేవన్నీ చాలావరకు కల్తీతో కూడుకున్న వేనని తేలింది. దీంతో యజమానులను పిలిపించి ఆహార పదార్థాల్లో ఉపయోగించే వస్తువులను ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తారో అడిగి తెలుసుకున్నారు. ఇకపై జాగ్రత్తగా వ్యవహరించాలని మరోసారి కల్తీ ఆహార పదార్థాలు వాడినట్టు తేలితే కఠిన చర్యలు తీసుకుంటా మని ఆయన వారిని హెచ్చరించారు. హోటల్ దగ్గర ఉన్న వినియోగదారులకు మంత్రి లక్ష్మారెడ్డి కల్తీ విషయమై అవగాహన కల్పించారు. ఒక బేకరీని పరిశీలించిన మంత్రి దానికి పర్మిషన్ ఉందా, బ్రెడ్డును ఎక్కడ నుంచి కొనుగోలు చేస్తారు, పాచివీ ఏం చేస్తారు, ఫుడ్ సేఫ్టీ సర్టిఫికెట్ ఉందా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసికట్టుగా కల్తీపై పోరాటం చేస్తున్నాయన్నారు. ఇప్పటిదాకా చట్టాలు సరిగా లేకపోవడంతో నివారణకు ఇబ్బందిగా మారిందన్నారు. మొదటగా కల్తీపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. హోటల్స్‌కు త్వరలో గ్రేడింగ్ విధానం ఇచ్చే ఆలోచనలో ఉన్నామని, వారిపై పీడీ యాక్టు ప్రయోగించడానికి వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. మంత్రి వెంట ఐపీఎం డైరెక్టర్ శంకర్, ఫుడ్ ఇన్స్పెక్టర్లు ఉన్నారు.

డయాగ్నస్టిక్ కేంద్రాల పనులు వేగవంతం చేయాలి

ప్రజలకు అన్నిరకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించేపథకం (డయాగ్నస్టిక్) ప్రారంభోత్సవానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖా మంత్రి లక్ష్మారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐపీఎంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించి జరిపిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ ప్రజలు అనేక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసలు ప్రజలకు ఏయే వ్యాధులు ఉన్నాయి, వాటిని ప్రాథమిక స్థాయిలో ఎలా గుర్తించాలి, వాటిని నయం చేసే విధానం ఎలా, ఇందుకు అవసరమైన మానవ వనరులు, శిక్షణ, పరికరాలు, వైద్యశాలల ఆధునికీకరణ అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఐపీఎం ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యాధి నిర్ధారణ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి తన రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం ఇచ్చారు.

ప్రభుత్వాలు హామీలను నెరవేర్చాలి



మల్కాజిగిరి, ప్రభ న్యూస్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేవరకు తమ ఉద్యమాలను కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మల్కాజిగిరిలో నిర్వహించిన మేడ్చల్ జిల్లా 2వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నోట్ల రద్దుతో నల్లధనాన్ని బయటకు తీసుకొస్తామని చెప్పి తీసుకురాలేకపోయిందనీ, బ్యాంకుల్లో దాచుకున్న మన డబ్బులను మనం తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భూ మాఫియా, ఇసుక మాఫియా రాజ్యమేలుతుందని విమర్శించారు. భూసర్వే పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్వే హైదరాబాద్‌లో మాత్రం నిర్వహించడం లేదని అధికార పార్టీ నాయకులే భూ కబ్జాలకు పాల్పడుతుంటే పట్టించుకోకుండా నిరుపేదలు వేసుకుంటున్న గుడిసెలను తొలగిస్తూ వారిపై అక్రమ కేసులను బనాయిస్తూ జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగాలిస్తామని చెపి్ప ఇప్పటికీ ఆ హామీని నేరవేర్చలేదనీ, నయీం వ్యవహారంలో భయటపడిన 10వేల కోట్ల ఆస్తులను కూడబెట్టుకుని వాటిలో బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పి, నేడు వాటి ప్రస్తావన ఎందుకు తీసుకురావటం లేదో ప్రజలకు బహిర్గతం చేయాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లవెంకట్‌రెడ్డి, ఎన్.బాలమల్లేష్, రాష్ట్ర నాయకులు వీఎస్‌బోస్, జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ దశరథ్, జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్.కృష్ణమూర్తి, శంకర్‌రావు, లక్ష్మి. శంకర్, పీవీరమణ; చంద్రయ్య, నర్సింహా, లక్ష్మినారాయణ, జానీ, జంగయ్య, బాల్‌రాజు, కమలమ్మ, సత్యనారాయణ, గిరిజ, యాదయ్యగౌడ్, మహాలక్ష్మి, సదానంద్‌లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆనంద్‌బాగ్ చౌరస్తా నుంచి గాంధీపార్కు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

మావోల ఏరివేతపై ఉమ్మడి కసరత్తు?

ఛత్తీస్‌గడ్, తెలంగాణ పోలీసు అధికారుల రహస్య భేటీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : మావోల ఏరివేతపై పోలీసుల కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు తెలంగాణలోని భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో రహస్యంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో ఛత్తీస్‌గఢ్ ఐజీ వివేకానంద కూడా పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతాలుగా ఉన్న పూర్వ ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఉన్నా యి. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో మావోల సంచారం అధికంగానే ఉంది. ఇటీవలి కాలంలో మావోలు బలం పుంజుకున్నారన్న వార్తలు వెలువడుతున్న సంగతి తెలిసిందే. గోదావరి నదీ పరివాహక ప్రాంతమంతా దట్టమైన అడవులతో నిండి ఉండటం వల్ల ఆ ప్రాంతమంతా మావోలకు సేఫ్ జోన్‌గా మారిందని తెలుస్తోంది. రాష్ట్ర డీజీపీగా మహేందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి జిల్లా పర్యటనగా భద్రాద్రి-కొత్తగూడెం జిల్లానే ఎంచుకోవడం గమనార్హం. ఆ క్రమంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్ సిబ్బంది భద్రతాపరంగా ఏ విధమైన చర్యలు తీసుకోవాలనే విషయాన్ని సైతం డీజీపీ మహేందర్‌రెడ్డి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. కాగా, చాపకింద నీరులా మావోలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇటీవల మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు జంపన్న, అతడి సహచరి పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆ సందర్భంగా తెలంగాణలో ఉన్న 135 మంది మావోలు లొంగిపోవాలని వారికి పునరావాసం కల్పిస్తామని డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. వచ్చిన ప్రతి అవకాశాన్ని తమకనుకూలంగా మలు చుకుంటూ మావోలు ముందుకు సాగుతున్నారని తెలుస్తోంది. మావోలకు కొరి యర్లకు వ్యవహరించే వారిపై పోలీసులు దృష్టి కొనసాగిస్తుండగా.. పోలీసు ఇన్ ఫార్మర్‌లు ఎవరన్నదానిపై మావోలు దృష్టిసారిస్తుండటం గమనార్హం. ఎఆగా, మావోల కార్యకలాపాలు మళ్లీ ఊపందుకోవడంతో రెండు రాష్ట్రాలు ఛత్తీస్‌గడ్, తెలంగాణలు సంయుక్తంగా మావోల ఏరివేతకు వ్యూహరచన చేస్తున్నారు. ఇదే క్రమంలో వారు శుక్రవారం రహస్య భేటీ నిర్వహించారు. ఈ భేటీలో పలు వ్యూహాత్మక నిర్ణయాలను చర్చించారు. ఓ వైపు మావోల సమస్య లేదంటూనే మరోవైపు మావోల సమస్య పెద్దదేనంటూ ఏపీ, తెలంగాణ రాష్ట్ర డీజీపీలు పలుసార్లు స్పష్టం చేసిన సందర్భాలు లేకపోలేదు.

ఏవోబీ ప్రాంతంలో కొనసాగుతున్న కూంబింగ్

మరోవైపు ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మావోల కోసం పోలీసుల కూంబింగ్ ముమ్మరమైంది. హెలికాప్టర్ల ద్వారా రెక్కీలు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తృటిలో తప్పించుకున్న మావో అగ్రనేతలపైనే ఈ మారు దృష్టి సారించారు. ప్రధానంగా మావో అగ్రనేత ఆర్కేని టార్గెట్ చేస్తూ ఈ కూంబింగ్ కొనసాగుతోంది.

విషవాయువుకు ఏడుగురు బలి

● డ్రైనేజీ శుభ్రం చేయడంలో దుర్ఘటన ● మరో ఇద్దరు ఆస్పత్రికి తరలింపు ● చిత్తూరు జిల్లాలో విషాదం

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: ఒక ప్రైవేటు హేచరీస్ కు సంబంధించిన డ్రైనేజి ను శుభ్రం చేయడానికి ప్రయత్నించే క్రమం లో విషవాయువుల తీవ్రతకు ఏడుగురు దుర్మరణం పాలైన సంఘటన శుక్రవారం ఉదయం చిత్తూరు జిల్లా పలమనేరు వద్ద జరిగింది. ఈ సంఘటన పూర్వాపరాలు ఇలా వున్నాయి. పలమనేరు మండలం మొరం గ్రామం వద్ద తమిళనాడుకు చెందిన వారు వేంకటేశ్వర హేచరీస్‌ను నిర్వహిస్తు న్నారు. ఈ క్రమంలో అక్కడ పనిచేసేవారి జనవాసాలకు, హేచరీస్ కోళ్ల ఫారానికి కలిపి ఒకే డ్రైనేజి ఏర్పాటు చేశారు. తరచుగా ఆ డ్రైనేజిలో మురుగు సమస్య ఏర్పడడం, సంబంధిత సిబ్బంది డ్రైనేజి సంప్‌లో దిగి శుభ్రం చేయడం జరుగుతూ ఉంటుంది. ఇదే క్రమంలోనే శుక్రవారం ఉదయం ఎం రమేష్32), గోవిందస్వామి(35), బి రామచంద్ర(23), ఎ రెడ్డెప్ప(30), ఆర్ బాబు(30), కేశవ(20), బి వెంకటరాజులు(23, శివకుమార్‌రెడ్డి(45) అనే 8 మంది డ్రైనేజిని శుభ్రం చేయడానికి ఉపక్రమించారు. ఎప్పటిలాగే సంప్‌లోనికి ముందుగా నిచ్చెన ద్వారా దిగిన ముగ్గురి జాడ లేకపోవడంతో మిగిలిన వారు కూడా ఇద్దరిద్దరుగా లోపలకు దిగి అక్కడే పడిపోయారు. బయట ఉన్న ప్రజలు కేకలు వేయడంతో



అందరూ కలిసి ముఖాలకు మాస్కులు ధరించి లోపల దిగి లోపల విగతజీవులై పడిఉన్న 7 గురిని, ఊపిరి తీసుకోడానికి కష్టపడుతున్న శివకుమార్, హరికృష్ణలను బయటకు తీశారు. వెంటనే శివకుమార్, హరికృష్ణలిద్దరినీ చికిత్స నిమిత్తం వేలూరు సిఎంసి ఆసుపత్రికి తరలించారు. డ్రైనేజిలో పేరుకుపోయిన మురుగులో ఉత్పత్తి అయిన విష వాయువులే ఈ 7 గురి మరణానికి కారణమయ్యాయని ప్రాథమిక దర్యాప్తు ప్రకారం తేలింది. మరణించిన వారిలో రమేష్, రెడ్డెప్ప, మొరం గ్రామ వాసులు కాగా రామచంద్ర, గోవింద, కేశవ, వెంకటరాజు చిత్తూరులోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. ఇక బాబు కర్నాటక రాష్ట్రం ముళబాగల్ ప్రాంతానికి చెందినవాడని, శివ అనంతపురం జిల్లా కదిరి ప్రాంతీయుడని, హరికృష్ణ బైరెడ్డి పల్లె ప్రాంతీయుడని అధికారులు పేర్కొన్నారు. సంఘటన గురించి తెలియగానే తిరుపతి ప్రాంత పర్యటనలో ఉన్న కలెక్టర్ ప్రద్యుమ్న ఆదేశాల మేరకు జిల్లా అధికారులు హుటా హుటిన మొరం గ్రామానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కలెక్టర్ ప్రద్యుమ్న కూడా మధ్యాహ్నం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల కుటుంబాలను ఓదార్చి ప్రభుత్వపరమైన సహాయాలను ప్రకటించారు. కాగా విదేశీ పర్యటనలో ఉన్న పలమనేరు శాసనసభ్యుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి అమరనాథ్ రెడ్డి జరిగిన దుర్ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపిస్తామని ప్రకటించారు.

నగరం నడిబొడ్డున క్షుద్రపూజల కలకలం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నగరం నడిబొడ్డున క్షుద్రపూజల కలకలం రేగింది. దోమలగూడలో ఓ ఇంట్లో క్షుద్రపూజలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. అక్కడ క్షుద్రపూజలు నిర్వహిస్తున్న శంకర్‌లాల్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పూజా సామాగ్రిని స్వాధీనం చేసకున్నారు. శంక ర్‌లాల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

విభజన హామీలపై రాజీలేని పోరు

- అందరినీ కలుపుకు పోదాం • కేంద్రంపై ఒత్తిడి తెద్దాం
- సమాచార సేకరణకు త్రిసభ్య కమిటీ • 11 హామీలపై నేడు చర్చ • పవన్ జేఏఫ్‌సీలో విస్తృత చర్చ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని అంశాలు, ప్రత్యేక హోదా హామీని సాధించడంపై జనసేన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో కదలిక తెచ్చింది. హామీల అమ లు, నిధుల మంజూరుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న పరస్పర ప్రకటనలపై అధ్యయనం చేసేందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ అధ్యక్షతన శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ కళ్యాణ్‌తో పాటు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామ కృష్ణ విశ్రాంత ఐఏఎస్ అధికారులు పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, మహారాష్ట్ర క్యాడర్‌కు చెందిన చంద్రశేఖర్ తది తరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన సమావేశంలో భవిష్యత్తు ప్రణాళికపై సుదీర్ఘంగా చర్చిం చారు. ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన తర్వాత పవన్ కళ్యాణ్ సమావేశం నిర్వహించిన ప్రైవేట్ హోటల్‌కు చేరుకున్నారు. పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేసిన ముగ్గురు సభ్యుల నిజనిర్ధారణ కమిటీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విభజన హామీల అమలు, నిధు ల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తుంది. దీన్ని ప్రజల ముందుంచి, వారికి వాస్తవాలను తెలిపి హక్కుల సాధనకు కేంద్రంపై పోరాటం చేసేందుకు పవన్ కళ్యాణ్ సిద్ధమవుతున్నారు. న్యాయమైన హక్కుల సాధన కోసం బలమైన ఉద్యమం నిర్మించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అను సరించాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. విభ జన హామీలపై రాజీ లేకుండా పోరాటం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ పోరాటంలో అన్ని రాజకీయ పార్టీలు, విద్యావంతులు, ప్రజా సంఘాలు, ప్రజలను భాగస్వా ములను చేయాలని నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగేళ్ళుగా నిర్లక్ష్యంచేస్తూ ఎన్నికల వేళ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని సమావేశంలో పాల్గొన్న నేతలు అభిప్రాయపడ్డారు. విభజన హామీలపై సమగ్ర సమాచారాన్ని సేకరించి రాష్ట్ర ప్రజలు, విద్యావంతులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టా ల్సిన అంశాలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విభజన హామీలు, నిధుల మంజూరుపై చేస్తున్న పరస్పర లెక్క లను తేల్చాలని నిర్ణయించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తెలుగుదేశం, భాజపా, వైకాపాలను క ూడా తమ ఉద్యమంలో భాగస్వాములను చేయాలని నిర్ణయించారు. ఇదిలా ఉండగా, హామీల సాధనకు శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమం నిర్మించాలని సమావేశంలో జేపీ, ఉండవల్లి అభిప్రాయపడ్డారు. అయితే విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రం మోసం చేసినందున ఉద్యమం తీవ్రంగానే ఉండాలని వామపక్షాలు అభిప్రాయపడ్డాయి. ప్రజలను కూడగట్టి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేలా ఉద్యమం చేయాలని, దీనికి తమ పార్టీలు పూర్తిగా ముందుంటాయని వారు చెప్పారు. ఫెడరల్ స్ఫూర్తిని గౌరవి స్తూ శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హక్కులు సాధించాలని సమావేశంలో పాల్గొన్న వారు సూచించారు. ఎలాంటి హింసకు తావు లేకుండానే ప్రజాభి ప్రాయాన్ని సేకరించి ఒకే గొంతుతో తమ డిమాండ్లను ఎలుగెత్తి కేంద్రం అంగీకరించేలా ఉద్యమం చేయాలని కమ్యూనిస్టులకు సూచించినట్టు సమాచారం. అయితే ముందు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు సమగ్ర సమాచారాన్ని సేకరించే అంశంపై కసరత్తు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఇందుకోసం పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు, చంద్రశేఖర్‌లతో కూడిన కమిటీని ఏర్పాటుచేసి సమాచారాన్ని అధ్యయనం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కమిటీ 11 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుంది. ఈ అంశాలపై శనివారం కూడా చర్చించి తగిన కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు.

నేడు చర్చించే అంశాలు

1. విభజన చట్టం హామీలు, అమలు, 2. విభజన సమయంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పించడం, 3. రాష్ట్రానికి పన్నుల వాటా, కేంద్ర ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడం,

4. రాష్ట్రానికి నరేంద్రమోడీ ఇచ్చిన హామీలు, 5. పోలవరం, 6. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, 7. రైల్వే జోన్, 8. రాజధాని నిర్మాణానికి నిధులు, 9. మెట్రోరైలు, ఓడరేవులు తదితర మౌలిక సదుపాయాల కల్పన, 10. పన్ను రాయితీ, 11. కేంద్ర ప్ర భుత్వ సంస్థల ఏర్పాటు తదితర అంశాలపై శనివారంనాటి సమావేశంలో చర్చిస్తారు. ఈ అంశాలకు సంబంధించి సమగ్ర సమాచారాన్ని సేకరించి వాటిని అధ్యయనంచేసి వాస్తవాలను ప్రజల ముందుంచాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పరస్పర ప్రకటనలకు ఈ అధ్యయనం అద్దం పడుతుందని, తద్వారా ప్రజలను భాగస్వాములను చేసి హక్కుల సాధనకు ఉద్యమరూపంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలని సమావేశంలో నిర్ణయించారు. చేయని నేరానికి ఆంధ్రా ప్రజలు శిక్షను అనుభవిస్తున్నారు. ప్రజలు ఆవేదన, ఆగ్రహంతో ఉన్నారు.

- పి. మధు

ప్రజలు బాధను వ్యక్తంచేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ నైజాన్ని చాటుతున్నాయి. హామీల అమలు, నిధుల మంజూరుపై వాస్తవాలు ప్రజలకు తెలపాలనుకున్నాం. రెండు ప్రభుత్వాలు పరస్పర ప్రకటనలు చేసుకోవడంపై బాధ్యతగా నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేశాం. హక్కుల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేస్తాం. అంశాల వారీగా అధ్యయనం చేసేందుకు ఉప కమిటీలను నియమించి వాటికి బాధ్యతలు అప్పగిస్తాం సమగ్ర సమాచారంతో ముందడుగు వేస్తాం. తెలుగుదేశం, భాజపా, వైకాపాలను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించాం. అయితే ఆ పార్టీలు మరో మార్గంలో ఆందోళన చేయాలనుకుంటున్నందున రాలేకపోయి ఉంటాయి.

- పవన్ కళ్యాణ్

ఆంధ్రా, తెలంగాణలో కూడా హామీల అమలు ఉల్లంఘనపై ప్రజలు బాధను వ్యక్తంచేస్తున్నారు. ప్రజల హక్కుల సాధనకు ఫెడరల్ స్ఫూర్తితో దేశ సమగ్రత కాపాడుకుంటూ, ఆగ్రహావేశాలు లేకుండా నిర్మాణాత్మకంగా ఉద్యమం చేపట్టి కేంద్రంపై ఒత్తిడి తేవాలి. రాష్ట్రానికి ఇచ్చిన నిధుల ఖర్చుపై లెక్కలు అడిగే హక్కు కేంద్రానికి లేదు. విభజన హామీలన్నీ సాధిస్తామని హామీ ఇవ్వడంలేదు. అయితే చిత్త శుద్ధి, విశ్వసనీయతతో అందరిని కలుపుకుని కేంద్రంపై ఒత్తిడి తేవాలనుకుంటున్నాం.

- జయప్రకాశ్ నారాయణన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నాయి. నాలుగేళ్ళుగా ఆంధ్రా ప్రజలను ఈ రెండు ప్రభు త్వాలు మోసం చేస్తున్నాయి. పార్లమెంట్‌లో ప్రధాని ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిలదీస్తున్నాం.

- రామకృష్ణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగేళ్ళుగా నిర్లక్ష్యం వహించి కాంగ్రెస్ పార్టీపైనే తప్పు నెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. ప్రత్యేక హోదా హామీ అమలు లేదు. రాష్ట్ర విభజన పాపం కాంగ్రెస్‌ది అయితే, విభజన కోసం రెండుసార్లు లేఖ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుది కూడా పాపమే అవుతుంది.

- గౌతం

చట్టం చేయాలని కోరుతారేగానీ చేసిన చట్టాన్ని అమలు చేయాలని అడగమేంటి. మోడీ, చంద్రబాబు కలిసి మళ్లీ హామీల ప్రకటనలు చేస్తారు. ఎన్నికల తర్వాత దాన్ని అమలు చేస్తారన్న నమ్మకం ఎలా ఉంటుంది.

అడ్డగోలు విభజనతో డిపాజిట్లు కోల్పోయారు

ప్రీ బడ్జెట్ సమీక్షలో సీఎం చంద్రబాబునాయుడు

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్రం న్యాయబద్ధంగా అవసరమైన నిధులను సైతం ఇవ్వలేదని, కనీసం ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ఆ రోజు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హేతుబద్ధత లేకుండా, ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా రాష్ట్ర విభజించిందని అన్నారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ఆయన ఏపీ ప్రీ బడ్జెట్‌పై సమీక్షసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టారీతిన రాష్ట్ర విభజనకు పాల్పడిన కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. గత ఎన్నికల్లో ఆ పార్టీకి డిపాజిట్లు రాకుండా ఓడించి తీర్పునిచ్చారని చెప్పారు. మోసపోయామని, నష్టపోయామని ప్రజల్లో ఒక నిశ్చిత అభిప్రాయం వస్తే వారి తీసుకునే నిర్ణయాలు కఠినంగా ఉంటాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పాత ముతక పద్ధతులతో ఏమి సాధించలేమని, నూతన విధానాలకు పట్టం కట్టాలని పేర్కొన్నారు. ఏపీని విజ్ఞాన భాండాగారంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అన్ని శాఖల్లో సంస్కరణలు తీసుకువస్తున్నామని పాత చట్టాలను అవసరమైతే రద్దు చేసుకోవడమే కాకుండా కొత్త చట్టాలను అమలులోకి తెస్తున్నామంటూ ఆయా శాఖల లక్ష్యాలకు అనుగుణంగా ఎంత నిధులు అవసరమో అంచనాలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ అభివృద్ధిలో ఎక్కడ లోపం ఉందో స్వీయ విశ్లేషణ చేసుకోవాల్సిందేనని, 15 శాతం వృద్ధి సాధించాలని నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అందుకోవాలని చెప్పారు. జీఎస్‌డీపీ కంట్రిబ్యూషన్‌ను మూడు నెలలకు ఒకసారి విశ్లేషించి లక్ష్యాలను నిర్ణయించుకుంటున్నామని అయినప్పటికి కొన్ని శాఖల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదన్నారు. అలాంటి చోట పనితీరును మెరుగుపరుచుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

నేనొస్తా..అన్నీ ఇస్తా

పాదయాత్రలో జగన్ హామీ



ఒంగోలు, ప్రభన్యూస్ బ్యూరో: తాను అధికారంలోకి రాగానే వెనుకబడిన ప్రకాశం జిల్లా సమస్యలన్నీ పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజాసంకల్పయాత్ర 89వరోజు ప్రకాశం జిల్లాలోకి ప్రవేశించింది. ఉదయం 9 గంటల ప్రాంతంలో నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి పాదయాత్ర ప్రారంభించిన జగన్ 9.20 గంటలకు లింగసముద్రం మండలం రాళ్లపాడు ప్రాజెక్టు వద్దకు చేరుకోగానే జిల్లా నేతలు ఎదురేగి ఘనస్వాగతం పలికారు. కొత్తపేట దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితుల ఆశీర్వాదంతో జగన్ పాదయాత్రను ప్రారంభించారు. జిల్లాలో తొలుత రాళ్లపాడు ప్రాజెక్టును పరిశీలించారు. ఆయకట్టు రైతులు తమ సమస్యలను జగన్‌కు వివరించారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల రాళ్లపాడు ప్రాజెక్టులో నీరు ఎండిపోతుందని, సోమశిల ప్రాజెక్టు పూర్తయితేనే, రాళ్లపాడు ప్రాజెక్టుకు నీళ్లు వస్తాయని రైతాంగం జగన్‌కు చెప్పారు. ఆయకట్టు పరిధిలో కంది, వరి పంటలు పండించే రైతాంగాన్ని జగన్ పలుకరించారు. తాను అధికారంలో వస్తే రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలో రెండు పంటలు పండించేందుకు అవసరమైన నీరు ఇస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేయగానే 1200 కిలోమీటర్లు పూర్తయిన సందర్భంగా రామకృష్ణాపురం వద్ద మొక్కను నాటారు. తరువాత పాదయాత్రను కొనసాగించిన జగన్ పెంట్రాల, వెంకమళ్లవారిపాలెం, లింగసముద్రం, బలిజపాలెం, రామకృష్ణాపురం వరకు పాదయాత్ర కొనసాగించారు.

21న హస్తినకు రండి

ఏపీ ప్రభుత్వానికి ప్రధాని కార్యాలయం పిలుపు

అమరావతి, ఆంధ్రప్రభ : కేంద్ర బడ్జెట్ అనంతర పరిణామల నేపథ్యంలో ఈ నెల 21న అన్ని వివరాలతో ఢిల్లీకి రావల్సిందిగా ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి శుక్రవారం పిలుపు అందినట్టు సమాచారం. విభజన చట్టం హామీలు, బడ్జెట్ కేటాయింపులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ, 2014 నుంచి రాష్ట్రా నికి అందిన నిధులు, ప్రాజెక్టుల సమగ్ర నివేదికలు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, ఇతర వివరాలతో హస్తినకు రావల్సిందిగా రాష్ట్రప్రభుత్వాన్ని కేంద్రం కోరింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 8 కీలక శాఖలకు చెందిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొ ననున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఆర్థిక శాఖ కార్యదర్శి ,ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, జనవనరుల శాఖ, మానవ వనరుల, రవాణా, గనులు, సీఆర్‌డీఏ, పరిశ్రమలు, తదితర శాఖల కార్యదర్శులు హాజరు కానున్నారు. కాగా కేంద్ర వర్తమానం పంపిన నేపథ్యంలో ఈనెల 21,22 తేదీలలో ఢిల్లీలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు పూర్తి వివరాలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కేంద్రంలో బడ్జెడ్ ప్రవేశపెట్టిన అనంతరం రాష్ట్రంలో రాజకీయ వేడిని రగిల్చిన నేపథ్యంలో మోడీ ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది.

ఏపీ ఎంపీలు రాజీనామా చేయాలి

జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే ఏపీ ఎంపీలంతా రాజీనామాలు చేసి కేంద్రంపై వత్తిడి తేవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జ నచైతన్యవేదిక ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి మా ట్లాడుతూ ప్రత్యేక హోదావల్లే ఏపీలో అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతోనే ఆనాడు శ్రీబాగ్ ఒప్పందంలో రాజధాని కర్నూలుకు , హైకోర్టు గుంటూరుకు ఇచ్చారన్నారు. ఇపుడు అమరావతి తప్ప మరెక్కడా అభివృద్ధి కనిపించటం లేదన్నారు. వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రకాశం నెల్లూరు జిల్లాలు బాగు పడాలంటే ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి కట్టుగా హోదాకోసం ఉద్యమించాలని జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి పేర్కొన్నారు. ఏపీ మాజీ చీఫ్ సెక్రటరి ఐవైఆర్ కృష్ణారావు మాట్లాడుతూ విభజనచ చట్టంలో పొందుపరిచిన అంశాలన్నింటినీ అమలు చేస్తేనే ఏపీ మిగిలిన రాష్ట్రాలతో సమానంగా అభివృద్ధి చెందే అవకాశాలుంటాయన్నారు. అమరావతిలో రాజధాని పెట్టినపుడు తప్పనిసరిగా హైకోర్టును కర్నూలులో పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో రాజధాని ఒక చోట ఉంటే హైకోర్టు మరొక చౌట ఉన్నట్టు వివరించారు.

ఏపీకి మోడీ సాయాన్ని గుర్తించాలి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి నరేంద్రమోడీ ప్రభుత్వం చేస్తున్న సాయాన్ని ప్రశంసించకున్నా, కనీసం గుర్తించాలని భారతీయ జనతా పార్టీ విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు అమలవుతున్నాయని ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీ వీఎల్ నరసింహారావు తెలిపారు. శుక్రవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఏపీ బీజేపీ అధ్యక్షుడు హరిబాబుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏపీకి కేంద్రం పెద్ద ఎత్తున సాయం చేస్తున్నప్పటికీ కొన్ని రాజకీయ పార్టీలు, వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. విభజన చట్టంలోని హామీలను పదేళ్ల లోపు అమలు చేయాలని ఉన్నప్పటికీ అప్పటిదాకా వేచి చూడకుండా తాము మూడున్నరేళ్లలోనే చాలా వరకు పూర్తిచేశామని చెప్పారు. 11 విద్యాసంస్థలకు గాను ఇప్పటికే తొమ్మిదింటిని ప్రారంభించామని, గిరిజన, కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించామని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థలకు సంబంధించి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని మాత్రమే చట్టంలో ఉన్నప్పటికీ, ఆ స్ఫూర్తితో వాటిని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు.

భూసేకరణ వేగవంతం చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లను ఆదేశించిన తుమ్మల



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర ,జాతీయ రహదారుల నిర్మాణాలకు గానూ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. కేంద్రం ఇటీవల ప్రకటించిన దాదాపు రూ. 8,000 కోట్ల రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ, అటవీ అనుమతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరారు. శుక్రవారం సచివాలయం నుంచి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. భూసేకరణకై తీసుకువచ్చిన నూతన చట్టాన్ని గూర్చి మంత్రి వివరి ంచారు.

రూ. 547 కోట్లు మంజూరిపై కేంద్రానికి కృతజ్ఞతలు

తీవ్ర వాద ప్రభావిత ప్రాంతాల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 9 జిల్లాలకు రూ. 547 కోట్లు మంజూరు చేసినందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధుల కోసం ముఖ్యమంత్రి కె చంద్రశేఖ రరావు కృషి చేశారని పేర్కొన్నారు.

భర్తను కడతేర్చిన భార్య



తిరుమలగిరి (సాగర్), ప్రభన్యూస్ : ఈనెల 13వ తేదీన తిరుమలగిరి మండలంలోని నాగార్జునపేట తండాకు చెందిన ఉప సర్పంచ్ దీపావత్ ధర్మానాయక్‌ను అర్ధరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మంచంపై బాంబును ఉంచి దారుణంగా హత్య చేసిన సంఘటన కలకలం రేపింది. హత్యకు సంబంధించి మృతుడి తల్లి జ్యాలి చేసిన ఫిర్యాదు మేరకు ధర్మానాయక్ చిన్న భార్య శిరీషను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారణ చేపట్టగా ఈ హత్యకు అదే తండాకు చెందిన ఆంగోతు రవి అనే యువకునితో వివాహేతర సంబంధమే కారణమని మిర్యాలగూడ డీఎస్‌పి శ్రీనివాస్ శుక్రవారం సాగర్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ధర్మానాయక్ మొదటి భార్యకు సంతానం లేకపోవడంతో ఆమె చెల్లి శిరీషనే రెండవ భార్యగా పెళ్ళి చేసుకొని కాపురం చేస్తున్న క్రమంలో అదే తండాకు చెందిన ఆంగోతు రవి అనే యువకునితో చనువుగా ఉంటూ వివాహేతర సంబంధాన్ని ఏర్పర్చుకుంది. ఈ క్రమంలో శిరీష ప్రియుడితో కలిసి గత సంవత్సరం నెలరోజులపాటు ప్రకాశం జిల్లా, కుంట గ్రామానికి వెళ్ళిపోయింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామపెద్దలు పంచాయితీ చేసి వారిరువురిని కలపగా మరల కొంత కాలం నుంచి శిరీష రవితో సన్నిహితంగా ఉండడం గమనించిన ధర్మానాయక్ ఆమెను వారించగా ఎలాగైనా తన భర్తను మట్టుపెట్టాలని తన ప్రియుడితో కలిసి హత్యకు కుట్రపన్నారు. దీనిలో భాగంగా కృష్ణపట్టె ప్రాంతంలో చేపలకు వినియోగించే బాంబుల ద్వారా చంపాలని వారిరువురు నిర్ణయించుకున్నారు. అనంతరం రవి పక్క గ్రామంలోని నాయకుని తండాలో చేపల వేటకు సంబంధించిన బాంబులను మెరావత్ హతీరామ్ అనే వ్యక్తి నుంచి రెండు బాంబులను కొనుగోలు చేసి తీసుకెళ్ళాడు. అనంతరం 11వ తేదీన తన ప్రియురాలికి ఫోన్‌చేసి సాగర్ పైలాన్‌కు వచ్చి బాంబులు తీసుకెళ్ళమని చెప్పగా నేను రాలేనని వివరించి తమకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఆంగోతు రవి చిన్నమ్మ ఆంగోతు కమిలిని రమ్మని పురమాయించాడు. దీంతో ఆమె సాగర్‌కు వచ్చి బాంబులను తీసుకువెళ్ళి శిరీషకు అందించగా ఈనెల 13రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఈ విషయాన్ని రవికి తెలియజేయగా ఇదే సరైన సమయం అని గ్రామంలో చుట్టుపక్కల అందరు నిద్రించిన తర్వాత బాంబులుపెట్టి పేల్చుమని సూచించగా ఆమె రాత్రి 2:30గంటల ప్రాంతంలో గాడనిద్రలో ఉన్న ధర్మానాయక్ వీపు భాగంవద్ద బాంబులు పెట్టి పేల్చడంతో శరీరం చిద్రమై అక్కడికక్కడే మరణించాడు. దీంతో మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిన్నభార్య శిరీషను, ప్రియుడు రవిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా బాంబులను సరఫరా చేసిన, మధ్యవర్తితో నడిపిన కమిలి వ్యవహారంమొత్తం బయటకు రావడంతో పోలీసులు వారందరిని అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ తరలించారు.

మహా కేటుగాళ్లు

- ముఠా నాయకుడు ఎస్ఐ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడి అరెస్టయ్యాడు
- విధుల నుంచి తొలగించిన పోలీసు శాఖ • అయినా మోసాలు వీడని వైనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: అధికవడ్డీ ఆశచూపి రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపా రులు, ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను మోసం చేసిన ముఠా గుట్టును చైత న్యపురి పోలీసులు రట్టు చేశారు. ప్రధాన నిందితుడు శ్రీరామ్ చిన్న గోపాలకృష్ణ (37)(ఎ1), యెర్రంశెట్టి సతీష్ (30)(ఎ4) (హోంగార్డు), పిల్లుట్ల వెంకట్(37) (ఎ6) (ఫోటోగ్రాఫర్), తిప్పని నరసింహారావు(36) (ఎ10)లను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రధాన నిందితుడు శ్రీరామ్ చిన గోపాలకృష్ణతో పాటు మరో 16 మంది అతడి బంధువులు, స్నేహితులు అతడి కమ్యూనిటీకి చెందిన వారు ఈ మోసానికి పాల్పడ్డారు. వీరంతా సూర్యాపేట జిల్లాకు చెందినవారని పోలీసులు తెలిపారు. గోపాలకృష్ణ రూ.3,92,00,000 నగదును వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు. ఈ కేసులో మొత్తం 17 మంది నిందితులలో ప్రధాన నిందితుడు గోపా లకృష్ణ అసిస్టెంట్ నునావత్ అశోక్(ఎ5), మరో క్లోజ్ అసోసియేట్ కీతావత్ వెంక టరమణ(ఎ7)లను ఈ నెల 5న పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ప్రధాన నిందితుడు గోపాలకృష్ణతోసహాఅరెస్టయిన నలుగురి నిందితుల నుంచి రూ.13.60 లక్షల నగదు, ఒక ఐ-20 కారు(ఎ1 నుంచి), ఎ4, ఎ6, ఎ10లలో ఒక్కొక్కరి వద్దనుంచి రూ.10,000 మొత్తంగా రూ.30,000 పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. మొత్తంగా 13.90 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీ సులు వెల్లడించారు. ప్రధాన నిందితుడు శ్రీరామ్ చిన్నగోపాలకృష్ణ 2006లో సివిల్ పోలీస్ కానిస్టేబుల్(నెం.3829)గా సెలక్టయ్యాడు. మల్కాజ్‌గిరి పోలీస్‌స్టేషన్‌లో పనిచేశాడు. 2009లో ఎస్ఐ(సివిల్)గా సెలక్టయ్యాడు. అయితే పరీక్షల్లో మాస్ కాపీయింగ్ చేయడంతో 2012లో సీఐడీ అధికారులు గోపాలకృష్ణను అరెస్టు చేశారు. వెంటనే ఆయన్ని విధుల నుంచి పోలీసు శాఖ తొలగించింది. ఆ తరువాత కూడా గోపాలకృష్ణ మోసాలు కొనసాగిస్తూ వచ్చారు. 2013లో ఫైనాన్స్ బిజినెస్ ప్రారంభించాడు. తన తండ్రి వద్ద నుంచి రూ.5 లక్షలు అప్పుగా తీసుకుని ఓ ఏడాది పాటు ఆ బిజినెస్ రన్ చేశాడు. దాంట్లో నష్టం రావడంతో ఆపేశాడు. తర్వాత తాన్వి క్రియేషన్స్(ఆన్‌లైన్ మీడియా అండ్ అడ్వర్టైజింగ్ బిజినెస్), శివం ఎంటర్‌ప్రైజెస్‌లను కొత్తపేటలో చిన్న గోపాలకృష్ణ అతడి భార్య శివ స్వాతి శ్రీరామ్ పేరుతో 2016లో స్టార్ట్‌చేశారు. అప్పట్నించీ వీరు మోసానికి తెరదీశారు. లిక్కర్ తదితర వ్యాపా రాలు న్నాయని అందులో పెట్టుబడులు పెట్టే డబ్బుకు రెట్టింపు ఇస్తామని నమ్మబలికారు. వీరి మోసంలో చిక్కుకున్న వారిలో రైతుల నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ వరకూ ఉండటం గమనార్హం. ఈ మోసంపై సూర్యాపేట జిల్లాకు చెందిన కీతా వెంకటేశ్వర్లు వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఈ కేసును దర్యాప్తు ప్రారం భించారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు 17 మంది ముఠా సభ్యులలో ప్రధాన నిందితుడితో సహా ఆరుగురిని అరెస్ట్‌చేయగా 11 మంది నిందితులు పరారీలో ఉన్నారని పోలీసులు వెల్లడించారు. వారిని కూడా పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

మత్స్య సంరక్షణకు కమిటీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రిజర్వాయర్లు, నదుల్లో చేపల సంరక్షణను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం మత్స్యశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జీవో విడుదల చేశారు. జిల్లా మత్స్య అధికారి అధ్యక్షతన ఏర్పాటైన ఈ కమిటీలో స్థానిక తహసీల్దారు, పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, మత్స్య అభివృద్ధి అధికారి సభ్యులుగా ఉంటారు.

పోలీసులకు ప్రత్యేక అంబులెన్సు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అత్యవసర సమయంలో పోలీసులకు వారి కుటుంబస భ్యులకు వైద్య సేవలను అందించే నిమిత్తం ఆరోగ్య భద్రత ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్సును ఏర్పాటు చేసినట్టు ఆరోగ్య భద్రత సెక్రటరీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టీఎస్-9పీబీ-2325 నెంబర్‌గల అంబులెన్స్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని ఆయనపేర్కొన్నారు. ఆస్పత్రికి తరలించడంతో పాటు డిశ్చార్జి అయిన తరువాత కూడా ఇంటికి తరలించేందుకు ఈ అంబులెన్సు సేవలను వినియోగించుకోవచ్చన్నారు. వీటితో పాటు పోలీసులు వారి కుటుంబాలకు సంబంధించి మృతదేహాల తరలిం పునకు కూడా దీనిని ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ సేవలు పొందాలనుకునే వారు 9848261868, 9440627335 నెంబర్లలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

బయ్యారం స్టీల్ ప్లాంట్‌కు లైన్‌క్లియర్!?

(మొదటిపేజీ తరువాయి)

స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి తగ్గట్టు నాణ్యమైన ఖనిజం లేకపోవడం సహా పలు ఇతర కారణాలను ఇందులో ప్రస్తావించారు. అయితే రెండు రాష్ట్రాలూ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటూ కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో తాజాగా జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో కడప స్టీల్ ప్లాంట్ భావోద్వేగపూరిత అంశంగా మారింది. ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ సాధ్యపడని పరిస్థితుల్లో స్పాంజ్ ఐరన్ ప్లాంట్ లేదా రీసైకిలింగ్ స్టీల్ ప్లాంట్ వంటి ప్రత్యామ్నాయాలపైనా కేంద్రం దృష్టి పెట్టింది.

మరోవైపు ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి వీలుకాకుండా చేస్తున్న పరిస్థితులు, వాటిని సరిదిద్దే అంశం గురించి కూడా చర్చ జరిగింది. ఈ దశలో తెలంగాణ రాష్ట్రానికి ఆనుకుని ఉన్న చత్తీస్‌ఘడ్ బైలడిల్ల ఇనుప ఖనిజం గనుల్లో నాణ్యమైన ముడి ఖనిజం లభిస్తుంది కాబట్టి, బయ్యారం స్టీల్ ప్లాంటు కోసం ఈ ఖనిజాన్ని కేటాయించి ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. తద్వారా అను కున్న లక్ష్యం నెరవేరుతుందని సూచించింది. దాదాపు ఇదే రీతిలో ఆంధ్రప్రదేశ్ సర్కారు స్పందించింది. దీంతో కేంద్రం మెకాన్ సంస్థతో కూలంకశంగా అధ్యయనం చేయించాలని నిర్ణయించింది. దీంతో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఏమేం చేయాలన్న విషయాలపై మెకాన్ సంస్థ అధ్యయనం చేసింది. ఆ మేరకు కేంద్రానికి ముసాయిదా నివేదికను అందజేసింది. ఈ నివేదికలో సూచించిన అంశాలపై కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలతో చర్చించి, తదుపరి నిర?యం తీసుకోనుంది. ఇంటిగ్రేటెడ్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏయే సదుపాయాలు కల్పించాల్సి ఉంటుందో ఈ నివేదికలో పేర్కొన్నట్టు తెలుస్తోంది. వాటన్నింటినీ కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకొచ్చే పక్షంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లేదా రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్, ఎన్.ఎం.డీ.సీ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యంతో రెండు రాష్ట్రాల్లో స్టీల్ ప్లాంట్లను నెలకొల్పే అవకాశం ఉంది.

బాలికల విద్యాశాతాన్ని పెంచడమే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ కృషిని రాష్ట్రపతికి వివరించిన కడియం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాలో బాలికల విద్యా శాతాన్ని పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వివరించారు. శుక్రవారం న్యూ ఢిల్లీలో రామ్‌నాథ్‌తో మహబూబాబాద్‌ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఈ భేటీలో భాగంగా బాలికల విద్యాభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని రాష్ట్రపతికి తెలియజేశారు. ఈ దిశలోనే ప్రాథమికస్థాయి నుంచి ఉన్నత విద్యనభ్యసించే దిశలో బాలికల డ్రాపవుట్లు పెరు గుతు న్నాయని గుర్తించినట్టు కడియం కోవింద్‌కు చెప్పారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 470 గురుకుల పాఠశాలలను ప్రారంభించామని, దేశంలోనే తొలిసారిగా కేవలం ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం 53 రెసిడెన్షియల్ డిగ్రీ కళాశా లలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేశ వ్యాప్తంగా విద్యాభివృద్ధి, బాలికల విద్యా వ్యాప్తి కోసం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ఈ సందర్భంగా రాష్ట్రపతి అడిగి తెలుసుకున్నారు.

కరీంనగర్ స్మార్ట్ సిటీకి నిధులివ్వండి

● కేంద్రానికి ఎంపీ వినోద్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : తెలంగాణాలోని కరీంనగర్‌లో నిర్మింపతలపెట్టిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బి. వినోద్ కుమార్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఢిల్లీ నిర్మాణ్ భవన్‌లోని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఆ శాఖా మంత్రి హర్‌దీప్ సింగ్ పురితో ఆయన సమావేశమై స్మార్ట్ సిటీకి నిధుల విడుదల అంశంపై చర్చించారు. గతేడాది జూన్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్య నాయుడు కరీంనగర్‌ను స్మార్ట్ సిటీల జాబితాలో చేర్చారని ఆయన గుర్తు చేశారు. ఏడు నెలలుగా కరీంనగర్ మున్సిపాలిటీ, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తోందని వివరించారు. ఇప్పటికే స్పెషల్ పర్పస్ వెకిల్ (ఎస్పీవీ) ని ఏర్పాటు చేసుకున్నామని ఎంపీ అన్నారు. టెండర్ ద్వారా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఏర్పాటు చేసుకున్నామనీ చెప్పారు. ఈ రెండు ప్రక్రియల అనంతరం స్మార్ట్ సిటీ నేషనల్ మిషన్ డైరెక్టర్ సమీర్ శర్మ అధ్యక్షతన హైదరాబాద్‌లో సమావేశం జరిగిందని, కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ విషయంలో అన్ని విధాలుగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.



గవర్నర్‌తో కేసీఆర్ భేటీ

ఢిల్లీ పర్యటన, బడ్జెట్ సమావేశాలపై చర్చ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వారం రోజులపాటు ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం కేసీఆర్ శుక్రవారం సాయంత్రం తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం ఆయన రాజ్‌భవన్‌కు వెళ్ళి గవర్నర్ ఇఎస్ఎల్ నరసిం హన్‌తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఢిల్లీలో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీతో సమావేశమైన సందర్భంలో చర్చించిన అంశాలు, విభజన సమస్యలు, ఆర్థికంగా చేయూత ఇవ్వాలన్న అంశాల గురించి వివరించారు. పునర్ వ్యవస్థీకరణ చట్టం లో తెలంగాణ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, వాటి అమలుపై జైట్లీతో చర్చించిన విష యాలను వెల్లడించారు. అలాగే రాష్ట్ర ప్రయోజనాల పరి రక్షణ విషయంలో రాజీ పడకుండా కేంద్ర ప్రభుత్వంతో జరిపిన సంప్రదింపులపై మీ సహకారం కూడా ఉండాలని సీఎం కేసీఆర్ నరసింహన్‌ను కోరినట్టు సమా చారం. త్వరలో ప్రారంభమయ్యే రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై కూడా చర్చించారు. వివిధ ప్రాధాన్యతా రంగాలకు బడ్జెట్‌లో ఇవ్వనున్న ప్రాధాన్యత, ఇప్పటి వరకు రూపొందించిన ప్రతిపాదనలు, ఇతర రాజకీయ అంశాలు కూడా ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది.

వచ్చే ఏడాదికి హైదరాబాద్‌లో

లక్ష 'డబుల్' ఇళ్లు

● వెంగళరావు నగర్‌లో పర్యటించిన మంత్రులు హరీశ్‌రావు, తలసాని ● పాటిగడ్డలో మన కూరగాయల కేంద్రం ప్రారంభం



బస్తీవాసులతో మాట్లాడుతున్న మంత్రులు హరీష్‌రావు, తలసాని

హైదరాబాద్, ఆంధ్రప్రభ: వచ్చే ఏడాదిలోగా హైదరా బాద్ నగరంలో లక్ష డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మిస్తు న్నట్లు మంత్రి హరీష్‌రావు తెలిపారు. శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి సనత్‌నగర్ నియోజక వర్గంలో తలపెట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లా డుతూ, తెరాస ప్రభుత్వ హయంలో హైదరాబాద్ నగరం విశ్వనగరం వైపు అడుగులు వేస్తోంద న్నారు. మహా నగరంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరగుతు న్నాయని తెలిపారు. పలు బస్తీల్లో జనం సమస్యలను తెలుసు కోవడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిం చారు. వెంగళరావునగర్‌లో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ళు కట్టిస్తామని హామి ఇచ్చారు. అనంతరం శ్యామల కుంట బస్తీలో పర్యటించారు. ఎఫ్‌టీఎల్ సమస్యను పరిశీలించారు. పేదల పక్షాన నిలబడే ముఖ్యమంత్రి కేసీఆర్ అని హరీష్‌రావు ప్రశంసించారు. తమది పేదల ప్రభుత్వ మన్నా రు. నిరుపేదల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టా మని గు చేశారు. వీలైనంత త్వరగా శ్యామల కుంట బస్తీలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ళు కట్టిస్తామని ఆయన హామి ఇచ్చా రు.

కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా మంత్రి తలసాని పనిచేస్తు న్నారని కితాబి చ్చారు. అక్కడి నుంచి పాడిగడ్డకు చేరుకున్న మం త్రులు స్థానిక ప్రజలతో ముచ్చటిం చారు. ఈ సంద ర్భంగా మన కూరగాయలకు చెంది న 50వ అవుట్‌లెట్‌ను మంత్రి హరీష్ రావు ప్రారంభించారు. నగరంలో 100 కూరగాయల స్టాళ్ళ ఏర్పాటే లక్ష్య మన్నారు. రైతులు, వినియోగ దారులకు మేలు చేసేందుకు ఈ కూరగాయల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నా మన్నారు. భవిష్యత్తులో ఆర్గానిక్ కూర గాయలను కూడా అందుబాటులోకి తెస్తామన్నారు.

ఆర్మూర్‌లో అర్ధరాత్రి హైడ్రామా

● ఎర్రజొన్న రైతుల దీక్షను భగ్నంచేసిన పోలీసులు



ఆర్మూర్‌రూరల్, ప్రభ న్యూస్ : ఎర్రజొన్న, పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలనే డిమాండ్‌తో రైతులు ఏర్పాటు చేసిన ఆమరణ నిరాహార దీక్షా శిబిరాలను శుక్రవారం వేకువజామున రెండు వందల మందికి పైగా పోలీసులు మోహరించి ఎత్తివేశారు. అనంతరం దీక్షా శిబిరంలో ఆర్మూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ప్రారంభించిన ఎర్రజొన్న రైతుల ఆమరణ నిరాహార దీక్షలు రాత్రి వరకు కొనసాగాయి. అయితే ప్రభుత్వం ఎర్రజొన్నలను క్వింటాలుకు రూ.2,300 మద్దతు ధర ప్రకటించినా రైతు ఐక్యకార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో 21మంది రైతులు ఆమరణ నిరాహారదీక్షచేయడంతో శుక్రవారం వేకువజామున పోలీసులు పెద్ద సంఖ్యలో దీక్షా శిబిరం వద్దకు తరలివచ్చారు. డీసీపీ రాంరెడ్డి, నిజామాబాద్ ఏసీపీ సుదర్శన్, ఎస్ఐబీ ఏసీపీ రవీందర్, 10మంది సీఐలతో పాటు 30 మంది ఆర్ ఎస్ఐలు, సివిల్ ఎస్ఐలు, భారీగా కానిస్టేబుళ్లు తరలివచ్చారు. ముందస్తుగా ఆర్మూర్‌లో కరెంటు ను తొలగించి చీకటిలో శిబిరం వద్దకు పోలీసులు భారీగా తరలివచ్చారు. దీక్ష చేస్తున్న వారిని చుట్టుముట్టి వ్యాన్‌లలో ఏసీపీ కార్యాలయానికి తరలించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట రైతుల ధర్నా...

దీక్ష చేస్తున్న రైతుల దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ ఆర్మూర్‌లో రైతులు రాస్తారోకో చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడుగడుగునా అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మొదట ఆర్మూర్ ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు, రైతులు రాస్తారోకో చేయడానికి పాదయాత్రగా బయలుదేరారు. అనంతరం వాహనాలలో మామిడిపల్లిలోని మానస స్కూల్ వద్ద గల 44వ జాతీయ రహదారిపై ప్రతినిధులు బైఠాయించారు. పోలీసులు వారిని బలవం తంగా అక్కడి నుంచి తరలించారు.

నేడు, రేపు నిరసనల కొనసాగింపు...

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అంగీకరించేదిలేదని పేర్కొంటు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. శనివారం ఉదయం ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి అంబేద్కర్‌కు వినతిపత్రాన్ని అంద జేస్తామన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన ధరను వ్యతిరేకిస్తున్నాం: రైతు ప్రతినిధులు

మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కవితలు ఎర్రజొన్న క్వింటాలుకు రూ. 2,300లకు కొనుగోలు చేస్తామని ప్రకటించడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని రైతు ఐక్య కార్యచరణ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఎర్ర జొన్నకు మద్దతు ధర



(మొదటిపేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్‌తోపాటు వ్యవసాయ కమిషనర్, మార్కెటింగ్ డైరెక్టర్, మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై సమీక్షించాలని సూచిం చారు. వ్యవసాయ విస్తరణాధికారి, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ స్క్రూటినీ అనంతరమే నిజమైన రైతులనుంచి ఎర్రజొన్నలు కొనుగోలు చేయాలని, ఎర్రజొన్న పండించిన అసలు రైతులకు మాత్రమే ప్రయోజనం కల్గేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎకరాకు 12 క్వింటాళ్లకు మించి ఎర్రజొన్నను మార్కెట్‌కు తీసుకొచ్చేవారిపై విజిలెన్స్ నిఘా పెట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. కొనుగోలు చేసిన సరుకుకు డబ్బులను రైతు అకౌంట్‌లోనే జమచేయాలన్నారు. ఒక్క పైసాకూడా దిర్వినియోగం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎర్రజొన్నల కొనుగోలుతోపాటు వాటిని నిల్వ చేయడం, ఎగుమతి చేయడం, విక్రయించడం తదితర అంశాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కర్నాటక వంటిపొరుగు రాష్ట్రంలో మూడున్నర లక్షల క్వింటాళ్ల ఎర్రజొన్న నిల్వలు ఉన్నట్లు సమాచారం ఉందని, అక్కడి క్వింటాళుకు రూ.1600 ధరే ఉన్నందున రాష్ట్రానికి దిగుమతి కావొచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో కోల్డ్‌స్టోరేజీలలో గతసీజన్ నుంచినిల్వ ఉంచిన సరుకు కూడా పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందన్నారు. వాటిన్నింటినీ అరికట్టా లని ఆయన ఆదేశించారు.

తెలంగాణ వెలుపలినుంచి నిజామాబాద్ జిల్లాలోకి ఎర్రజొన్నలు రాకుండా కట్టడి చేయా లన్నారు. నిజామాబాద్‌తోపాటు, తూప్రాన్, మేడ్చేల్, రామా యంపేట్ వంటి చోట్ల కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉన్న ఎర్రజొన్న వివరాలను సేకరించాలన్నారు. మార్కెట్‌లో ధర పెరిగినప్పుడు అమ్మేందుకుగానూ కొందరు దళారులు కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసి ఉంటారని చెప్పారు. ఎర్రజొన్న క్రయ విక్రయాల్లో అవకతవకలు, అక్రమాలకు పాల్పడే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్కెటింగ్ రంగంలో పరిశోధనా విభాగం ఏర్పాటు చేయాలన్నారు. ఇతర దేశాల్లో, దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మార్కెటింగ్ రంగంలో అమలు చేస్తున్న కార్యక్రమాలు, నూతన ధోరణులపై ఎప్పటికప్పుడు మానిటర్ చేసేందుకు రీసెర్చ్ వింగ్ అవసరమన్నారు.

వచ్చే ఏడాదికి తెలంగాణలో సాగునీటి వసతి అనూహ్యంగా పెరగనున్నందున దిగుబడి కూడా ముందుగా అంచనా వేయాల్సి ఉంటుందన్నారు. అందుకు అనుగుణంగా మార్కెట్ సౌకర్యాలు, స్టోరేజీ వసతి నెలాకొల్పాల్సి ఉంటుందన్నారు. శుక్రవారం జలసౌధలో వివిధ శాఖల అధికారులతో జరిపిన సమీక్షలో వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ జగన్‌మోహన్, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, అపెడా, హార్టికల్చర్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రమంతటా..

పెళ్లికళ

(మొదటిపేజీ తరువాయి)

పెరిగింది. కళ్యాణ మండపాలకు యమా డిమాండ్ ఏర్పడింది. ఒక రోజు అద్దె కనీసంగా రూ.50వేలనుంచి రూ. 1కోటి వరకు పలుకుతోంది. వీటికి అదనంగా విద్యుత్ బిల్లు. క్లీనింగ్ చార్జీలు, లేబర్ చార్జీలు వసూలు చేయనున్నారు. పెళ్లి పందిరి, సౌండ్ సిస్టం, ఫోటోలు, భాజా భజంత్రీలు, ఇతర ఏర్పాట్లకు అదనంగా వెచ్చించాల్సి ఉంటుంది. విందు భోజనాలకు కూడా భారీగా వ్యయం పెరిగిపోయింది. స్వీట్లు, కూరగాయలు, నాన్ వెజ్‌కు కూడా భారీగా ధరలు పెరిగాయి. పెళ్లంటే నోరూరించే తినుబండారాలు ఉండాల్సిందే. మధ్య తరగతి మొదలు ఉన్నత వర్గాలు విందుకు భారీగా ఖర్చు చేయడం రివాజుగా మారింది. అయితే కేటరింగ్‌కు ఇచ్చేవారి సంఖ్య భారీగా పెరగడంతో ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక పురోహితులకు విపరీత డిమాండ్ వచ్చి పడింది. కొందరికి పురోహితులు దొరకడం కష్టంగా మారింది. ఆన్‌లైన్‌లో పురోహితులకు సెర్చ్ చేస్తున్న తీరు చూస్తే ఈ పరిస్థితికి ఉన్న ప్రాధాన్యత కళ్లకు కడుతోంది.

ఫలితాలు ఆలోచించను

(మొదటిపేజీ తరువాయి)



ప్రముఖంగా ప్రస్తావించారు. మన మంతా ఎంతో నిజా యితీగా పరీక్షలకు సిద్ధమవుతాం. కానీ మనలో ఆత్మ విశ్వాసం ఉండదు. దాంతో చదువుకున్నవన్నీ చివరి నిముషంలో మరిచిపోతాం. మనల్ని మనం సవాల్ చేసుకోవడం ద్వారా, కష్టించి పనిచేయడం ద్వారా ఆత్మవిశ్వాసం కలుగు తుంది. మన మెప్పుడూ మనలను మెరుగు పరుచుకోవడం గురించి ఆలోచి స్తుండాలి అని విద్యార్థులకు సూచిం చారు. శ్రద్ధ అనేది చాలా పెద్ద విషయ మని, నేర్చుకుంటేనే అది వస్తుందని ప్రజలు అనుకుంటారు. కానీ అది నిజం కాదు. ప్రతి ఒక్కరూ రోజంతా ఏదో ఒకపనిచేస్తుంటారు. దానికి సంపూర్ణమైన శ్రద్ధ అవసరం అని ప్రధాని తెలిపారు.

తల్లిదండ్రులకు క్లాస్ తీసుకోవాలా?

ప్రతి భారతీయ విద్యార్థి జన్మత: ఒక రాజకీయ నేత అని, కావాలసింది ఎలా సాధించుకోవాలో వారికి బాగా తెలుసునని అన్నారు. పరీక్షలు ఎదుర్కొంటున్న విద్యార్థులు ఫలితాలకు భయపడకుండా నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. పరీక్షల సందర్భంగా పిల్లలపై పెద్దలు ఒత్తిడి గురించి అడిగిన ప్రశ్నకు ప్రధాని నవ్వుతూ.. ఇవాళ మీ తల్లిదండ్రులకు నన్ను పాఠం చెప్పమంటారా? అని అన్నారు. మొదటగా మనం చేయాల్సింది తల్లిదండ్రుల ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకొని వారికి తగిన గౌరవం ఇవ్వాలి. వారు మన కోసం యావజ్జీవతాన్ని వెచ్చిస్తారు అని విద్యార్థులకు హిత బోధ చేశారు. తల్లి దండ్రులు ఉల్లాసంగా ఉన్నప్పుడు వారితో మాట్లా డాలని సూచించారు.

ఓటమిని అంగీకరించవద్దు

నేను రాజకీయాల్లోకి రాకముందు జనసంఘ్ అనే ఒక పార్టీ ఉండేది. దాని చిహ్నం దీపం. అది ఎంతటి పేద పార్టీ అంటే ఆఖరికి గోడల మీద దీపం బొమ్మ వేయడానికి కూడా ఇబ్బందిగా ఉండేది. అలాంటి పార్టీ గుజరాత్‌లో ఎన్నికలప్పుడు 103 మంది అభ్యర్థులను నిలబెడితే వారిలో 99 మంది డిపాజిట్లు కోల్పోయారు అని మోడీ తెలిపారు. మిగిలిన నలుగురు అభ్యర్థుల డిపాజిట్లు తిరిగి వచ్చినప్పుడు పార్టీ కార్యకర్తలు మిఠాయిలు పంచుకొని వేడుక చేసుకున్నారు. ఇలాంటి వైఖరే ఒక వ్యక్తిని అలాంటి స్థితి(ఎన్నికల డిపాజిట్ కోల్పోవడం) నుంచి ఈ స్థితికి(2014 ఎన్నికల్లో బీజేపీ విజయం) తీసుకువచ్చింది. ఓటమిని అంగీకరించవద్దని అటల్‌జీ (మాజీ ప్రధాని) అంటుండేవారు. ప్రజలందరికి ఇలాంటి వైఖరి ఉండాలి అని ప్రధాని పిలుపునిచ్చారు.

మాకు 24 గంటలూ పరీక్షలే

వచ్చే లోక్‌సభ ఎన్నికలకు మీరు ఎలా సిద్ధమవుతున్నారని ఒక విద్యార్థి ప్రధానమంత్రిని ప్రశ్నించారు. ఇందుకు బదులుగా నేనే కనుక మీ టీచర్ అయితే జర్నలిజం దిశగా నీకు మార్గదర్శనం చేసి ఉండేవాడినని మోడీ తెలిపారు. ఎందుకంటే జర్నలిస్టులే ఇలాంటి ప్రశ్నలు అడుగుతారని ఆయన చమత్కరిం చారు.మీకు ఏడాదికి ఒకసారి మాత్రమే పరీక్షలు ఉంటాయి. కానీ 24 గంటలూ పరీక్షలే. దేశంలో ఏదో ఒక మూలన జరిగిన మున్సిపల్ ఎన్నికలో మేం ఓడిపోతే మోడీకి దెబ్బ అంటూ బ్రేకింగ్ న్యూస్ ఇస్తారు అని ప్రధాని వ్యాఖ్యా నించారు. జీవితంలో మడమతిప్పని వైఖరితో రాణించడానికి జనసంఘ్ ఒక మంచి తార్కాణమని తెలిపారు.

మీ స్నేహితుడిని.. నాకూ మార్కులేయండి

నేడు నేను విద్యార్థిని.. మీరు నాకు ఎగ్జామినర్. మీరు నాకు 10కి ఎన్ని మార్కులు ఇస్తారో తర్వాత ఇవ్వండి. నన్ను ప్రధాని కాకుండా మీ స్నేహితుడిగా భావించండి అని మోడీ అన్నారు.

తల్లిదండ్రులూ ప్రతిష్ఠకు పోవద్దు

ప్రతి తల్లీ, తండ్రీ తమ పిల్లల కోసం త్యాగాలు చేస్తుంటారని ప్రధాని అన్నారు. పిల్లల ఘనతలను సామాజిక ప్రతిష్ఠతో ముడిపెట్టవద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి విద్యార్థి తనదైన ప్రతిభాపాటవాలతో జన్మిస్తారని తెలిపారు.

భారత్, ఇరాన్ మధ్య బంధం విరాజిల్లాలి

● ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ప్రపంచ శాంతి కోసం ముస్లిం సమాజం అల్లాను ప్రార్థించాలని ఇరాన్ అధ్యక్షులు డాక్టర్ హసన్ రౌహానీ పిలుపునిచ్చారు. ఇస్లాం హింస, ఉగ్రవాదానికి వ్యతిరేకమని స్పష్టం చేశారు. రెండు రోజుల పర్యటనకు హైదరాబాద్ వచ్చిన ఆయన శుక్రవారం మక్కా మసీదులో ప్రత్యేకంగా జుమ్మా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులను ఉద్దేశించి రౌహానీ మాట్లా డుతూ, ప్రతి శుక్రవారం ముస్లింలు చేసే ప్రార్థనలు ఐక్యతకు నిదర్శనమని అన్నా రు. ముస్లిం సమాజం షియా, సున్నీ వర్గాలుగా విడిపోరాదని , అందరు కూడా ఐక్యంగా ఉండాలని కోరారు. ముస్లింలు ఐక్యంగా ఉంటే ఇజ్రాయేల్ రాజ ధానిగా జెరూసలేంను అమెరికా ప్రకటించేదా ? అని ప్రశ్నించారు. భారత, ఇరాన్ దేశాల మధ్య శతాబ్దాలుగా సాంస్కృతిక, ఆర్థిక ఇతర రంగాలలో స్నేహపూర్వక సంబం ధాలు ఉన్నాయని చెప్పారు. అదే సంప్రదాయాన్ని ఇకపై కూడా కొన సాగించా ల్సిన అవసరం ఉందన్నారు. భారత్ భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శన మని, మతాలు, విశ్వాసాల రిత్యా ప్రజలు వేరైనప్పటికీ స్నేహితులు, సోదరులుగా మెలు గుతారని హసన్ రౌహానీ ప్రశంసించారు. ప్రస్తుత తరుణంలో ప్రపంచానికి శాంతి, ఆధ్యాత్మికత అవసరమని ఆ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ముస్లిం లలో ఉన్న ప్రత్యేక ఏంటంటే... గుణగణాలు ...ప్రవర్తన...మంచి లక్షణాలనీ, వాటి ని ఎప్పటికీ కొనసాగించాలని సూచించారు. తన ప్రసంగం చివ రలో ఇరాన్ జిం దాబాద్...ఇండియా జిందాబాద్ అని నినాదాలు చేసి ముగిం చా రు. ఈ ప్రార్థ నల్లో ఇరాన్ అధ్యక్షులు మొదటి వరుసలో నిలబడి నమాజ్ చేశారు. ఉప ముఖ్య మంత్రి మహ్మాద్ మహమూద్ అలీ, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే పాషా ఖాద్రీ, ఎమ్మెల్సీ మహ్మాద్ సలీం, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖ్రముద్దీన్ తదిత రులు పాల్గొ న్నారు.

భారత్‌కు ఆయిల్, గ్యాస్, ఇంధన సరఫరాలో సహకారం

భారత్‌కు ఆయిల్ , గ్యాస్ , ఇంధన సరఫరాలో తమ సహకారం ఉంటుందని ఇరాన్ ప్రెసిడెంట్ డాక్టర్ హసన్ రౌహానీ హామీ ఇచ్చారు. శుక్రవారం తనను కలిసి ముస్లిం పారిశ్రామిక వేత్తలతో ఆయన మాట్లాడారు. పరిశ్రమలు, వ్యవసాయం, టెక్నాలజీ పరంగా పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. తమ దేశంలోని చబ్బర్ ఓడరేవును భారత్ అభివృద్ధి చేసిందని చెప్పారు.

ఇరాన్ అధ్యక్షునికి ఘనంగా వీడ్కోలు

రెండు రోజుల పర్యటన ముగించుకున్న ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ హసన్ రౌహానీకి బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది.

కుతూబ్‌షాహీ సమాధులను సందర్శించిన ఇరాన్ ప్రెసిడెంట్

హసన్ రౌహానీ శుక్రవారం ఉదయం చారిత్రాత్మక కుతూబ్‌షాహీ టూంబ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇరాన్ వారసత్వం ఉన్న కుతూబ్‌షాహీ వంశ సమాధులను సందర్శించి వాటిని గూర్చి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇరాన్ అధ్యక్షులు హసన్ రౌహానీ మాట్లాడుతూ, భారతీయులు తమ దేశం సందర్శించేందుకు వీలుగా వీసా నిబంధనలు సరళతరం చేస్తామన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీపై కేసీఆర్ కసరత్తు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తన జన్మదినం సందర్భంగా పలు నామినేటెడ్ పదవులను భర్తీచేసి వారి పేర్లను ప్రకటించేందుకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ప్రగతి భవన్‌లో సీఎం నామినేటెడ్ పదవుల భర్తీపై కసరత్తు చేసినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. గత ఏడాది తన జన్మదినం సందర్భంగా పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేసిన కేసీఆర్ శనివారం కూడా ఈ ప్రక్రియను కొనసాగించాలని ప్రతిపాదించారు. వచ్చే నెల 12 నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈలోపే కొన్ని పదవుల భర్తీకి శ్రీకారం చుట్టాలని ఆయన గతంలోనే సంకల్పించారు. శనివారం సాయంత్రం కొన్ని పదవులను భర్తీచేస్తూ అధికార ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెరాస వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈనెల చివరిన మూడు రాజ్యసభ సభ్యుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని భావిస్తున్న నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీ కీలకం కానున్నదని తెలుస్తోంది. యాదవ సామాజికవర్గం నుంచి రాజ్యసభకు ఒకరికి అవకాశం కల్పిస్తానని ఇప్పటికే ప్రకటించిన కేసీఆర్ మిగిలిన రెండు పదవులకు సంబంధించి ఎవరిని ఎంపిక చేస్తారన్న చర్చ పార్టీలో విస్తృతంగా జరుగుతోంది. తెరాస తరఫున ఇప్పటికే కె.కేశవరావు, ధర్మపురి శ్రీనివాస్, కెప్టెన్ లక్ష్మీకాంతరావు రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరిలో ఇరువురు బీసీ సామాజికవర్గం వారు కాగా, లక్ష్మీకాంతరావు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వారు. మూడు రాజ్యసభస్థానాల్లో ఒక పదవి యాదవ సామాజికవర్గానికి ఇస్తే, మరో రెండింట్లో ఒకటి రెడ్డి సామాజికవర్గానికి దక్కే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. మరొక పదవి పార్టీ ప్రధాన కార్యదర్శి, సీఎం కేసీఆర్‌కు అనునిత్యం వెన్నంటే ఉంటే జోగినపల్లి సంతోష్ పేరు ఇప్పటికే ఖరారైందని సమాచారం. మరోవైపు శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి పేరు కూడా రాజ్యసభకు వినిపిస్తోంది. ఏదేమైనా రాజ్యసభ అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీలో చర్చించాకే అంతిమ నిర్ణయం జరుగుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఇంటర్ పరీక్షలను బహిష్కరిస్తున్నాం

● సమస్యలను 10 రోజుల్లో పరిష్కరించాలి ● ప్రభుత్వానికి కేజీ టు పీజీ జేఏసీ అల్టిమేటం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకోవడానికి ప్రైవేటు కాలేజీలు సిద్ధమయ్యాయి. తాము ఎదుర్కొంటున్న సమస్యలను 10 రోజుల్లో పరిష్కరించాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల జేఏసీ డిమాండ్ చేసింది. సమస్యలను పరిష్కరించకుంటే ఫిబ్రవరి 28 నుంచి జరిగబోయే ఇంటర్ పరీక్షలను బహిష్కరిస్తున్నట్టు జేఏసీ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రం వచ్చిన నాటి నుంచి తమ సమస్యలను పరిష్కరిస్తామని చెబుతున్న సర్కార్ ఇప్పటి వరకు పరిష్కరించకపోగా ప్రైవేటు విద్యా సంస్థలను నడుపు తున్నవారిని దోపిడీదారులుగా చిత్రీకరించి తెలంగాణ సమాజంలో పలుచన చెయ్యడాకి ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేజీ టు పీజీ జేఏసీ చైర్మన్ గింజాల రమణారెడ్డి విమర్శించారు. జేఏసీ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జేఏఈ కన్వీనర్లు గౌరీసతీష్, ఎస్ఎన్‌రెడ్డి, నారాయణ గౌడ్ సభ్యులు కందాల పాపిరెడ్డి, నరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో కేజీ టు పీజీ వరకు నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల్లో 56 లక్షల మంది విద్యను అభ్యసిస్తు న్నారని రమణారెడ్డి తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. బోర్డు నిర్ణయాలు కార్పొరేట్ కాలేజీలకు అను కూలంగా ఉంటున్నాయని విమర్శించారు. అధికా రుల తీరు మూలంగా ముఖ్యమంత్రి కె చంద్రశేఖ రరావు తమపై వ్యతిరేక భావంతో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము గత 35 సంవత్సరాలుగా విద్యా రంగంలో ఉన్నామని తెలిపారు.ప్రతి ఏటా ఇంటర్‌కు పెంచాల్సిన 10 శాతం ఫీజులను తెలం గాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడున్నరేళ్లుగా ఎదురు చూసిన తాము విధిలేక, చివరిదశలో, చావలేక నిస్సాయ స్థితిలో ఫిబ్రవరి 28 నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను బహి ష్కరిస్తున్నట్టు స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణకు తమ ప్రైవేటు విద్యా సంస్థల ను ఇవ్వబోమని ఖరాఖండిగా చెప్పారు. తమ సమస్యల్లో పనిచేస్తున్న 5 లక్షల మంది సిబ్బందిని రక్షించు కోవడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నట్టు రమణారెడ్డి చెప్పారు.ఉద్యమ సమయంలో సీఎం కేసీఆర్ తెలంగాణ భవన్‌లో జరిగిన సభలో కార్పొరేట్ విద్యా సంస్థలను తరిమి కొడతామని అన్నారని ప్రైవేటు గుర్తింపుపొందిన స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు కందాల పాపిరెడ్డి గుర్తు చేశారు. సమావేశం అనంతరం జేఏసీ నేతలు ఇంటర్‌బోర్డు కార్యదర్శి డాక్టర్ ఏ అశోక్‌కి సమస్యలు పరిష్కరించకుంటే ఇంటర్ వార్షిక పరీక్షలను బహిష్కరి స్తున్నట్టు లేఖ అందించారు.

ఎన్నికల అఫిడవిట్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు
ఆదాయ వనరులు వెల్లడించాలి
సుప్రీంకోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేసే నేతలు కేవలం తమ ఆదాయ వనరుల వివరాలనే కాదు, జీవితభాగస్వామి, పిల్లలకు సంబంధించిన ఆస్తులు, వనరులను కూడా వెల్లడించాలని సర్వోన్నత న్యాయస్థానం సంచలన తీర్పును వెలువరించింది. ఎంపీలు, ఎమ్మెల్యేల ఆదాయం, ఆస్తుల విషయంలో ఎన్నికలలో పోటీ చేసే సమయంలో సమర్పించే అఫిడవిట్‌లో తమ ఆదాయ మూలాలనే కాకుండా తమ తమ జీవిత భాగస్వాముల ఆదాయ వివరాలు, వాటి మూలాలనూ కూడా సమర్పించాలని తీర్పు ఇచ్చింది. నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థి తనతోపాటు భార్య, పిల్లల ఆస్తుల వివరాలను అందులో పొందుపరచాలని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ ఏకసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు తమ ఆదాయ వివరాలను వెల్లడించేలా చట్టంలో మార్పులు తీసుకురావాలని కోరుతూ లోక్ ప్రహరీ అనే ఎన్జీఓ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం శుక్రవారం ఈ తీర్పును వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం నామినేషన్ దాఖలు సమయంలో పోటీచేసే అభ్యర్థి, జీవిత భాగస్వామితోపాటు వారి సంరక్షణలోని వ్యక్తుల ఆదాయ, ఆస్తుల వివరాలు తెలియజేయాలి. ఆదాయ మార్గాలను మాత్రం వెల్లడించాల్సిన అవసరం లేదు.

అభ్యర్థులు నేరస్థులు కాదని ఎలా నిర్ధారించగలరు?

రాజకీయ పార్టీలు తాము ఎంపికచేసిన అభ్యర్థులు నేరస్థులు కాదని ఎలా నిర్ధారించగలవని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది. అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న లోక్ ప్రహరీ స్వచ్ఛంద సంస్థ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి, వారి కుటుంబ సభ్యుల ఆదాయ వనరులను బహిర్గతం చేయడానికి ప్రజాప్రాతినిధ్య చట్టంలో సవరణలు చేయాలని ఆదేశించింది. పోటీచేసే అభ్యర్థులు తమ జీవితభాగస్వామి, పిల్లల ఆదాయ వనరుల వివరాలను నామినేషన్ సమయంలో వెల్లడిస్తే వ్యవస్థలో పారదర్శకతకు తోడ్పడుతుందని ఎన్నికల కమిషన్ గత జనవరిలో సుప్రీంకోర్టుకు నివేదించింది. .

ఆధార్ నమోదుకు అదనపు వేలు అడ్డు

నాసిక్(మహారాష్ట్ర): గురుదయాళ్ దిల్బగ్‌రాయ్ త్రికా(36), బాలీవుడ్ ప్రముఖ హీరో హృతిక్ రోషన్ వీరిద్దరికి ఒక విషయంలో పోలిక ఉంది. అదేంటంటే ఇద్దరికీ ఒకవేలు అదనంగా ఉండటమే. సామాన్యంగా అందరికీ పదివేళ్లు ఉండటం సహజం. అయితే చాలా అరుదుగా కొంతమందికి పదకొండోవేలు కూడా అదనంగా ఉంటుంది. త్రికా నాసిక్‌లోని గాంధీనగర్‌లో నివాసి. త్రికా చేతికి ఒకవేలు అదనంగా ఉండటంతో ఆధార్ నమోదు విషయంలో పెద్ద చిక్కు వచ్చింది. గత ఎనిమిది నెలలుగా ఆధార్ కార్డు సంపాదించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. త్రికా చేతివేళ్లు ఒకటి అదనంగా ఉండటం వల్ల ఏ కేంద్రంలోనూ అతని చేతి ముద్రలు నమోదు కావటంలేదు. పోనీ ఇతర బయోమెట్రిక్ పద్ధతుల ద్వారా నమోదు చేద్దామన్నా రెండు చేతివేళ్ల ముద్రలు అవసరమే. కాగా తనకు ఎడమచేతికి ఉన్న అదనపు వేలు కారణంగా ఆధార్ నమోదుకు నోచుకోలేకపోతున్నా అని త్రికా ఆవేదన వ్యక్తం చేసేవాడు. అయితే ఇతని సమస్య మీడియా ద్వారా వెల్లడి కావటంతో ప్రభుత్వం స్పందించింది. ఎట్టకేలకు ఆధార్ నమోదు కేంద్రంలో అతని వివరాలు నమోదు చేసుకోవటంతో త్రికా సంతోషం వ్యక్తం చేశాడు. త్వర లోనే తనకు ఆధార్ కార్డు జారీ అవుతుందని ఆశా భావాన్ని వ్యక్తం చేశాడు.

తత్కాల్ టిక్కెట్లకు రీఫండ్!

న్యూఢిల్లీ: తత్కాల్ ప్రయాణికులకు రైల్వేశాఖ శుభవార్త. ఇకపై తత్కాల్ కింద బుక్ చేసుకున్న టిక్కెట్లపై 100శాతం రీఫండ్‌ను అందించనుంది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఈ-టిక్కెట్లతో పాటు కౌంటర్‌లో తీసుకున్న వాటికి కూడా రీఫండ్ వర్తిస్తుంది. 5 సందర్భాల్లో మాత్రమే టిక్కెట్ ధర మొత్తాన్ని ప్రయాణికులకు తిరిగి చెల్లించనుంది. రిజర్వేషన్ చేసుకున్న రైలు రాకుండా మూడు గంటలు... అంతకన్నా ఎక్కువ ఆలస్యమైనప్పుడు సొమ్ము రీ ఫండ్ చేస్తారు. అలాగే రైలును దారి మళ్లించినప్పుడు కూడా వర్తిస్తుంది. రైలును మళ్లించిన తర్వాత ప్రయాణికుల రైలు ఎక్కాల్సిన స్టేషన్ లేదా దిగాల్సిన స్టేషన్... అది కాకుండా రెండూ కొత్త రూట్‌లో లేని పక్షంలో, ప్రయాణికులు ఎక్కాల్సిన కోచ్‌ను రైలుకు అనుసంధానించకపోతే, అధికారులు ప్రయాణికులకు ప్రత్యామ్నాయం కల్పించని సమయంలో. రైలులో రిజర్వేషన్ చేసుకున్నదానికి బదులుగా లోయర్ క్లాస్‌లో ప్రయాణించేందుకు ఇష్టపడకపోతే. అది కూడా ప్రయాణికులు ఇందుకు అంగీకరిస్తే రెండు టిక్కెట్లకు మధ్య ఉన్న తేడాను రైల్వేశాఖ ఆ ప్రయాణికుడికి చెల్లిస్తుంది.

హవాలా కేసులో వ్యాపారవేత్త అరెస్టు

న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు హవాలా కేసులో శుక్రవారం ఒక వ్యాపారవేత్తను అరెస్ట్ చేశారు. హిమాచల్ ప్రదేశ్ మాజీ సీఎం వీరభద్రసింగ్‌పై నమోదైన హవాలా కేసులో ఇతనికీ సంబంధం ఉండటంతో అరెస్టు చేశామని ఈడీ అధికారులు తెలిపారు. తరణి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ వక్కుల్లా చంద్రశేఖర్‌ను గురువారం రాత్రి హవాలా కేసు విషయంలో అరెస్టు చేశామన్నారు. అతడిని ప్రత్యేక కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఈ కేసు విషయంపై అధికారులు మాట్లాడుతూ వ్యాపారవేత్త చంద్రశేఖర్ రూ.5.9 కోట్లును మాజీ సీఎం వీరభద్రసింగ్‌కు ఆయన కుటుంబ సభ్యులకు తన సొంత ఖాతాల ద్వారా సమకూర్చారని తెలిపారు. తమకు లభించిన సమాచారం ఆధారంగా దర్యాప్తు చేస్తే ఈ విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. ఢిల్లీలోని ప్రత్యేక న్యాయస్థానం ఇంతకుముందే వీరభద్రసింగ్, ఆయన భార్య ప్రతిభాసింగ్‌తోపాటు మరో ముగ్గురికి హవాలా కేసు విషయంపై సమన్లు జారీ చేసిన సంగతి విదితమే. గతంలో కేంద్రమంతిగా పనిచేసిన 83ఏళ్ల వీరభద్రసింగ్‌పై ఈడీ రూ.7కోట్ల అక్రమ ఆదాయాన్ని వ్యవసాయాదాయంగా చూపి ఎల్ఐసీ పాలసీల్లో పెట్టుబడి పెట్టారనే ఆరోపణలపై గతంలో ఈడీ కేసు నమోదు చేసింది. ఈడీతోపాటు సీబీఐ కూడా గతంలోనే వీరభద్రసింగ్ పనిచేసిన సమయంలో రూ.10కోట్ల అక్రమాస్తులు పోగుచేశారని ఆరోపిస్తూ కేసు నమోదు చేసింది.

కార్తీ చిదంబరం ఆడిటర్ అరెస్టు

న్యూఢిల్లీ: మాజీ కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం సీఏను ఈడీ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. కార్తీ చిదంబరం చార్టెడ్ అకౌంటెంట్ భాస్కరరామన్‌కు ఐఎన్ఎక్స్ మీడియాకు చెందిన హవాలా కేసుతో సంబంధం ఉండటంతో అతడిని అరెస్టు చేసి ఢిల్లీ కోర్టులో హాజరుపర్చామని అధికారులు తెలిపారు. అనంతరం సీఏ భాస్కర రామన్‌ను విచారణ నిమిత్తం ఐదురోజుల కస్టడీకి తీసుకున్నామన్నారు. ఆయన్ని ప్రత్యేక న్యాయమూర్తి సునిల్ రాణా ముందు హాజరుపర్చామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నితీశ్ రాణా మాట్లాడుతూ భాస్కర రామన్‌కు ఇంతకుముందే చాలాసార్లు సమన్లు జారీ చేసినా ఆయన హాజరుకాలేదన్నారు. దర్యాప్తునకు ఆయన సహకరిం చలేదన్నారు.

కార్తీ సన్నిహితుల ఇంట్లో ఈడీ సోదాలు

ఈడీ అధికారులు కార్తీ చిదంబరం సన్నిహితుల ఇంట్లో శుక్రవారం తాజాగా మరోసారి తనిఖీలు చేపట్టారు. చెన్నైలోని మూడు ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహించామని అధికారులు తెలిపారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ), హవాలా కేసు దర్యాప్తులో భాగంగా సోదాలు చేశామన్నారు. ఈ కేసు విషయంపై గురువారం కార్తి చిదంబరాన్ని ఢిల్లీలో సుమారు పదిగంటల సేపు అధికారులు విచారించామన్నారు.

సీబీఐ వలలో ఐఆర్ఎస్ అధికారి

యవత్‌మల్: మహారాష్ట్రలోని యవత్‌మల్ లో ట్యూషన్‌సెంటర్ యజమాని నుంచి ఐఆర్ ఎస్ అధికారి, జిఎస్‌టి డిప్యూటీ కమిషనర్ ముకుల్ విశ్వాస్ టోల్గేటే లక్షా ఏభై వేల రూపాయిల లంచం తీసుకుంటుండగా సిబిఐ అవినీతి విభాగం అధికారులు పట్టుకున్నారు.ఆ ట్యూషన్ సెంటర్ యజమానికి టోల్గేటే ముందుగా నోటీసులు పంపాడు.ఆ యజమానితన ఆదాయ,వ్యయ స్టేట్ మెంట్లు సమర్పించగా, అవి సంతృప్తికరంగా లేవని టోల్గేటే బెదిరించాడు.నిన్ను నేను కాపాడతాను మూడు లక్షల ఇవ్వమని డిమాండ్ చేశాడు. అయితే,అంత ఇవ్వలేనని ఆ యజమాని లక్షా ఏభై వేలు ఇచ్చేందుకు సిద్ధపడ్డాడు. ఆ తర్వాత సిబీఐ అధికారులకు ఈ విషయాన్ని ఆ యజమాని ఫిర్యాదు చేయగా, సిబిఐ అధికారులు వలవేసి పట్టుకున్నారు.ఆ డిప్యూటీ కమిషనర్‌పై కేసు నమోదు చేశారు.

ఇక ఉపేక్షించం: ఆర్మీ

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలను ఇంక ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని ఇండియన్ ఆర్మీ విస్పష్టంగా తేల్చి చెప్పింది. ఎల్ఓసీ వెంబడి పాక్ కాల్పులకు దీటుగా స్పందించాలనీ, ఎంతమాత్రం ఉపేక్షించకుండా స్వేచ్ఛగా పాక్ చర్యలను సమర్ధంగా తిప్పికొట్టాలని సైన్యం సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్న జవాన్లకు మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. ఇక పాక్ కవ్వింపు చర్యలను అడ్డుకునే విషయంలో దూకుడు పెంచాలని జవాన్లకు స్పష్టం చేసింది.

కావే‘ధీ’



తమిళనాడుకు తక్కువ నీరు

- బెంగళూరు అవసరాలకు 4.2 టీఎంసీలు
- 15 ఏళ్లపాటు ఇలా కొనసాగాలి
- తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు
- కర్ణాటకలో సంబరాలు... తమిళనాడులో ఆందోళనలు
- ముందస్తుగా రెండు రాష్ట్రాల్లో పోలీసుల మోహరింపు



కర్ణాటకలోని బిలిగుండ్లు డ్యాం (ఫైల్ ఫొటో)

న్యూఢిల్లీ : కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కావేరి కుంపటి రగులుకుంది. కావేరీ నదీ జలాల పంపిణీపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా శుక్రవారం తీర్పు వెలువరించారు. దీంతో ఇరు రాష్ట్రాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీటి పంపిణీలో కర్నాటకు ఊరటనిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో తమిళనాడుకు గట్టి ఎదురు దెబ్బ తగిలినట్టయింది. తమిళనాడుకు విడుదల చేయాల్సిన నీటిలో కోత విధిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించడంతో నిరసనలు మిన్నంటాయి. తమిళనాడుకు 177. 25 టీఎంసీల నీటిని బిలిగుండ్లు డ్యాం నుండి విడుదల చేయాలని కర్నాటక ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో కర్నాటకకు అదనంగా 14.75 టీఎంసీల నీరు మిగులు జలాలు ఉంటాయి.

ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాతో పాటు జస్టిస్ అమితవ్ రాయ్, జస్టిస్ ఎఎం ఖన్విల్కర్ కలిసి కీలక తీర్పు వెలువరించారు. కావేరీ జలాలపై కర్నాటక, తమిళనాడుకు ఎలాంటి హక్కు లేదని వివరించారు. ట్రిబ్యునల్‌ను కాదని ఏ రాష్ట్రం కూడా సొంత నిర్ణయాలు తీసుకోడానికి వీల్లేదని సూచించింది, బెంగళూరులో ఐటీ కంపెనీలు అధికంగా ఉండటం, ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో కర్నాటక వాటాను పెంచడం జరిగిందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బెంగళూరులో జనాభా, నీటి వనరుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. తాగునీటిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా బెంగళూరు నగరానికి 4.2టీఎంసీలు కేటాయించింది. దీంతో పాటు కావేరి బేసిన్‌లో ఉన్న 20 టీఎంసీల భూగర్భ జలాల నుండి 10 టీఎంసీల భూగర్భ జలాలను తమిళనాడు ప్రభుత్వం తీసుకోవచ్చని కూడా సూచించింది. ఈ తీర్పు 15 ఏళ్ల వరకు అమల్లో ఉంటుందని సుప్రీం స్పష్టం చేసింది. కావేరి జలాలపై గత కొన్ని దశాబ్దాలుగా రగడ కొనసాగుతూనే ఉంది. దీంతో కేంద్రం కల్పించుకుని కావేరి జల వివాద పరిష్కార ట్రిబ్యునల్ (సీడబ్ల్యుడీటీ)ని ఫిబ్రవరి 5, 2007లో ఏర్పాటు చేసింది. ట్రిబ్యునల్‌లోని సభ్యులు అందరూ అత్యున్నత స్థాయి సమావేశం, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించిన అనంతరం ఫిబ్రవరి 19, 2013లో ట్రిబ్యునల్ కీలక తీర్పు వెలువరించింది.

కావేరి జలాలను 740 టీఎంసీలుగా కమిటీ లెక్కించి, తమిళనాడుకు 419 టీఎంసీలు, కర్నాటకకు 270 టీఎంసీలు, కేరళకు 30 టీఎంసీలు, పుదుచ్చేరికి 7 టీఎంసీలు కేటాయించింది. అదనంగా 10 వేల మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని పర్యావరణ రక్షణ కోసం వినియోగించాలని వివరించారు. 4 టీఎంసీలు సముద్రంలోకి వృథాగా వెళ్లిపోతాయని ట్రిబ్యునల్ నిర్ధారించింది.

నీళ్ల కేటాయింపులో ఉన్నత స్థాయి న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 30 టీఎంసీలు, 7 టీఎంసీలు కేరళ, పుదుచ్చేరి అంగీకారం తెలిపాయి. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ తమిళనాడు, కర్నాటక, కేరళ ప్రభుత్వాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. దీంతో కొన్ని దశాబ్దాలుగా న్యాయస్థానం విచారణ చేపడుతూ వచ్చింది. 2007 ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం.. తమిళనాడుకు ఇప్పటికే 227 టీఎంసీల నీటిని విడుదల చేయగా, ఇంకా 192 టీఎంసీల నీటిని విడుదల చేయాల్సి ఉంది. మిగిలిన 192 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కర్నాటకను ఆదేశించింది. ఈ తీర్పు నచ్చని కర్నాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో తమిళనాడుకు రావాల్సిన వాటాను తగ్గిస్తూ.. కర్నాటకకు అనుకూలంగా తీర్పు వెలువరించింది.


కర్నాటక, తమిళనాడులో భద్రత కట్టుదిట్టం

కావేరీ జలాల పంపకం విషయంలో సుప్రీం కోర్టు శుక్రవారం తీర్పు ఇస్తున్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బెంగళూరులో భారీ స్థాయిలో కేంద్ర బలగాలను మోహరించారు. తమిళనాడు-కర్నాటక మధ్య బస్సులను తాత్కాలికంగా నిలిపివేశారు. కర్నాటకలో మాత్రం సంబురాలు నిర్వహించుకోగా తమిళనాడులో మాత్రం నిరసనలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వ చేతగానితనం కారణంగానే అన్యాయం జరిగిందని తమిళనాడులో విపక్షాలు ధర్నాకు దిగాయి. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించి పోయింది. ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి డీజీపీతో సమీక్ష నిర్వహించారు.



సంయమనం పాటించాలి

కావేరీ జలాల సుప్రీం తీర్పు నేపథ్యంలో ఇరు రాష్ట్రాలు సంయమనం పాటించాలి. తమిళనాడుకు మాత్రం అన్యాయమే జరిగిందని చెప్పాలి. సుప్రీం తీర్పు ఎంతో బాధించింది. కానీ అందుకు అనుగుణం గానే ముందుకు వెళ్లాలి. ఇరు రాష్ట్రాల మధ్య కావేరీ జలాల విషయమై యుద్ధ వాతావరణం నెలకొంది. తీర్పుపై ఎవరూ రాజకీయాలు చేయవద్దు. తమిళనాడుకు రావాల్సిన వాటాను విడుదల చేయాలి.



తమిళనాడుకు అన్యాయం

కావేరీ జలాల కేటాయింపుల్లో తమిళనాడుకు అన్యాయం జరిగింది. మళ్లీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తమిళనాడుకు రైతులకు అన్యాయం జరుగుతుంది. కొన్ని దశాబ్దాలుగా ఇది కొనసాగుతోంది. తమిళనాడుకు మాత్రం చివరికి న్యాయం దొరకలేదు. తీర్పుపై సుప్రీంకోర్టు పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నా. ప్రజలు సంయమనంతో ఉండాలి.

జన్‌ధన్ ఖాతాల్లో 50 శాతం మహిళలవే!

న్యూఢిల్లీ: జన్‌ధన్ యోజన పథకం ఖాతాల్లో యాభైశాతానికి పైగా మహిళలవే. మైక్రో సేవ్ అనే సంస్థ సైతం ఏజెంట్ నెట్‌వర్క్ నివేదికలో ఈ విషయం వెలుగుచూసింది. అందులో 2015 నుంచి 2017 మధ్య జన్ ధన్ ఖాతాల్లో నగదు లావాదేవీలు 200 శాతం పెరిగినట్లు వెల్లడైంది. ప్రస్తుతం జన్ ధన్ ఖాతాల్లో సగానికి పైగా ఖాతాలు మహిళలే నిర్వహిస్తున్నారని అని పేర్కొంది. ఎక్కువ మంది పేద ప్రజలు బ్యాంకింగ్ కార్యకలాపాలు జరిపేలా మోడీ ప్రభుత్వం చేపట్టిన జన్‌ధన్ యోజన పథకం ప్రోత్సహిస్తున్నది. తద్వారా వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి ఎటువంటి లీకేజీలు లేకుండా నేరుగా ఖాతాల్లోకి చేరుతుంది. ఇంకా వారంతా అవసరమైనప్పుడు అప్పులు తీసుకునే వీలును కల్పిస్తుంది.

ప్రస్తుతం ఆధార్ సంఖ్యను, బ్యాంకు ఖాతాలతో అనుసంధానించడంతో బ్యాంకు కరెస్పాండెంట్లు లేదా ఏజెంట్లు ఆర్థిక ఉత్పత్తులను ప్రజలకు విస్తృతంగా పరిచయం చేస్తున్నారు. ముఖ్యంగా ఎక్కువ మంది ప్రజలకు సూక్ష్మ బీమా అందుబాటులోకి వచ్చింది. ముఖ్యంగా పొదుపు ఖాతా ఉన్నవారికి రోజుకు రూ.1 కన్నా తక్కువ ప్రీమియంతో ప్రారంభించిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకానికి బాగానే స్పందన వచ్చింది. ఏప్రిల్ 24, 2017 నాటికి 3.11 కోట్ల మంది ఈ పథకంలో లబ్ధిదారులుగా చేరారు.



పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం

- ప్రపంచ సుస్థిర అభివృద్ధి సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ



న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణకు భారత్ కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. నరేంద్ర మోడీ శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన ప్రపంచ సుస్థిర అభివృద్ధి శిఖరాగ్ర సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రపంచం మార్పు తీసుకురావడానికి కట్టుబడి ఉండటంతో మేమూ అదే పని చేస్తున్నాము. ప్రపంచం అసౌకర్యవంతమైన వాస్తవం గురించి చర్చిస్తుండగా మేం దానిని సౌకర్యవంతమైన చర్యగా మార్చాము. భారత్ వృద్ధిని విశ్వసిస్తుంది. కానీ అదే సమయంలో పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంది అని అన్నారు. ఐక్య రాజ్య సమితి సుస్థిర అభివృద్ధి కోసం నిర్దేశించిన లక్ష్యాలు మనలను సమానత్వం, సమధర్మం, పర్యావరణ న్యాయం పథంలో ఉంచాయి అని తెలిపారు.

మనకు అవసరమైన ప్రతి ఒక్కటి మేం చేస్తున్నాము. అలాగే ఉమ్మడి కట్టుబాటు ప్రాతిపదికగా వారి కట్టుబాట్లను నెరవేర్చడంలో ఇతరులు కూడా చేరాలని మేం ఆశిస్తున్నాము. కానీ అవకలిత బాధ్యత, సమర్థంతో నెరవేర్చాలి అని ప్రధాని అన్నారు. యుఎన్ఈపీ గ్యాప్ నివేదిక ప్రకారం 2020నాటికి 2005 స్థాయిలకు పైగా తన జీడీపీలో 20 నుంచి 25 శాతానికి ఉద్గారాల తీవ్రతను తగిస్తామంటూ భారత్ చేసిన కొపెన్‌హగెన్ ప్రతినను చేరుకునే బాటలో దేశం ఉంది అని మోడీ తెలిపారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ మాటలను ప్రధాని ఉటంకించారు. అన్ని వనరులు, సంపద ప్రకృతికి చెందినవి, పరమాత్మ, మనము ఈ సంపదకు కేవలం ధర్మకర్తలు లేదా మేనేజర్లు మాత్రమే అని తెలిపారు. నీటి లభ్యత అంశాన్ని సైతం మోడీ ప్రస్తావించారు. ఏ పంట ఎండిపోకుండా చూస్తామని అన్నారు. దేశంలో ప్రతి ఇంటికి విద్యుత్ అందించడానికి పనిచేస్తున్నాము. పెరుగుతున్న పట్టణీకరణతో పాటు రవాణా అవసరాలు సైతం పెరిగిపోతున్నాయి. మెట్రో వ్యవస్థను విస్తరిస్తున్నామని ప్రధాని తెలిపారు.

సీడబ్ల్యూసీ స్థానంలో స్టీరింగ్ కమిటీ

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఆంధ్రప్రభ : కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్థానంలో కొత్తగా స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. శుక్రవారం ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ ద్వివేది ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ రాజ్యాంగంలోని 15వ ఆర్టికల్‌ను అనుసరించి రానున్న ప్లీనరీ సమావేశం కోసం స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ణయించారు. రాహుల్, సోనియా, మన్మోహన్‌సింగ్, ఆంటోని, ఆజాద్, దిగ్విజయ్‌సింగ్, చిదంబరం సహా మొత్తం 34 మందితో కమిటీని ఏర్పాటు చేశారు. సీడబ్ల్యూసీలో 21 మంది ఉండగా కొత్తగా ఇందులో 13మందికి అవకాశం కల్పించారు.

నేడు స్టీరింగ్ కమిటీ సమావేశం

కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఎన్నిక తర్వాత ఆమోదం కోసం ప్లీనరి సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్లీనరీ సమావేశం తేదీలు ఖరారు చేసేందుకు స్టీరింగ్ కమిటీ సమావేశాన్ని శనివారం సాయంత్రం నిర్వహించనున్నారు.

తెలుగువారికి దక్కని అవకాశం

ఏఐసీసీ ప్లీనరి సమావేశాల కోసం ఏర్పాటు చేసిన



స్టీరింగ్ కమిటిలో తెలుగు రాష్ట్రాల కాంగ్రెస్ సీనియర్ నేతలకు చోటు దక్కలేదు. పార్టీ ప్లీనరీ సమావేశాలతో సీడబ్యూసీ సభ్యుల నియామకంపై ఈ స్టీరింగ్ కమిటి నిర్ణయం తీసుకుంటుంది. ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత సీడబ్ల్యూసీని రద్దు చేస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకున్నారు. అయితే సీడబ్ల్యూసీలో 21 మంది సీనియర్ నేతలు ఉన్న విషయం తెలిసిందే. ఈ 21 మందితో పాటు మరో 13 మందిని కలిపి 34 మందితో స్టీరింగ్ కమిటిని ఏర్పాటు చేశారు. అయితే ఈ 34 మందిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏ ఒక్కరికి కూడా స్థానం దక్కకపోవడంతో కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తితో ఉన్నారు.

ఇదిలా ఉంటే సీడబ్ల్యూసీలో తెలంగాణ నుంచి కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి అవకాశం దక్కుతుందని ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా ఏఐసీసీలో కూడా తెలంగాణాతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి పలువురు సీనియర్లకు అవకాశం దక్కుతుందని పార్టీ శ్రేణులు చెబుతున్న విషయం తెలిసిందే. ఏఐసీసీ అధికార ప్రతినిధిగా రాష్ట్రం నుంచి సీనియర్ నేత మధుయాష్కీగౌడ్, ఏఐసీసీ కార్యదర్శులుగా చిన్నారెడ్డి, వి. హనుమంతరావు ఉన్నారు. కొత్తగా నియమించే ఏఐసీసీలో కీలక పదవుల కోసం తెలంగాణ నేతలు తమ ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య పేరు వినిపిస్తున్నది. ఎస్సీ సామాజిక వర్గం నుంచి సర్వే సత్యనారాయణ, దామోదర రాజనరసింహలో ఒకరికి అవకాశం ఉంటుందని ప్రచారం. వీరితో పాటు జానారెడ్డి, రేణుకాచౌదరి కూడా ఏఐసీసీలో చోటుకు ప్రయత్నిస్తున్నట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే పల్లంరాజు, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డితో పాటు చిరంజీవి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

ఐదుగురు సైనికులను మట్టుపెట్టాం: పాక్

ఇస్లామాబాద్: పాక్ సైన్యం భారత సైనిక శిబిరంపై దాడిచేసి ఐదుగురు సైనికులను మట్టుబెట్టిందని పాకిస్థాన్ ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. పాకిస్థాన్ సైన్య అధికార ప్రతినిధి, మేజర్ జనరల్ ఆసిఫ్ గఫార్ భారత సైనిక శిబిరాన్ని ధ్వంసం చేశామనే విషయాన్ని ట్విటర్ ద్వారా వెల్లడిస్తూ దీనికి సంబంధించిన దృశ్యాలు ఉన్న వీడియోను కూడా షేర్ చేశారు. భారత సైనిక శిబిరం అంతర్జాతీయ సరిహద్దు రేఖ వెంబడి టాట్టా సెక్టార్‌లో ఉన్న అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తోందన్నారు. ఈ సైనిక శిబిరాన్ని పాక్ ఆర్మీ ధ్వంసం చేసిందన్నారు. ఈ ఘటనలో ఐదుగురు భారత సైనికులు మృతి చెందగా, చాలామంది భారత జవాన్లు గాయపడ్డారన్నారు. భారతీయ ఉగ్రవాదులు అమాయక పౌరులపై దాడిచేస్తే దానికి బదులు తీర్చుకుంటామని గఫార్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా పాకిస్థాన్ సైనికాధికారులు చేసిన ఆరోపణలు నిరాధారమని భారత సైనికాధికారులు వెల్లడించారు.

ఆగంతకుడి కాల్పుల్లో 40 మంది మృతి

లాగోస్: నైజీరియా నార్త్ వెస్ట్రన్ జంఫారా స్టేట్‌లో జరిగిన దుండగుల కాల్పుల్లో 18మంది మృతి చెందారని పోలీస్ అధికారి ముహమ్మద్ షీహు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆయుధాలతో ఉన్న గ్యాంగ్ ఒకటి బిరాని గ్రామవాసులపై దాడికి దిగిందన్నారు. బందిపోట్లు ఆవులను దొంగిలించి తరలించుకుపోతుండగా అడ్డుకోవటంతో ఈ ఘటన జరిగిందన్నారు. కాగా స్థానిక మీడియా మృతుల సంఖ్య భారీగానే ఉందని పేర్కొంది. ఈ సంఘటనలో చనిపోయినవారు 18మంది కాదని సుమారు 40మంది వరకు మరణించి ఉండవచ్చని తెలిపింది. నైజీరియాలో పశువులను దొంగలించేందుకు ఈ తరహాలో గ్రామాలపై దాడి చేయటం పరిపాటిగా మారింది. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కథనం ప్రకారం ఈ ఏడాది తొలిభాగంలోనే వేలమంది ఈ దాడులకు భయపడి ఇతర గ్రామాలకు తరలిపోగా, సుమారు 168మంది మరణించారని తెలిపింది.

రేపిస్టు విడుదలకు
త్రివర్ణ పతాకంతో నిరసన

శ్రీనగర్ : ఓ రేపిస్టును విడుదల చేయాలని కొందరు రోడ్లపైకి వచ్చి భారతీయ జెండాను చేతపట్టుకుని నిరసన తెలపడంపై జమ్మూ-కాశ్మీర్ సీఎం మహబూబ ముఫ్తీ ఆందోళన వ్యక్తం చేశారు. హిందు ఎక్తా మంచ్ ర్యాలీ తీయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. జనవరిలో 8 ఏళ్ల బాలికపై కతువాలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ దీపక్ ఖజురియా అత్యాచారం చేశాడు. అనంతరం చిన్నారి హతమార్చాడు. ఇతన్ని గత వారం పోలీసులు అరెస్టు చేశారు. ఓ రేపిస్టు విడుదల కోరుతూ భారతీయ జెండాను పట్టుకుని ర్యాలీ నిర్వహించడం బాధాకరమని ముఫ్తీ ట్విట్టర్ వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు.

బాలికపై అత్యాచారం

జమ్మూ : 45 ఏళ్ల మృగాడు బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఘటన రియాసీ జిల్లాలో శుక్రవారం వెలుగులోకొచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రియాసీ జిల్లాలో ఫిబ్రవరి 14న బాలిక కుటుంబం పెళ్లి పనుల్లో హడావుడిగా ఉన్నారు. ఆ సమయంలో 45 ఏళ్ల వ్యక్తి కన్ను బాలికపై పడింది. ఆమెను బుజ్జగిస్తూ.. పెళ్లి మండపం నుండి పక్కనే ఉన్న పాడుబడ్డ షెడ్డులోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం ఎవరికైనా చెబితే చంపేస్తా అని బెదిరించాడు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

డ్రీమర్లకు తప్పని నిరీక్షణ

- వీగిన ఇమ్మిగ్రేషన్ చట్ట సవరణ బిల్లు



వాషింగ్టన్ : అమెరికా వలస విధానంలో మార్పులపై ప్రవేశపెట్టిన బిల్లు ఎగువ సభ తిరస్కరించడంతో డ్రీమర్లకు నిరాశే ఎదురైంది. దీంతో అమెరికాలో నివాసం ఉంటున్న భారతీయుల ఆశలు అడియాశలయ్యాయి. సెనేటర్లు ట్రంప్ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చినా రిపబ్లికన్ ప్రణాళికలకు తగినన్ని ఓట్లు రాకపోవడంతో బిల్లు తిరస్కరించబడింది. లాటరీ తరహాలో వీసా ఇచ్చే విధానాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. 1.8 మిలియన్ ప్రజలు అమెరికాలో సరైన పత్రాలు లేకుండా నివాసం ఉంటున్నారు. బిల్లు పాస్ కావాలంటే కనీసం 60 ఓట్లు రావాల్సి ఉండగా, కేవలం 54-45 ఓట్లు మాత్రం వచ్చాయి. దీంతో డ్రీమర్లకు నిరాశ తప్పలేదు. డ్రీమర్లకు ఆదుకునే ఉద్దేశంతో ఒబామా హయాం నాటి డాకా కార్యక్రమాన్ని గతేడాది సెప్టెంబర్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రద్దు చేసిన విషయం తెలిసిందే. సమస్యను పరిష్కరించేందుకు కాంగ్రెస్‌కు ఆరునెలల గడువు ఇచ్చారు. డ్రీమర్లకు అమెరికా పౌరసత్వం అందించేందుకు సానుకూలంగానే ఉన్నా సరిపడా ఓట్లు రాకపోవడంతో బిల్లు వీగిపోయింది. మార్చి 5 డెడ్‌లైన్ ఉండటంతో డ్రీమర్లలో ఒకింత ఆందోళన ప్రారంభమైంది. వీసా జారీలో లాటరీ విధానం రద్దు, గ్రీన్ కార్డుల సంఖ్య పరిధి ఎత్తివేత వంటి బిల్లును ఎగువ సభ తిరస్కరించింది.



మాజీ ఎన్నికల ప్రధానాధికారి టీఎన్ శేషన్‌తో కమల్‌హాసన్ భేటీ

క్రీడాప్రభ

టీ20లో ఆస్ట్రేలియా రికార్డ్ బ్రేక్

- లక్ష్య ఛేదనలో భారత్‌ను అధిగమించిన ఆసీస్
- న్యూజిలాండ్‌పై ఆసీస్ 5వికెట్ల తేడాతో గెలుపు
- శివమెత్తిన ఆసీస్ బ్యాట్స్‌మన్లు.. పోర్లు సిక్సర్ల మోత



ఆక్లాండ్: బ్యాటింగ్ బద్దలు.. బంతి పగిలిపోయింది.. ఒకరికి మించి ఒకరు.. బ్యాటింగ్ బీభత్సం అంటే ఇదే. స్టేడియంలోని ప్రేక్షకుల కళ్లన్నీ ఆకాశం వైపే ఉన్నాయి. బంతి వేయడమే తరువాయి అది ఫోర్ లేదా సిక్స్‌గా మారింది. పరుగుల వరద పారింది. అందరి చూపు ఆకాశం వైపే.. బంతి ఫోర్ వెళుతుందా.. సిక్స్ పడుతుందా అని ఉత్కంఠతో సాగింది. మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో రెండు జట్లు కలిసి చేసిన స్కోర్లు 487 పరుగులు. ఈ టీ20 మ్యాచ్ రికార్డ్‌లన్నీ తిరగరాసింది. న్యూజిలాండ్- ఆస్ట్రేలియా మ్యాచ్ క్రికెట్ చరిత్రలో సరికొత్త చరిత్రను లిఖించింది.ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ గ్రౌండ్‌లో శుక్రవారం న్యూజిలాండ్- ఆస్ట్రేలియా మధ్య ఐదో టీ-20 మ్యాచ్ జరిగింది. మొదట న్యూజిలాండ్ బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 243 పరుగులు చేసింది. న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ మార్టిన్ గుప్తిల్ 54 బంతుల్లోనే 105 పరుగులు చేశాడు. ఇందులో 6 ఫోర్లు, 9 సిక్స్‌లు ఉన్నాయి. కొలిన్ 33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 76 పరుగులు చేశాడు. వీళ్లద్దరి భాగస్వామ్యం 181 పరుగులు. చివరికి న్యూజిలాండ్ 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఇంత భారీ స్కోరు చేసిన న్యూజిలాండ్‌కు విజయం ఖాయం అని అందరూ అనుకున్నారు. బ్రేక్ తర్వాత ఆస్ట్రేలియా లక్ష్య ఛేదనకు దిగినప్పుడు అసలు ఆట అప్పుడు మొదలైంది. డేవిడ్ వార్నర్.. 24 బంతుల్లో 59 రన్స్ చేశాడు. ఇందులో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు. వార్నర్‌ను న్యూజిలాండ్ బౌలర్ సోదీ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత షార్ట్ 44 బంతుల్లో 76 పరుగులు చేసి ఔటయ్యాడు. షార్ట్ 8 ఫోర్లు, 3 సిక్స్‌లు బాదాడు. మ్యాక్స్ వెల్ 3 ఫోర్లు, 2 సిక్స్‌ల సహాయంతో 14 బంతుల్లో 31 పరుగులు చేశాడు. ఆ తర్వాత వచ్చిన ఫిన్చ్ 14 బంతుల్లో 36 పరుగులు చేసి నాటౌట్‌గా మిగిలాడు ఇందులో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు ఉన్నాయి. స్టొయినిస్ 4 పరుగులు చేసి రనౌట్ కాగా, కేరీ ఒక పరుగుతో నాటౌట్ ఉన్నాడు. ఆస్ట్రేలియా 244 లక్ష్యాన్ని ఇంకా ఏడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించి ప్రపంచ రికార్డ్ సృష్టించింది. 2016లో వెస్టిండీస్‌తో ఆడిన టీ20లో విండీస్ ఇచ్చిన 245 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో భారత్ 244 పరుగులు చేసింది. ఇదే ఇప్పటివరకు రికార్డు. విండీస్ ఆ మ్యాచ్‌లో ఒక పరుగు తేడాతో గెలిచింది. తాజాగా ఆసీస్ 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి కొత్త రికార్డును తనపేరిట ఆస్ట్రేలియా రాసుకుంది.

పారా సైక్లిస్టు బృందానికి క్రీడాశాఖ మంత్రి రాథోడ్ అభినందనలు



న్యూఢిల్లీ: మయన్మార్‌లోని నెప్యిదాలో జరిగిన ఆసియా పారా సైక్లింగ్ ఛాంపియన్ షిప్ క్రీడల్లో భారత పారా- సైక్లిస్టు బృందం ఒక రజతం, రెండు కాంస్య పతకాలను గెలుచు కున్నందుకు కేంద్ర క్రీడల శాఖ మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం మంత్రి ఒక ప్రకటనను సోషల్ మీడియాలో విడుదల చేశాడు. 'ఆసియా పారా సైక్లింగ్ ఛాంపియన్‌షిప్ క్రీడల్లో పారా అథ్లెట్లు భారత జెండాను రెపరెపలాడించడం దేశానికి గర్వకారణం. అథ్లెట్లందరికి నా శుభాకాంక్షలు. వారు భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలి' అని ట్వీట్ చేశారు. దివిజ్ షా రజత పతకంను గెలువగా, బీఎస్ఎఫ్ జవాను హరీందర్ సింగ్, మధు బాగ్రి కాంస్య పతకంను గెలుచుకున్నారు. పారా సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సీఎఫ్ఐ) తరపున టీం మేనేజర్‌గా వ్యవహరించిన కె దత్తాత్రేయ కూడా పతకాలు సాధించిన పారాసైక్లింగ్ బృందానికి అభినందనలు తెలిపారు. వికలాంగులైనప్పటికి వారు ధైర్యంతో పోటీలో పాల్గొని పతకాలు గెలవడం దేశానికి గర్వకారణమన్నారు.

మిథాలి, మంధానల మెరుపులు

- రెండో టీ20లో సఫారీలపై 9వికెట్ల తేడాతో విజయం
- ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ మిథాలిరాజ్

ఈస్ట్ లండన్(దక్షిణాఫ్రికా): మిథాలి రాజ్, ఓపెనర్ స్మృతి మంధాన అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ రెండో టీ 20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను మట్టి కరిపించింది. దీనితో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. శుక్రవారం జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్‌ను ఎంచుకుంది. భారత బౌలర్లలో స్పిన్నర్లు పూనం యాదవ్, అంజూ పాటిల్ చెరి రెండు వికెట్లు తీయగా, పేసర్లు పూజా, శిఖాలు తలో వికెట్‌ను చేజిక్కించుకున్నారు. మొత్తానికి దక్షిణాఫ్రికా జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేసింది. అనంతర లక్ష్య ఛేదన ప్రారంభించిన భారత మహిళా క్రికెటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఓపెనర్లు మంధాన, మిథాలిలు రెచ్చిపో యారు. సఫారీల బౌలింగ్‌ను చీల్చి చెండాడారు. భారత్ 10 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 74 పరుగులు చేసింది. మంధాన తన అర్ధ శతకాన్ని 34 బంతుల్లో



మంధానల

పూర్తిచేసుకుంది. అనంతరం మరో ఏడు పరుగులు చేసిన మంధాన డేనియల్స్ బౌలింగ్‌లో వెనుదిరిగింది. మంధాన 41 బంతుల్లో 57 పరుగులు చేసింది. ఇందులో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లున్నాయి. ఆమె స్థానంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బ్యాటింగ్‌కు వచ్చింది. మిథాలి 48 బంతుల్లో టీ20ల్లో తన 12వ అర్ధ శతకాన్ని పూర్తి చేసుకుంది. మిథాలి, కౌర్ లు సఫారీల బౌలర్లు ఏమాత్రం ఇబ్బం ది పెట్ట లేక పోయారు. భారత్ 19.1 ఓవర్లలో ఇంకా ఐదు బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. 61 బంతుల్లో 76 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి న మిథాలి రాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. కౌర్ ఏడు పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది.



మిథాలి

సంక్షిప్త స్కోర్లు:

దక్షిణాఫ్రికా బ్యాటింగ్: 142/7(సునె ల్యూస్ 33, నాడైన్ డి క్లెర్క్ 26)
భారత్ బౌలింగ్:పూనం యాదవ్4-0- 18-2,అంజు పాటిల్ 4-0-37- 2 భారత్ బ్యాటింగ్: మిథాలి రాజ్ 76(61 బంతులు) స్మృతి మంధాన 57(42 బంతులు)మొత్తం 144/1(19.1 ఓవర్లు) దక్షిణాఫ్రికా బౌలింగ్: డేని యల్స్ 4-0-21-1



సిరీస్ మనదే!

- చివరి వన్డేలో 8 వికెట్ల తేడాతో గెలుపు
- రాణించిన భారత్ బౌలర్లు
- కోహ్లీ శతకం
- ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్, ప్లేయర్‌ఆఫ్ ది సిరీస్ కోహ్లీ



సెంచూరియన్: కోహ్లీ సేన మరో అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సిరీస్‌లో చివరి మ్యాచ్‌ను కూడా గెలిచి సిరీస్‌ను 5-1 తేడాతో గెల్చుకుంటామని సవాలు చేసిన కోహ్లీ ఈ విజయంతో తనకు ఎదురులేదని చాటాడు. ఆరు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా శుక్రవారం జరిగిన చివరి వన్డేలో భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 5-1 తేడాతో గెలుచుకుంది. ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణిస్తున్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ మరోసారి మెరిశాడు. కెప్టెన్‌గా రాణిస్తూ, అటు బ్యాటింగ్‌లో కూడా రాణిస్తూ తనకు ఎదురులేదని చాటాడు. సెంచరీ చేయడమేకాక భారత్ విజయం సాధించేవరకు బ్యాటింగ్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. కోహ్లీకి తోడుగా రహానే బ్యాటింగ్ చేస్తూ నాటౌట్ నిలిచాడు. అద్భుత ఆటతో రాణించిన కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డులను దక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా బ్యాటింగ్‌లో భారత బౌలర్లు రెచ్చిపోగా, అనంతర సెషన్‌లో భారత బ్యాట్స్‌మన్లు కదం తొక్కారు. వన్డే సిరీస్‌లో అటు భారత బ్యాట్స్‌మన్లు, బౌలర్లు గొప్పగా రాణించారు. అయితే ఐదో వన్డేలో సెంచరీ చేసిన రోహిత్ శర్మ ఈసారి కేవలం 15 పరుగులు చేసి ఎన్గిడి బౌలింగ్‌లో క్లాసెన్‌కు క్యాచిచ్చి వెనుదిరిగాడు. ధావన్ కూడా ఎన్గిడి బౌలింగ్‌లో 18 పరుగులు చేసి జాండోకు క్యాచిచ్చి ఔటయ్యాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లీ, రహానేలు సఫారీల బౌలింగ్‌ను చితక బాదారు. కోహ్లీ 96 బంతుల్లో 129పరుగులు చేశాడు. కోహ్లీ వన్డేల్లో తన 35వ శతకాన్ని పూర్తి చేశాడు. మొత్తానికి భారత్ 32.1 ఓవర్లలో 206 పరుగులు చేసి విజయం సాధించింది. అంతకు ముందు భారత్ టాస్ గెలిచి సఫారీలను బ్యాటింగ్ చేయాలని కోరింది. అరంభం నుంచే దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లను భారత బౌలర్లు బంబెలెత్తించేశారు. యువ పేసర్ శార్దూల్ ఠాకూర్ అద్భుతంగా రాణించాడు. భువనేశ్వర్ స్థానంలో ఆడుతున్న ఠాకూర్ బుమ్రాతో కలిసి బౌలింగ్‌ను ప్రారంభించాడు. ఠాకూర్, ఇన్నింగ్స్ 7వ ఓవర్‌లో మూడో బంతితో దక్షిణాఫ్రికాలో తన తొలి వికెట్‌ను చేజిక్కించుకున్నాడు. బంతిని కట్ చేయబోయిన ఆమ్లా కీపర్ ధోనికి క్యాచిచ్చాడు. ఆమ్లా 10 పరుగుల మాత్రమే చేయగలిగాడు. అనంతరం పదో ఓవర్లో కెప్టెన్ మర్‌క్రమ్ వికెట్‌ను కూడా ఠాకూర్ పడగొట్టాడు. మర్‌క్రమ్24 పరుగులుచేసి ఠాకూర్ బౌలింగ్‌లో శ్రేయాస్ క్యాచ్‌పట్టగా ఔటయ్యాడు. పెహ్లూక్‌వయో, బెహ్రాదీన్ వికెట్లను కూడా ఠాకూర్ చేజిక్కించుకున్నాడు. మొత్తానికి ఠాకూర్ 8.5 ఓవర్లు బౌలింగ్ చేసి 52 పరుగులకు 4 వికెట్లు తీశాడు. స్పిన్నర్ యాదవ్ 51 పరుగులకు 1 వికెట్ తీయగా, మరో స్పిన్నర్ చాహల్ 38 పరుగులకు 2 వికెట్లు కూల్చాడు. వీరిద్దరు మొత్తం ఆరు వన్డేల్లో 33 వికెట్లు పడగొట్టారు. పేసర్ బుమ్రా 24 పరుగులకు రెండు వికెట్లు చేజిక్కించుకున్నాడు. దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లలో ఓ మాదిరి స్కోర్ చేసేన వారిలో కాయో జాండో (54 పరుగులు), డివిల్లియర్స్ (30), పెహ్లూక్ వాయో (34 పరుగులు)

ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో స్పిన్నర్లు తీసిన అత్యధిక వికెట్లు

దేశాలు	ఆతిథ్య దేశం	వికెట్లు	మ్యాచ్‌లు	సంవత్సరం
శ్రీలంక, ఇంగ్లండ్	శ్రీలంక	38	7	2014
బంగ్లాదేశ్, జింబాబ్వే	బంగ్లాదేశ్	37	5	2 009
బంగ్లాదేశ్,వెస్టిండీస్	బంగ్లాదేశ్,	33	5	2012
భారత్, దక్షిణాఫ్రికా	దక్షిణాఫ్రికా	33	6	2018
బంగ్లాదేశ్, జింబాబ్వే	బంగ్లాదేశ్,	32	5	2014
జింబాబ్వే , కెన్యా	జింబాబ్వే	32	5	2009

నా కెరియర్‌లో ప్రతీరోజు భారీ స్కోరు చేస్తా: కోహ్లీ

ఆడిన ప్రతీసారి ఎక్కువ పరుగులు చేయాలని కోరుకుంటున్నట్లు కెప్టెన్ విరాట్ కోహ్లీ అన్నాడు. చివరి వన్డే అనంతరం అవార్డుల ప్రదానం సందర్భంగా కోహ్లీ మాట్లాడుతూ.. ఇంకా నేను ఎనిమిది లేదా తొమ్మదేళ్ల పాటు ఆడతానేమో. ప్రతీరోజు బాగా ఆడి ఎక్కువ పరుగులు చేయాలనుకుంటున్నాను అని కోహ్లీ అన్నాడు. ఈ వన్డే సిరీస్‌లో కోహ్లీ 558 పరుగులు చేయడమే కాక, సిరీస్‌ను 5-1 తేడాతో భారత్‌కు అందిచాడు. కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులను గెలుచుకున్నాడు. తన గెలుపు వెనుక తన భార్య అనుష్క శర్మ ఉందని కోహ్లీ అన్నాడు. కష్టకాలంలో ఆమె నా వెన్నంటే నిలిచి ప్రోత్సహిం చదన్నా డు. అంతేకాక, భారత అభిమా నులు ఇచ్చిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపాడు.

ద్వైపాక్షిక సిరీస్‌లో ఐదు మ్యాచ్‌లు గెలిచిన సందర్భాలు

2013లో జింబాబ్వేలో 5-0, 2017లో శ్రీలంకలో 5-0
2018లో దక్షిణాఫ్రికాలో 5-1

అత్యధిక సెంచరీలు చేసిన కెప్టెన్‌లు

రికీ పాంటింగ్ 220 ఇన్నింగ్స్‌లు 22, డివిల్లియర్స్ 98 ఇన్నింగ్స్‌లు 13
రాట్ కోహ్లీ 46 ఇన్నింగ్స్‌లు 13, గంగూలి 143 ఇన్నింగ్స్‌లు 11
జయసూర్య 118 ఇన్నింగ్స్‌లు 10

దక్షిణాఫ్రికాలో ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక పరుగులు

కోహ్లీ 558 దక్షిణాఫ్రికాపై 2018 (6 ఇన్నింగ్స్‌లు)
పీటర్సన్ 454దక్షిణాఫ్రికాపై 2005(6 ఇన్నింగ్స్‌లు)
ఆమ్లా 413 వెస్టిండీస్‌పై 2015 (4 ఇన్నింగ్స్‌లు)
డు ప్లెస్సిస్ 410 శ్రీలకంపై 2017 (5 ఇన్నింగ్స్‌లు)

ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక పరుగులు

విరాట్ కోహ్లీ 558 దక్షిణాఫ్రికాపై (6 ఇన్నింగ్స్‌లు) 2018
రోహిత్ శర్మ 491 ఆస్ట్రేలియాపై (6 ఇన్నింగ్స్‌లు) 2013
బెయిలీ 478 భారత్‌పై (6 ఇన్నింగ్స్‌లు) 2013
మసాకడ్జా 467 కెన్యాపై 5 ఇన్నింగ్స్‌లు) 2009

3 సెంచరీలు ఒక సిరీస్‌లో

గంగూలి దక్షిణాఫ్రికాలో 2003 ప్రపంచకప్‌లో
వివిఎస్ లక్ష్మన్ ఆస్ట్రేలియాలో, విబి సిరీస్ 2004
విరాట్ కోహ్లీ దక్షిణాఫ్రికాలో 2018

ద్వైపాక్షిక సిరీస్‌లో అత్యధిక వికెట్లు

జె. శ్రీనాథ్ న్యూజిలాండ్‌పై 18 వికెట్లు 2002/03 (7)
మిశ్రా జింబాబ్వేపై 18 వికెట్లు 2013 (5)
ప్యాటర్సన్ భారత్‌పై 17 వికెట్లు 1987 (6)
మాథ్యూస్ ఆస్ట్రేలియాపై17 వికెట్లు 1994(7)
కుల్దీప్ యాదవ్ దక్షిణాఫ్రికాపై 17వికెట్లు 2108(6)

దక్షిణాఫ్రికా బ్యాటింగ్

ఏడెన్ మర్‌క్రం (సి) శ్రేయాస్ (బి)ఠాకూర్ 24, , హషీం అమ్లా (సి) ధోనీ (బి)ఠాకూర్10, డివిల్లియర్స్ (బి) చాహల్ 30, జోండో (సి)పాండ్యా (బి) చాహల్ 54,క్లాసెన్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 22, బెహ్రాదీన్ (సి) ఠాకూర్(బి) బుమ్రా 1, క్రిస్ మోరిస్ (సి) ధావన్ (బి) యాదవ్ 4, పెహ్లూక్‌వాయో (సి) (బి) ఠాకూర్34,మోర్కెల్(సి)శ్రేయాస్(బి) పాండ్యా20, తాహిర్ (సి) కోహ్లీ (బి) బుమ్రా 2, ఎన్గిడి నాటౌట్0 ఎక్స్ట్రాలు: 3, (మొత్తం 46.5 ఓవర్లలో 204 ఆలౌట్)

వికెట్ల పతనం:23-1, 43-2,105-3,135-4,136-5,142-6,151-7,187-8,192-9,204-10

బౌలింగ్:

ఠాకూర్ 8.5-0-52-4 ,జస్‌ప్రీత్ బుమ్రా 8-1-24-2
హార్దిక్ పాండ్యా 10-0-39-1, యుజువేంద్ర చాహల్ 10-0-51-1
కులదీప్ యాదవ్, 10-0-38-2

భారత్ బ్యాటింగ్:

రోహిత్ శర్మ (సి)క్లాసెన్ (బి) ఎన్గిడి 15, శిఖర్ ధావన్ (సి)జాండో (బి)ఎన్గిడి 15, విరాట్ కోహ్లీ(కెప్టెన్)129 నాటౌట్, ఆజింక్యా రహానే నాటౌట్ 34 ఎక్స్ట్రాలు 10, (మొత్తం 32.1 ఓవర్లలో206/ 2 వికెట్లకు)
వికెట్ల పతనం 19-1,80-2,

బౌలింగ్:

మోర్కెల్ 7-042-0, ఎన్గిడి 8-1-54-2, మోరిస్ 6-0-36-0, పెహ్లుక్‌వాయో 4-0-27-0,ఇమ్రాన్ తాహిర్ 7.1-0-42-0

వింటర్ ఒలింపిక్స్ క్రాస్ కంట్రీ రేసింగ్‌లో జగదీష్‌కు 103వ స్థానం



ప్యోంగ్‌చాంగ్: భారత అథ్లెట్ జగదీష్ సింగ్ శీతాకాల ఒలింపిక్స్‌లో బలహీనమైన ఆటను ప్రదర్శించాడు. శుక్రవారం జరిగిన పురుషుల 15కి.మీ ఫ్రీ క్రాస్ కంట్రీ స్కెయింగ్‌లో 103 స్థానంతో సరిపెట్టుకున్నాడు. 26 ఏళ్ల జగదీష్ తొలిసారిగా ఈ క్రీడల్లో పాల్గొంటున్నాడు.

అల్పెన్సా క్రాస్ కంట్రీ స్కెయింగ్‌సెంటర్‌లోని ఫినిష్ లైన్‌ను 43.03 నిమిషాల్లో చేరుకొని జగదీష్ తన పోటీని పూర్తి చేశాడు. జగదీష్ సమయం స్వర్ణ పతకం గెలిచిన స్విట్జర్లాండ్‌కు చెందిన డారియో కొలొగ్నా కన్నా 9:16.4 నిమిషాలు ఆలస్యంగా ఫినిష్‌లైన్‌ను దాటాడు. నార్వేకు చెందిన సిమెన్ క్రూయెజర్ 34:02.2 నిమిషాలతో రజత పతకంను గెలుచుకోగా, రష్యాకు చెందిన డెనిస్ స్పిట్‌సోవ్ 34:06.9 నిమిషాలతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రారంభంలో 1.5కి.మీ వద్ద భారత అథ్లెట్ స్విస్ క్రీడాకారుడికంటే 40 సెకండ్లు మాత్రమే వెనుకబడ్డాడు. పోటీ సాగుతున్న కొద్దీ వీరిద్దరి మధ్య అంతరం పెరుగుతూ పోయింది. అర్ధ భాగంలో జగదీష్ 4.28 నిమిషాలు వెనుకబడ్డాడు. ఫినిషింగ్ లైన్ చేరేసరికి జగదీష్ తన స్థానాన్ని ఇంకొంచెం మెరుగు పర్చుకునే అవకాశమున్నప్పటికి నిరాశపర్చాడు. క్రాస్ కంట్రీ స్కెయింగ్‌లో అథ్లెట్లు 15 కిలోమీ టర్లపాటు మంచుతో కప్పబడ్డ ప్రాంతంలో సాగాల్సి ఉంటుంది. అతితక్కువ సమయంలో ఈ దూరాన్ని పూర్తిచేసిన వారు విజేతలుగా నిలుస్తారు. ప్యాంగ్‌చాంగ్ క్రీడల్లో భారత తరపున ఇద్దరు అథ్లెట్లు మాత్రమే పాల్గొంటున్నారు. మరొక అథ్లెట్ శివ కేశవన్ ఫిబ్రవరి 11న జరిగిన పురుషుల ల్యూజ్ క్రీడలో 34వ స్థానంలో నిలిచాడు.

హాకీ వరల్డ్ కప్‌లో పాకిస్థాన్ ఆడుతుంది!

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత్‌లో జరగనున్న హాకీ వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో పాకిస్థాన్ కూడా పాల్గొంటుందని అధికార వర్గాలు తెలిపాయి. వరల్డ్ కప్‌లో ఆడేందుకు పాకిస్థాన్ క్వాలిఫై అయిన సంగతి తెలిసిందే. భువనేశ్వర్‌లో ఈ ఏడాది నవంబర్ 18 నుంచి డిసెంబర్ 16 వరకూ జరిగే హాకీ వరల్డ్ కప్ టోర్నీలో పాకిస్థాన్ ఆడే అవకాశాలు లేవని తొలుత వార్తలు వచ్చాయి. భారత్- పాకిస్థాన్ మధ్య సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌లో జరిగే వరల్డ్ కప్‌కు పాకిస్థాన్ దూరంగా ఉంటుందని భావించారు. అయితే హాకీ గవర్నింగ్ బాడీ పాక్ ఈ టోర్నీలో పాల్గొంటుందని పేర్కొంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.


జై తెలంగాణ
జై కేసీఆర్
మన స్వప్నం - మన లక్ష్యం - బంగారు తెలంగాణ
తెలంగాణ రాష్ట్ర ప్రదాత
బంగారు తెలంగాణ నిర్మాత
జన హృదయ నేత
తెలంగాణ జాతి పిత
జాతిని మేల్కొలిపిన జననేత
మన ప్రియతమ ముఖ్యమంత్రి
నాకు దైవసమానులైన
శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సార్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
శంభీపూర్ రాజు
ఎమ్మెల్సీ రంగారెడ్డి జిల్లా
రాష్ట్ర అధ్యక్షుడు టీఆర్ఎస్ యువజన విభాగం

KCR @ 64
బర్త్‌డే స్పెషల్



జన చంద్రుడికి...
గగన చంద్రుడు అనుకూలమే!

* ఆకాశాన్ని అంటే ఆశయాల వెన్నెల...లక్ష్యాన్ని ఛేదించే పట్టుదల
* భావోద్వేగాల వెల్లువ...మానవత క్షమా గుణాలకే విలువ
* అంతు చిక్కని లోతైన మనసు.....స్వతంత్ర భావాలకు స్వాగతం
* అంతరంగంలో శాంతిపిపాసి...
* అవసరంలో ఉన్నవారిని మరువలేని బలహీనత
* ఈ సంవత్సరం...ఆటంకాలులేని రాజకీయ ప్రయాణం
* తెలంగాణ ప్రయోజనాలకు అత్యద్భుతమైన విజన్



నిజానికి ప్రజా నాయకుడిని, ప్రజలకు వెలుగులు పంచాలని అనుకునే వ్యక్తిని సూర్యునితోనే పోల్చాలి. కానీ కేసీఆర్....అణచివేతతో అవమానాలతో అసమానతలతో రగులుతున్న తెలంగాణ ప్రజల గుండెల్లోని బడబాగ్నిని మొదట చల్లార్చారు. ఆయన మాట బాట చూపు దృక్పథం ఆలోచనలు ఆశయాలు అన్నీ....నిజంగా చందన లేపనాలై...తెలంగాణాని చల్లబరచాయి. కేసీఆర్ చల్లని చూపునే తెలంగాణవాసులు కోరుకున్నారు....కోరుతున్నారు. అందుకే ఆయనను అచ్చమైన తెలంగాణ చంద్రుడిగానే చెప్పాలి. జనమే కాదు..ఖగోళమూ అదే చెప్పటం విశేషం. కేసీఆర్ జాతకంలో చంద్రుడు బలవంతుడై ఉన్నాడు. ఆయనను నేటి రాజకీయ నేతల్లో...చుక్కల్లో చంద్రుడిగా నిలుపుతున్నాడు...

కె.చంద్రశేఖరరావు
పుట్టిన తేదీ: 17-2-1954
రాశి: కర్కాటకం
నక్షత్రం: ఆశ్లేష

కేసీఆర్ రాశి అయిన కర్కాటక రాశిలో ఉన్న చంద్రుని స్థానం...కేసీఆర్ జాతకంలో ఉన్న చాలా శక్తిమంతమైన లక్ష్యాలను, వాటిని సాధించాలనే బలమైన తీవ్రమైన కాంక్షను వెల్లడిస్తోంది. ధైర్యం, సాహసం, ప్రపంచం తమ గురించి ఏమనుకుంటుందోననే భయం ఏమాత్రం లేకపోవటం...కర్కాటక రాశిలో ఉన్న చంద్రుడు ఈ గుణాలన్నింటినీ ఇస్తున్నాడు. అయితే విచిత్రంగా కర్కాటక రాశిలో ఉన్న చంద్రుడు...ఆత్మావలోకనం చేసుకునే లక్షణాన్ని సైతం ప్రభావితం చేస్తున్నాడు. అంటే తనని తాను శోధించుకుని మిట్ట పల్లాలను విశ్లేషించుకోవటం. ఈ లక్షణం కేసీఆర్‌కి అంతులేని బలంగా మారింది. ఆయన తను వేస్తున్న అడుగుల్లోని మంచి చెడులను వెంటనే గ్రహిస్తారు. వాటికి అనుగుణంగా మారుతూ...తననితాను ముందుకు నడిపించగలుగుతారు.

రాజకీయాలు వ్యక్తిత్వం కాదు...మానవత్వమే ప్రధాన గుణం!

కేసీఆర్‌కు మేధావులన్నా, నిజాయితీ పరులన్నా, ముక్కుసూటిగా వెళ్లేవారన్నా చాలా ఇష్టం. ఎంత సేపు స్వీయ గుర్తింపు, పేరు ప్రతిష్టల కోసం పాకులాడేవారంటే ఆయనకు నచ్చదు. తమ స్వార్థం కోసం మాత్రమే పనిచేసేవారన్నా, క్రూరమైన మనస్తత్వ మున్నవారన్నా, ఇతరులతో పరుషంగా మాట్లాడేవారన్న కేసీఆర్ ఏ మాత్రం సహించలేరు. మనసు విప్పి నిజాయితీగా మాట్లాడేవారి మాటలను ఆయన శ్రద్ధగా వింటారు. వారి ఆలోచనలను ఆమోదిస్తారు కూడా. నిజానికి ఆయనది రాజకీయాలకు అనుకూలమైన మనస్తత్వమే కాదు. కేసీఆర్ అంతరంగాన్ని బట్టి చూస్తే... ఆయనకు భావోద్వేగాలు చాలా ఎక్కువ. తనకు ఎదురవుతున్న అనుభవాలను బట్టి... రాజకీయాల కు సంబంధించిన లక్షణాలను అలవరచుకో వాల్సిందే కానీ...నిజానికి ఆయన వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణాలు.. మానవత్వం, క్షమా గుణాలే. ఇవే ఆయనలోని లోపలి దైవత్వ లక్షణాలు.

ఆచరణలో అసాధ్యుడు... అంతరంగంలోతులతో అంతుచిక్కడు

కేసీఆర్ రాశిలో చంద్రుని స్థానం...ఆయన ఆచరణలో మనసుచెప్పినట్టు నడుస్తారు... అని చెబుతోంది. ప్రజా ప్రయోజనాన్ని ఇవ్వని విషయాలను ఆయన ఇష్టపడరు. ఆయన తీసుకునే నిర్ణయాలు వ్యక్తులను బట్టి ఉండవు. పరిస్థితులను బట్టే ఉంటాయి. ఈ మనస్తత్వం ఇతరులకు ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఆయన నాయకత్వ లక్షణాల వెనుక ఒక మానసికశాస్త్రవేత్త ఉన్నాడు. కేసీఆర్ ఎప్పుడూ.. .రెండవ ఆలోచనలకు ప్రాధాన్యత ఇస్తారు. కానీ దాన్ని ఎవరికీ వెల్లడించరు. ఆయనని చూస్తున్నవారు ఆయన మాటలు, బయటకు కనబడుతున్న ప్రవర్తన ఆధారంగా ఆయనని అర్థం చేసుకునే ప్రయత్నాలు చేస్తారు...
కానీ తనలోని లోపలి మనిషిని ఎవరూ సరిగ్గా అంచనా వేయలేరు. కొన్ని ఆలోచనలను ఆచరణలో పెట్టినట్టే ఉంటారు...కానీ హఠాత్తుగా వాటిని పక్కన పెడతారు. లోతుగా చూస్తే...ఆయనలో మరో మనిషి ఉన్నట్టుగా తెలుస్తుంది. కానీ ఈ విషయాన్ని అంత తేలిగ్గా ఎవరూ అర్థం చేసుకోలేరు.

ఆధారపడని వ్యక్తులంటే గౌరవం..

కేసీఆర్ ఎల్లప్పుడూ ఒక లక్ష్యం కోసం పోరాడేవారిని, సమాజానికి గర్వకారణంగా నిలిచేవారిని అమితంగా ఇష్టపడతారు. అలాంటి వారికి తన మనసులో పదిలమైన స్థానాన్ని కల్పిస్తారు. వారిని ఎంతో ప్రోత్సహిస్తారు...అంతేకాదు వారితో మనసు విప్పి మాట్లాడతారు. ఇతరులపై ఆధారపడకుండా విషయాలపట్ల అవగాహన పెంచుకుని తమకు తాముగా సొంత నిర్ణయాలు తీసుకునేవారిని ఆయన ఇష్టపడతారు. పుస్తకంపై అట్టని చూసి...ఒక నిర్ణయానికి వచ్చే వ్యక్తి కాదు..కొత్త మనుషులను కలిసినప్పుడు, కొత్త పరిస్థితులు ఎదురైనప్పుడు మనసులో ఎలాంటి ముద్ర లేకుండా ఓపెన్‌మైండ్‌తో చూస్తారు.

గతం నీడలు ఉండవు..ఒంటరిగా ఉన్నపుడు అంతులేని కృషీవలుడు

కేసీఆర్‌లోని మరో కోణంలో...ఆగ్రహం, మౌనం, వ్యంగ్య బాణాలు కలగలసి ఉంటా యి. ఇవన్నీ చూసినవారికి ఆశ్చర్యాన్ని కలిగించకమానవు. ఇవి తన ప్రత్యర్థులపై విరుచుకుపడినప్పుడు కనబడతాయి కానీ...తరువాత వాటి తాలూకూ ప్రస్తావన ఉండదు. దీనిని బట్టి ఆయన తన మైండ్‌లో...గతం తాలూకూ ఆగ్రహావేశాలను మిగుల్చుకోరని, ఎప్పటికప్పుడు తుడిచేస్తారని అర్థమవుతుంది. కొన్నిసార్లు...కేసీఆర్ ఒక అంతు చిక్కని రహస్యంలా అనిపిస్తారు. తనలోపలికి తాను ప్రయాణిస్తూ..ఓ కొత్త మనిషిని ఆవిష్కరిస్తారు. అలాంటపుడు ఆయన ఏ మాత్రం రాజకీయ నాయకుడిగా అనిపించరు. అయితే కేసీఆర్ ఒంటరిగా ఉన్నపుడు ఎంతో మానసిక శ్రమ చేస్తారు. ఎన్నో విషయాల మీద ఎంతో కృషి చేస్తారు.

సహనశీలే....శృతిమించితే భరించరు

కేసీఆర్‌ని పూర్తిగా అర్థం చేసుకోవాలంటే...ఆయనలోని ప్రత్యేక గుణాలు వ్యక్తిత్వ లక్షణాలను పరిశీలించాలి. అవన్నీ కలిపితేనే కేసీఆర్. ఇప్పుడు ఆ లక్షణాలన్నీ కలిసే..మనకు నాయకుడంటే ఇలా ఉండాలి...అనే అభిప్రాయాన్ని కలిగిస్తున్నారు. చంద్రుడు స్వతంత్ర భావాలకు సొంత ఆలోచనలకు...తమకు తాముగా ఒక నిర్ణయానికి వచ్చేవారికి...కారకుడుగా నిలుస్తాడు. ఇతరులపై ఆధారపడే తత్వమున్నవారికి చంద్రుడు చాలా దూరం. కేసీఆర్ తనలోని సహనం కోల్పోయేవరకు తనని బాధపెట్టేవారిని, ఒత్తిడిని సహిస్తారు. ఆయన తన దృక్పథాన్ని తప్పుదారి పట్టించాలనుకుంటే మాత్రం భరించరు. అయితే నిర్మాణాత్మకమైన విమర్శలను మాత్రం స్వాగతిస్తారు.

అంతరంగంలో... శాంతి కాముకుడు...

కేసీఆర్ పార్టీలోని ఇతర నాయకుల్లో, తన చుట్టూ ఉన్న జనంలో శక్తిని నింపుతారు. ఇది తనపై తనకున్న నమ్మకానికి సూచన. ప్రజలను నడిపించే నాయకత్వ లక్షణం. జాతక చక్రంలో సూర్యుడు ఈ విషయాన్నే ప్రతిబింబిస్తాడు. ప్రపంచంలో మన ఉనికిని ఎలా నిలబెట్టుకుంటున్నాం...అనే విషయాన్ని. రకరకాల స్థాయిల్లో మనిషి తనని తాను వ్యక్తీకరించుకోవడాన్ని సూర్యుడు ప్రభావితం చేస్తాడు. ఈ భౌతిక ప్రపంచ స్థాయిలో ఉండే ఇగో, అత్యున్నత చైతన్య శక్తి...లేదా జన్మ సార్థకత...ఈ స్థాయిల్లో మనిషి చేసే ప్రయాణం... సూర్యుడి స్థానాన్ని బట్టే ఉంటుంది. మనిషి ఒక స్థానం నుండి మరొక స్థానానికి వెళ్లడాన్ని నిర్ణయించేది...అతని జాతకంలోని సూర్యుని స్థానమే. కేసీఆర్ జాతకాన్ని బట్టి సూర్యుడు చంద్ర లగ్నం నుండి ఎనిమిదవ స్థానంలో ఉన్నాడు. ఈ స్థానం సామాజిక, వాతావరణపరంగా విపరీత పరిస్థితులు ఎదుర్కోవడాన్ని వెల్లడిస్తుంది. కేసీఆర్... బయటి జీవితంలో రాజకీయాలలో ఉన్నా...అంతరంగంలో అత్యంత శాంతి పాపాసి. బయటకు చూసినప్పుడు చాలా సాధారణంగా స్నేహపూరి తంగా కనబడుతుంటారు కానీ...ఆయన ప్రపంచాన్ని చూసే తీరు పరిశీలనలో మాత్రం వాస్తవిక వాదమే ఉంటుంది. కేసీఆర్‌లోని అత్యంత పెద్ద బలహీనత ఏమిటంటే..ఆయన తన చుట్టూ ఉన్నవారి అవసరాల పట్ల అత్యంత బాధ్యతగా ఉంటారు.

ఒడిదొడుకులు లేవు...తెలంగాణ కోసం వినూత్న ఆలోచనా దృక్పథం...

2018లో కేసీఆర్ రాజకీయ జీవితం...చాలా తేలికగా... గాలివాటుతో సాగే పడవ ప్రయాణంలా సునాయాసంగా సాగిపోతుంది. ఈ ఏడాది సెప్టెంబరు నుండి డిసెంబరు వరకు రాజకీయ వత్తిళ్ళు ఎదురుకావచ్చు. రాబోయే రోజులు అన్నీ ఆయన నియంత్రణలో ఉంటాయి. ప్రజలకు, రాష్ట్రానికి మేలుచేసే సరికొత్త నిర్ణయా లు వినూత్న సృజనాత్మక ఆలోచనల తో ఆయన ఇతరులను ఆశ్చర్యానికి గురిచేస్తారు. తెలంగాణ ప్రజలకోసం, వారి భావోద్వేగాలకోసం... అద్భుత మైన ఆలోచనలతో కూడిన... విజన్ కేసీఆర్ సొంతం. ఈ క్రమంలో వచ్చే ఆటంకాలు ఏవైనా...వాటిని ఎంతో సునాయాసంగా ప్రశాంతంగా ఎదుర్కొంటారు.




-ఎస్ వి నాగ్‌నాథ్
ఆస్ట్రోసైకాలజిస్ట్

కేసీఆర్ @ 64 బర్త్‌డే స్పెషల్

అనితరసాధ్యుడు.. ఆరాధ్యుడు

కేసీఆర్.. ఈ మూడక్షరాలే అసాధ్యాలను సుసాధ్యం చేసిన అద్భుతం. తెలంగాణ సమాజాన్ని ఒక్కటి చేసి ఢిల్లీని కదిలించిన ధీరత్వం. అరవైఏండ్ల జాతి ఆకాంక్షను నెరవేర్చి.. తెలంగాణ ప్రాంత దాస్యశృంఖలాలు తెంచి ఇక్కడి ప్రజలు కోరుకున్న నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించిన మహోన్నత శిఖరం. జనం గుండెతడి తెలిసిన అద్వితీయం. తెలంగాణ శాశ్వత శాపాలను పొలిమేరలు దాటించి తరుముతున్న తేజోదీపం. ప్రజానాడి తెలిసిన అసామాన్య నాయకతరంగం. పాలననూ ఉద్యమపంథాలో పరుగు పెట్టిస్తున్న స్ఫూర్తిమంత్రం. శనివారం కల్వకుంట్ల చంద్రశేఖరరావు 64ఏళ్ళు పూర్తిచేసుకుని 65వ వసంతంలోకి అడుగిడుతున్నారు. ముఖ్యమంత్రిగా ఇది ఆయనకు నాలుగో జన్మదినం. ఈ సందర్భంగా ఆంధ్రప్రభ లైఫ్ అందిస్తున్న ప్రత్యేక కథనం.



శత్రువునైనా మాటల మంత్రదండంతో ముగ్గుల్ని చేసి చప్పట్లు కొట్టించగల చాతుర్యం.. అనుకున్నది సాధించే క్రమంలో ఎలాంటి పదవినైనా ఎడమచేత్తో విసిరి కొట్టి కార్యక్షేత్రంలోకి దూకే తత్వం.. సంక్షోభాలు చుట్టుముట్టిన ప్రతిసారీ మెరుపులాంటి ఎత్తుగడలతో పరిస్థితులను ఎదుర్కొనే చాణక్యం కేసీఆర్ సొంతం. ఎవరూ సాధ్యం కాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి.. బంగారు తెలంగాణ దిశగా ప్రజల కలలను సాకారం చేస్తూ నెంబర్‌వన్ సిఎంగా దేశవ్యాప్త ప్రశంసలు అందుకుంటున్న ఆయన సాహసానికి నిలువెత్తురూపం. ఆశ్చర్యపరిచే లక్ష్యాలు ప్రకటించి.. అద్భుత వ్యూహరచనతో వాటిని సాధిస్తున్న కేసీఆర్ తెలంగాణ జాతిపిత. అహింసామార్గంలో మలిదశ ఉద్యమాన్ని దూకుడుగా తీసుకెళ్ళి.. దేశమంతా కాలికి బలపం కట్టుకుని తిరిగి.. కుట్రలను ఛేదించి.. అరవైఏండ్ల తెలంగాణ తండ్లాట తీర్చిన మహాత్ముడు.. దార్శనికుడు. ఈ సృష్టిలో తెలంగాణ ఉన్నంతకాలం.. ప్రజల గుండెల్లో ఆయన శాశ్వతం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ పుష్కరకాలానికి పైగా అలుపెరగని పోరాటం చేశారు. నాలుగు కోట్ల ప్రజలను ఏకతాటిపైకి తెచ్చిన కేసీఆర్..ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమ బాటలో ఎంత నిక్కచ్చిగా నిలిచాడో..రాష్ట్ర పాలనలోనూ అదే నిస్వార్థంగా.. నిజాయితీగా ముందుకు వెళుతూ బలమైన ముద్రవేశారు.

చింతమడక నుండి ప్రస్థానం..


మెదక్ జిల్లా సిద్దిపేట మండలంలోని మారుమూల గ్రామమైన చింతమడకలో ఫిబ్రవరి17,1954లో ఓ మధ్య తరగతి రైతు కుటుంబంలో జన్మించారు. కేసీఆర్ విద్యాభ్యాసం చింతమడక, దుబ్బాక, సిద్దిపేట, హైదరాబాద్‌లలో కొనసాగింది. ఓయు ఆర్ట్స్ కళాశాలలో ఎంఏ(తెలుగు సాహిత్యం) చదివిన కేసీఆర్ బాల్యం నుండే రాజకీయ లక్షణాలతో ఎదిగారు. మొదట యువజన కాంగ్రెస్ ద్వారా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన కేసీఆర్ కొద్దికాలానికే అనేక సంచలనాలకు కేరాఫ్‌గా నిలిచారు. మొట్టమొదటిసారిగా 1983లో టీడీపీ అభ్యర్థిగా సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ చేతిలో ఓటమిని చవిచూశారు. ఆ తరువాత 1985లో జరిగిన ఎన్నికల్లో ఇదే సిద్దిపేట నియోజకవర్గం నుంచి రెండోమారు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్‌ను ఓడించారు. ఇక అప్పటి నుంచి ఆయనకు తిరుగేలేదు. ఓటమి అంటేనే తెలియదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర రవాణాశాఖ మంత్రిగా, ఉప సభాపతిగా, కేంద్రంలో కొన్ని నెలల పాటు కార్మిక శాఖ మంత్రిగా చేశారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయన అనేకపదవులు చేపట్టారు. చేపట్టిన ప్రతి పదవికి ఆయన వన్నె తెచ్చారు. ఏ పదవి చేపట్టినా దానిపై తనదైన ప్రత్యేకముద్ర వేశారు. అనేకపదవులు చేపట్టినా..పదవులకే వన్నె తెచ్చినా.. ఈ ప్రాంత ప్రజల కోసం ఇంకా ఏదో చేయాలనే పట్టుదలే ఆయనను తెలంగాణ ఉద్యమం వైపు నడిపించింది. చూడటానికి బక్క పలచగా ఉండే కేసీఆర్ వ్యూహాలను రచించడంలో, ప్రత్యర్థుల ఎత్తులకు పై ఎత్తులు వేయడంలో దిట్ట. తాను అనుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి ఏదైనా చేయడం, ఎంతదూరమైనా వెళ్లడం ఆయన నైజం.

ఒకే ఒక్కడు

సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబంలో జన్మించిన కేసీఆర్..ఉద్యమాన్ని ఊపిరిగా భావించి.. ప్రేమించి.. శ్వాసించి..తన వాగ్ధాటితో.. వ్యూహచాతుర్యంతో అహింసామార్గంలో.. చిన్న రక్తపుబొట్టు కూడా చిందకుండా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. భారతదేశ పటంలో తెలంగాణను 29వ రాష్ట్రంగా ఏర్పడేలా చేసిన సాధకుడు కేసీఆర్. టికెట్టు తెచ్చుకునే స్థాయి నుంచి టికెట్లు ఇచ్చే స్థాయి వరకు ఎదిగి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి అయి రాష్ట్ర రాజకీయాల్లోనే కాక దేశ రాజకీయాల్లోనూ చెరగని ముద్రను వేసుకున్నారు. తెలంగాణ ప్రజల్లో బలంగా నాటుకుపోయిన తెలంగాణ వాదాన్ని, రాష్ట్ర ఆకాంక్షను గుర్తించి 2001 ఏప్రిల్ 27న తెలుగుదేశం పార్టీకి, శాసనసభ్యత్వానికి రాజీనామా చేసి.. డిప్యూటీ స్పీకర్ పదవిని గడ్డిపోచలా వదిలి తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షకు గొంతుకై ఉద్యమంలోకి దూకారు. పార్టీ ఆవిర్భావ సందర్భంలో కేసీఆర్‌ను అనేక మంది వ్యతిరేకించారు. కానీ ఆయన మాత్రం అవేమీ లెక్క చేయలేదు. ఉద్యమంలోకి దూకినప్పుడే స్వార్థం అనేదానికి ఆస్కారం లేకుండా 'అయితే హీరో లేదంటే జీరో' అనే నినాదంతో ఉద్యమాన్ని మొదలుపెట్టారు. కేవలం తన మాటల్ని మాత్రమే పెట్టుబడిగా చేసుకుని మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీ దాకా, ఢిల్లీ నుంచి ఖండాంతరాల దాకా ఉద్యమ నినాదాన్ని తీసుకెళ్ళాడు. ఆర్థికంగా అంత స్థోమత లేకపోయినా, రాజకీయంగా వారసత్వం లేకపోయినా కేవలం ధైర్యం, తెలంగాణ సెంటిమెంటు, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ఆయుధంగా చేసుకుని రాజకీయాల్లో గట్టిగా నిలదొక్కుకోగలిగిన ఒకే ఒక్క దమ్మున్న నేత కేసీఆర్.

ప్రాణత్యాగానికి సిద్ధపడి..

తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ సచ్చుడో.. ఇలాంటి నినాదం ఇవ్వాలంటే ఎన్ని గుండెలుండాలి? ఎంత ధైర్యం కావాలి? తెలంగాణ రాష్ట్రం వచ్చేదాకా.. నేను లక్ష్యం నుండి పక్కకు జరగ.. నేను లక్ష్యం నుండి పక్కకు జరిగితే నన్ను రాళ్ళతో కొట్టి చంపండి.. ఆవిర్భావం రోజే ఈ మాటలు అనడానికి ఎంత నిబద్ధత ఉండాలి.. ఎంత దూరదృష్టి.. తపన ఉండాలి? దటీజ్ కెసిఆర్. ఆయనకు ఉన్నవే అవి. ధైర్యానికి.. సాహసానికి నిలువెత్తు చిరునామా. ఎన్ని ఇబ్బందులొచ్చినా, ఎవరెన్ని విధాలుగా అడ్డంకులు సృష్టించినా, అవాంతరాలు కల్పించినా.. ఏనాడు కేసీఆర్ అదరలేదు, అంతకంటే బెదరలేదు. అవమానాల్ని, బాధల్ని తనే దిగమింగుకుంటూ తాను పెట్టుకున్న లక్ష్య సాధన కోసం మొక్కవోని దీక్షతో మరింత రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చివరి అస్త్రంగా తన ప్రాణాన్ని పణంగా పెట్టి పోరాడిన యోధుడు కెసిఆర్. రాజకీయాల్లో సుదీర్ఘమైన అనుభవం ఉన్నా, 13ఏళ్ల తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ చవి చూసినన్ని ఆటుపోట్లను, ఒడిదొడుకుల్ని ఈ రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీ నేత చూడలేదు. దేశంలోనే కెసిఆర్ ఒక ప్రత్యేకం. అపర చాణుక్యుడుగా పేరు సంపాదించుకున్న కేసీఆర్ తాను అనుకున్న గమ్యాన్ని చేరుకోవడమే కాకుండా ప్రజాభీష్టంతో తెలంగాణ తొలి సీఎం అయ్యారు. ఆయన అనుకున్న తెలంగాణ సాధించుకుని, ఇప్పుడు బంగారు తెలంగాణ కోసం అహరహం పరితపిస్తున్నారు. తెలంగాణ పునర్ నిర్మాణం కోసం సర్వశక్తులొడ్డుతున్నారు. ఆ దిశగా వస్తున్న ఫలితాలతో ప్రపంచం చేత జేజేలు అందుకుంటున్నాడు. సామాన్య కుటుంబం నుండి వచ్చి రాజకీయాల్లోకి నిలదొక్కుకోవడమే అరుదు కాగా.. అటువంటిది కేసీఆర్ ఏకంగా ఓ పార్టీని స్థాపించి దానిని 13 ఏళ్లపాటు సక్రమమార్గంలో నడిపించి, కొత్త రాష్ట్రం ఏర్పడటానికి ఉద్యమించడం, దానిని సాధించడమంటే మామూలు విషయం కాదు. అందరూ అసాధ్యమన్న దానిని కేసీఆర్ సుసాధ్యం చేసి చూపించారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల స్వప్నాన్ని సాకారం చేసిచూపారు.



బడిజ్ఞాపకాలతో...

విద్యార్థి దశ నుంచే రాజకీయ లక్షణాలతో ఎదిగిన కేసీఆర్ మంచి వ్యూహకర్త. మాటల మరాఠి. తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయగల రాజకీయ చతురుడు. తెలుగు బాషపై అద్భుతమైన పట్టు సంపాదించిన పుస్తకమిత్రుడు. కేసీఆర్ చింతమడకలో ప్రాథమిక విద్యను అభ్యసించిన తర్వాత దుబ్బాకలో ఉన్న పాఠశాలలో చదువును కొనసాగించారు. తనకు చిన్నప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన దుబ్బాక ప్రభుత్వ పాఠశాలకు రూ.5కోట్ల నిధులు కేటాయించి రుణం తీర్చుకున్నారు. ఇటీవల జరిగిన ప్రపంచ తెలుగుమహాసభల సందర్భంగా తన గురువుకు ప్రపంచమంతా చూస్తుండగా కాళ్ళకు నమస్కారం చేసి అద్భుత సంప్రదాయాన్ని, విధేయతను చాటుకున్నారు. కేసీఆర్ బాల్య జీవితమంతా దుబ్బాక పరిసర ప్రాంతంతోనే ముడిపడి ఉంది. దుబ్బాకలో విద్య అభ్యసించడంతో సెలవు దినాల్లో ఎక్కువగా దుబ్బాక పరిసర ప్రాంతాల్లోనే గడిపేవాడు. కల్మషం లేని బాల్యంలో ఆడుతూ..పాడుతూ.. బడి..పొలాల చుట్టూ తిరుగుతూ బడికి ఎగనామం పెట్టి ఈ ప్రాంతంలోని బావుల్లో కొట్టిన ఈతలు...చెరువు గట్టుపై కూర్చుని రాసిన కవితలను, గురుభక్తితో పంతుళ్ల ఇంటికి మోసిన కూరగాయలు, తీసుకెళ్లిన పాలు తదితర ఘటనలను సీఎం కేసీఆర్ ఇప్పటికీ తన చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటుంటారు. తాజాగా జరిగిన ప్రపంచ తెలుగుమహాసభల్లోనూ అనేక సంఘటనలు గుర్తుచేసిన కేసీఆర్ అలవోకగా పద్యగానం చేసి అబ్బురపరిచారు.

విలువలే ప్రాణం..

ఉద్యమంలోనూ కాక పాలనలోనూ అదే పంథా సాగుతోంది. తెలంగాణను బంగారు తెలంగాణగా చేసే దిశగా, ఉద్యమస్ఫూర్తితో పనిచేస్తుండడంతో అనేక సమస్యలు శాశ్వతంగా తీరుతున్నాయి. విద్యుత్ చీకట్లు శాశ్వతంగా తరిమికొట్టిన కెసిఆర్.. ప్రజలనే ఆశ్చర్యపరిచారు. దశాబ్దాలుగా బీళ్ళుపడ్డ భూముల్లోకి జలసిరులు పారించేందుకు నిరంతరం.. నిర్విరామంగా శ్రమిస్తున్నారు. ఇప్పటికే భక్తరామదాసు ప్రాజెక్టు ప్రారంభించి.. పూర్తిచేసి చరిత్రసృష్టించిన కేసీఆర్ కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులతో దేశాన్ని నివ్వెరపరుస్తున్నారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేసి.. మిషన్ కాకతీయతో చెరువులకు కొత్తకళ తెచ్చి రైతాంగంలో ఆశలు మొలకెత్తించారు. తెలంగాణకు గుండెకాయ వంటి హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. పారిశ్రామికవేత్తలను ఆకర్షించడానికి ప్రభుత్వం తెచ్చిన పారిశ్రామిక విధానం మంచి ఫలితాల్ని సాధిస్తోంది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు కంపెనీలు వస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్ ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపుతెచ్చింది. కేసీఆర్ చేపట్టిన అనేక పథకాలను ప్రధాని మోడీ స్వయంగా అభినందించగా, అనేక రాష్ట్రాలు పథకాల అధ్యయనానికి క్యూ కట్టాయి. ఉద్యమ పార్టీ ఆవిర్భావ సందర్భంలో 'అయితే హీరో లేదంటే జీరో' అని అన్న కేసీఆర్ నేడు అందరి మనసులు దోచుకుని నాలుగు కోట్ల ప్రజలకు నిజంగానే హీరో అయ్యారు. తెలంగాణ ఆరాధ్యనేత కేసీఆర్‌కు 'ఆంధ్రప్రభ లైఫ్' మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతోంది.

- కంది రామచంద్రారెడ్డి

మన సీఎం తెలుగుపండిట్

అటజని కాంచె భూమిసురు డంబర చుంబిశిరస్సరజ్ఝరీ పటల
ముహుర్ముహు ర్లుఠ దభంగ తరంగ మృదంగనిస్వన
స్ఫుట నటనానుకూల పరిఫుల్ల కలాపి జాలమున్
గటక చరత్కరేణు కర కంపిత జాలము శీతశైలమున్

ఇలాంటి పద్యాలు గుక్కతిప్పుకోకుండా.. అర్థాలు, తాత్పర్యాలు వివరిస్తూ అలవోకగా చెప్పడం సామాన్యులకు సాధ్యం కాదు. రాజకీయనేతల్లో అయితే కాగడా వెతకాల్సిందే. పండితులకు మాత్రమే సాధ్యమైన ఇలాంటి పద్యపట్టును సంపాదించిన ముఖ్యమంత్రి కేసీఆర్ బాల్యంలో అలవోకగా 2వేలకు పైగా పద్యాలు చెప్పేవాడు. ప్రపంచ తెలుగుమహాసభల సందర్భంగా తన పద్యవిన్యాసాన్ని ప్రపంచానికి చాటిన సిఎం.. ఈ పాండిత్యం కోసం చేసిన కృషి వింటే ఆశ్చర్యమనిపిస్తుంది. అకుంఠితదీక్ష.. నేర్చుకోవాలన్న తపన.. నిరంతర జిజ్ఞాస ఇందుకు దోహదపడ్డాయి. తెలుగు పద్యంలోని మాధుర్యాన్ని అర్థం చేసుకున్న కెసిఆర్ బాషపై పట్టుపెంచుకునేందుకు చేసిన ప్రయత్నాలు స్ఫూర్తిని కలిగిస్తాయి.

పద్యమాధుర్యం ఆ నోట వినాల్సిందే..

మనకు తొలిగురువు అమ్మే.. జో అచ్యుతానంద.. జోజోముకుందా రామపరమానంద లాలిగోవిందా అని అని తల్లి జోలపాట పాడుతుంది.. అందులోనే తల్లి రామునిలాగా, కృష్ణునిలాగా.. మంచి సుగుణాలతో వర్ధిల్లమని కోరుతుంది. జీవితగమనం ఆదర్శ పురుషుడిలా ఉండాలని తల్లి చనుబాలతోనే పరిచయం చేస్తుంది. నేను చిన్నతనంలో ఉన్నపుడు మా నాన్నగారు చక్కని పద్యాలు నేర్పించారు.. శ్రీరాముని దయ చేతను నారూఢిగ సకలజనులు నౌరాయనగా అని బుజ్జగించి పద్యాలు, సంస్కారం చెప్పేవారు. అతిచిన్న, సులభ పదాలతో సాహిత్యం అందించిన మహాకవి బమ్మెరపోతన. శతక సాహిత్యం అప్పట్లో ఎక్కువగా చెప్పేవారు. అప్పిచ్చువాడు వైద్యుడు..ఎపుడు ఎడతెగక పారున్ ఏరున్ ద్విజుడున్ అని మా గురువు చెప్పేవారు. పాలసంద్రంలోన పవళించెడివాడు..పరులిండ్ల పాలు కొనరేల..ఎదుటివారి సొమ్ము ఎల్లరికి తీపి అంటూ చాలా చక్కగా జీవితసారాన్ని చూపారు. అనగఅనగా రాగమతిశయిల్లుచుండు.. తినగతినగ వేము తియ్యనుండు..సాధనమున పనులు.. సమకూరు ధరలోన విశ్వధాబిరామ వినురవేమ అంటూ ఏ విధంగా కార్యాన్ని సాధించాలని చాలా గొప్పగా చెప్పేవారు. ఇలాకేసీఆర్ పద్యాల మాధుర్యం వివరిస్తుంటే వినేందుకు రెండుచెవులూ చాలవు.

అద్భుత పరిజ్ఞానం

కెసిఆర్ 8వతరగతిలో రాఘవరెడ్డి ఇంట్లో ఉండి చదువుకునేటపుడు పాఠశాలలో మృత్యుంజయశర్మ ఉత్తరగోగ్రహణం అని పాఠం చెప్పారు. కొన్ని కఠిన సమాసాలతో ఉన్న పద్యం చెప్పి.. దీని వ్యాకరణ, ఉచ్చారణ దోషం లేకుండా ఎవరు చెబితే వారికి నోట్‌బుక్ బహుమతి ఇస్తానన్నారు. అపుడు కేసీఆర్ వెంటనే ఐదుసార్లు చదివి ఇపుడే చెప్తా అన్నారు. అయితే చెప్పు అన్నారు. అక్కడే చదివి పద్యం చెప్పడంతో కేసీఆర్‌ను హెడ్మాస్టరు గదికి తీసుకెళ్ళి ఆయన చేతులమీదుగా నోట్‌బుక్ అందించి అభినందించారు. బాల్యం నుండే తెలుగుబాషపై అపారజ్ఞానాన్ని, పట్టును పెంపొందించుకున్నారు. ఇక వ్యాసరచనపోటీల్లో కవితాపోటీల్లో కేసీఆర్ అనేక బహుమతులు సాధించారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రపంచ తొలితెలుగు మహాసభల్లోనూ కేసీఆర్ వ్యాసరచనపోటీలో బహుమతి పొందడం విశేషం. ఎంతో కష్టమైన పనిని.. ఇష్టంగా నేర్చుకుంటూ వెళ్ళిన కెసిఆర్ వేల పుస్తకాలు చదివి జ్ఞానాన్ని ఔపోసన పట్టారు. తెలుగుబాషాసాహిత్యంతో పాటు రాజనీతిచరిత్ర పుస్తకాలను అంతే స్థాయిలో చదివి కాచివడపోశారు. ఆరంభించరు నీచమానవులు.. విఘ్నాయాస సంత్రుష్టులై.. ఆరంభించి పరిత్యజించురు.. పురువిఘ్నాయత్తుల మధ్యముల్ వీరుని విఘ్నని హిరజ్యమానులగుచున్.. ఇట్ల గొప్పగా అద్భుతపద్యాలు చెప్పే కేసీఆర్.. తెలుగుకు అద్భుతవైభోగం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. తెలుగుసబ్జెక్టును తప్పనిసరి చేయడంతో పాటు పండితులను ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందించారు. మాతృబాషపై ముఖ్యమంత్రి కేసీఆర్ చూపిన మమకారం.. చేపట్టిన చర్యలు ఇపుడు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి.





వైవిధ్యం కేసీఆర్ పథం

ప్రగతిభవన్... పాలనా క్షేత్రం



పరిపాలనలో ఒక్కో ముఖ్యమంత్రిది ఒక్కో శైలి. కొందరు ప్రజల మధ్యే తిరుగుతూ.. వారికి కావాల్సింది తెలుసుకుని ఇచ్చే ప్రయత్నం చేస్తుంటారు. మరికొందరు ప్రజల అవసరాలు గమనించి వారు అడగకముందే ఒక సమూహానికి కాకుండా.. అందరికీ అందేలా పథకాలు రచిస్తారు.. అట్టడుగు స్థాయి వరకు అవి అందే వ్యవస్థను రూపకల్పన చేస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ది విలక్షణ పంథా. ప్రగతిభవన్ కేంద్రంగా ఆయన విలక్షణ వ్యూహాలతో ఇటు అధికారవర్గాలను, సరికొత్త పథకాలతో ప్రజలను ఆశ్చర్యపరుస్తుంటారు. ప్రగతిభవన్‌నే పరిపాలనాకేంద్రంగా చేసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దినచర్య విలక్షణం. ఊహకు అందనిది.. సామాన్యుడికి తెలియనిది. ఈ భవన్‌లో ముఖ్యమంత్రి కెసిఆర్ గంటలు.. గంటలు ఏం చేస్తారు? ఇతర ముఖ్యమంత్రుల్లా అధికారులను గంటల తరబడి కూర్చోబెట్టి.. ప్రతిరోజూ సమీక్షలు పెట్టరు. మరీ అత్యవసరమైతే తప్ప హైదరాబాద్‌లో జరిగే ప్రారంభోత్సవాల్లో కూడా పెద్దగా హాజరుకారు. గత ముఖ్యమంత్రుల్లా ఎపుడూ జనంలో ఉండరు. జిల్లాల పర్యటనలు కూడా.. ఎపుడో నెలా, రెండుమాసాలకోసారి తప్ప.. తరచూ ఉండవు. ఇక ప్రజలను కూడా ప్రతిరోజూ నేరుగా కలవరు. సందర్శన సమయాలు ఇవ్వరు. మరి కేసీఆర్ ఏం చేస్తారు? రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి నెలకొన్న ఈ అంశానికి ఆంధ్రప్రభ సమాధానం వెతికే ప్రయత్నం చేసింది. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులకు భిన్నంగా కెసిఆర్ వ్యవహరిస్తున్న తీరు విభిన్నం. వినూత్నం. ప్రచార పటాటోపాలు.. హంగూ ఆర్భాటాలు.. జనసమీకరణ సభలకు దూరంగా ఉండే సిఎం ప్రగతిభవన్‌లో ఏం చేస్తుంటారు? ఎక్కడ సమస్య ఉత్పన్నమైనా.. ఏ నియోజకవర్గంలో ఏ నాయకుని వ్యవహార శైలి ఎలా ఉంది? ఏ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి? ఏవి పూర్తయ్యాయి? ఏవి ముందుకు కదలడం లేదు? ఎక్కడ ఎమ్మెల్యేలు ప్రజల మధ్య తిరుగుతున్నారు. ఎక్కడ కార్యకర్తలకు, ప్రజలకు దూరంగా ఉన్నారు? ఫలానా నియోజకవర్గంలో మన పరిస్థితేంటి.. ప్రత్యర్థి పరిస్థితేంటి? ప్లస్సేంటి.. మైనస్సేంటి.. ఇలాంటివన్నీ సిఎంకు ఎలా తెలుస్తున్నాయి? ఆసక్తికరమే.

అంతర్ముఖుడే కానీ..

సిఎం స్వతహాగా అంతర్ముఖుడు. ఇతర ముఖ్యమంత్రుల్లా కెసిఆర్ సచివాలయానికి వచ్చేందుకు ఆసక్తి చూపరు. ప్రజలను నేరుగా కలిసేందుకు పెద్దగా ఇష్టపడరు. అడపాదడపా జరిపే సమీక్షల సందర్భంగా టివిలలో చూడడమే తప్ప ప్రజలకు సిఎం ఎపుడు ఏం చేస్తున్నారో తెలియదు. ప్రగతిభవన్ కేంద్రంగా తెలంగాణ రాష్ట్రపరిపాలనను పర్యవేక్షించే ముఖ్యమంత్రి కేసీఆర్.. ప్రెస్‌మీట్ రూపంలోనో, ప్రగతిభవన్‌లో ఆయా వర్గాలతో సమావేశం జరిగినపుడో ప్రజలముందుకు వచ్చి తన ప్రగతిపథాన్ని ఆవిష్కరిస్తారు. ఇవితరహా జరిగేవి కావు. నెల, రెండుమాసాల కోసారి జరుగుతాయి. ఇవి మినహా సిఎం ప్రగతిభవన్‌లో రోజంతా ఏం చేస్తారన్న దానిపై ప్రజలకు పెద్దగా స్పష్టత లేదు. ప్రతిపక్షాలు అడపాదడపా దీనిపై విమర్శలు చేస్తుండగా, ప్రజల్లోనూ సిఎం కార్యనిర్వహణ ఎలా ఉంటుందన్న ఆసక్తి నెలకొంది. ప్రజల మధ్య ఉంటూ.. ఆర్భాటపు హామీలు ఇవ్వడం కన్నా.. ప్రజల అవసరాలు గుర్తించి వారి చెంతకు సంక్షేమాన్ని చేర్చడమే ఉత్తమమన్న పంథా కేసీఆర్ దని సన్నిహితులు చెబుతుంటారు.

నిరంతర మథనం..

ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ టేబుల్ వద్ద ప్రతిరోజూ రాష్ట్రంలో ఎంత విద్యుత్ డిమాండ్ ఉంది.. ఎంత సరఫరా జరిగింది.. వివరాలు ఉంటాయి. ఎప్పటికపుడు విద్యుత్ పరిస్థితిని తెలుసుకుంటూ.. విద్యుత్ డిమాండ్ పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిస్తుంటారు. రాష్ట్రం ఆవిర్భవించాక విద్యుత్ సమస్యను సవాల్‌గా తీసుకుని.. ఇలా నిరంతరం మనసుపెట్టి పరిశీలించబట్టే విద్యుత్ సమస్యను త్వరితగతిన తెలంగాణ అధిగమించింది. రైతులకు ఆరేడు గంటలు విద్యుత్ అందించడమే గగనమైన పరిస్థితి నుండి 24గంటలు ఉచితంగా విద్యుత్ అందించే పరిస్థితికి వచ్చింది. తెలంగాణ వస్తే కరెంట్ కష్టాలు తప్పవని.. దేశవ్యాప్తంగా అందరూ భావించగా, ఆశ్చర్యకరంగా కరెంట్ సమృద్ధిగా ఉన్న రాష్ట్రాలకంటే మెరుగైన సరఫరా అందించే స్థితికి తెలంగాణ చేరింది. ఇప్పటికీ సిఎం కేసీఆర్ ప్రతినిత్యం కరెంట్..గురించి తెలుసుకుంటూనే ఉంటారు. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పరుగెడుతున్నాయి. కేంద్రజలసంఘం నియమించిన కమిటీ దేశంలోని పెద్దప్రాజెక్టులలో ఒకటిగా చెప్పుకుంటున్న కాళేశ్వరం ఎత్తిపోతల పనులు చూసి ఆశ్చర్యపోయింది. ఈ ప్రాజెక్టును ఆమోదిస్తున్నాం.. అభినందిస్తున్నాం అంటూ ప్రకటించింది. ప్రగతిభవన్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ఒక పెద్ద తెర ఉంటుంది. కాళేశ్వరం బ్యారేజీల పనులు, పంపుహౌజ్‌ల పనులు అక్కడ ప్రత్యక్షంగా కనబడుతుంటాయి. ఎక్కడ ఎంత పని జరుగుతోంది.. ఏం జరుగుతోంది.. ఎవరు పనిచేస్తున్నారు? అంతా కళ్ళముందు కదలాడుతుంది. ఈ ప్రాజెక్టు నుండి ఖరీఫ్‌కు నీళ్ళివ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్ళలో 36లక్షల ఎకరాలకు సాగునీరందించే మహాప్రాజెక్టు నీళ్ళిచ్చేదిశగా కదులుతోంది. కరెంట్ తరహాలోనే సాగునీటి ప్రాజెక్టులపైనా.. సిఎం పరిశీలన రోజూ జరుగుతుంది. ఏ ప్రాజెక్టు ప్రోగ్రెస్ ఏంటి.. ఎపుడు ఫలితాలొస్తున్నాయ్.. ఎదురవుతున్న ఇబ్బందులేంటి? పరిష్కారాలేంటి? చర్చిస్తుంటారు. అనుమతుల విషయంలో సిఎం గంటగంటకూ పరిస్థితి తెలుసుకుంటూ.. సలహాలిస్తూ పరుగెత్తించిన ఫలితంగానే భారతదేశంలోనే తొలిసారి ఏడాదిలోనే 215రకాల అనుమతులు కాళేశ్వరం ప్రాజెక్టుకు లభించాయి. వాతావరణం ఎలా ఉంది.. రైతులకు ఎదురయ్యే ఇబ్బందులేంటి? సాగునీటి పరిస్థితేంటి..మార్కెట్లో ధరలు ఎలా ఉన్నాయి? ఎప్పటికపుడు ఆయా శాఖలు రంగంలోకి దిగిపోతుంటాయి. ఇదేంటి.. సీజన్ రాకముందే అధికారులు హడావుడి చేస్తున్నారని ముందు అనుకుంటారు.. ఒకటి, రెండు రోజుల్లోనే అయ్యో.. ప్రభుత్వం ముందుగా అప్రమత్తం చేయకపోయి ఉంటే నష్టపోయేవాళ్ళం అని రైతులు పలు సందర్భాల్లో చెప్పారు. నిరంతర మథనం ఫలితంగానే.. కరెంట్ సమస్య తీరింది.. సాగునీటిరంగంలో చారిత్రాత్మక విజయాలు లభిస్తున్నాయి. కొద్దిరోజుల్లోనే దీనిని కరెంట్ లాగే.. వాడుకున్నోళ్ళకు వాడుకున్నంత ఇవ్వాలనే వ్యూహ మథనం జరుగుతోంది. ప్రాజెక్టులకు ఎదురయ్యే సమస్యలపై గంటలతరబడి సమీక్షలు చేసి.. అధికారులను మందలించడం, అరవడం ఏవీ ఉండవు. ప్రతి పనినీ మస్తిష్కంలో పెట్టుకుని పరిశీలిస్తుంటారు. సమస్య ఉన్న చోటికి.. నేరుగా ఫోన్ ద్వారా లైన్‌లోకి వెళ్తారు. తగిన ఆదేశాలు ఇస్తారు. పరిష్కారానికి బృందాలను పంపుతారు. మిషన్ భగీరథ పథకం కూడా ఇలాగే. ఇంటింటికీ నల్లా నీళ్ళు ఇవ్వకుంటే వచ్చే ఎన్నికలలో ఓట్లు అడగనని ప్రతిజ్ఞ చేసిన సిఎం.. ఆ పనులను కూడా ప్రతిరోజూ సమీక్షిస్తుంటారు. ఆయన సమీక్షలు.. ప్రతిసారి అధికారయంత్రాంగాన్నంతా ఎదురుగా కూర్చోబెట్టుకుని చేయరు. అవసరమైన వారిని పిలిపించుకుంటారు. నేరుగా మాట్లాడేవారితో మాట్లాడుతారు. సమావేశాలు.. మర్యాదలు కాకుండా ఫలితాలను మాత్రమే చూస్తారు. ఏ జిల్లాలో.. ఏ ఇన్‌టేక్‌వెల్ పనులు ఎంత వరకు వచ్చాయి.. పైప్‌లైన్‌ల పనులు ఎంతవరకు వచ్చాయి.. సిఎం కళ్లముందు జాబితాలు, పనులు ఉంటాయి. ఎక్కడైనా పనుల్లో జాప్యాన్ని గుర్తిస్తే.. అవసరాన్ని బట్టి ప్రత్యేక బృందాలను వెళ్ళి రమ్మంటారు. అధికారులను, మంత్రులను కలిపి బృందాలుగా వెళ్ళమని ఆదేశిస్తారు. పరిస్థితి తెలుసుకుంటారు. ఫలితంగానే రూ.40వేల కోట్లకుపైగా విలువైన మిషన్ భగీరథ పనులు ఇంటింటికీ నల్లా నీరిచ్చేదిశకు చేరుతున్నాయి.

కేసీఆర్ @ 64 బర్త్‌డే స్పెషల్


మూడున్నరేళ్లు... 365 పథకాలు

అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్...

మిషన్ భగీరథ, కాకతీయ, పెట్టుబడి మద్దతు పథకాలు ఆదర్శం

అన్ని రంగాలకూ సముచిత ప్రాధాన్యత

దేశంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు, కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలే కాకుండా మరెన్నో కార్యక్రమాలను చేపట్టి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అగ్రగామిగా నిలిచారు. ప్రభుత్వం ఏర్పాటైన ఈ మూడున్నరేళ్ళ కాలంలో 365 పథకాలను ప్రారంభించి అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కింది. ప్రభుత్వం విజయవంతంగా అమలుచేస్తున్న కొన్ని పథకాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నాయి. ముఖ్యంగా ఇంటింటికీ రక్షిత మంచి నీటిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ ప్రారంభించిన మిషన్ భగీరథ, చెరువుల మరమ్మతులకు చేపట్టిన మిషన్ కాకతీయ పథకాలు ప్రతిష్ఠాత్మకంగా, ఆదర్శవంతంగా మారాయి. ఈ ఏడాది ఖరీఫ్ నుంచి అమలు చేయనున్న ప్రభుత్వం ఏర్పాటైన రోజునుంచే తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా చేయాలన్న సీఎం కేసీఆర్ కలలు నిజమవుతున్నాయి. సమాజంలోని అన్ని వర్గాలకు చేయూతనిచ్చి అడిగిందే తడవుగా ఆయా వర్గాలకు పథకాలను అమలు చేస్తున్న ఘనత కూడా సీఎం కేసీఆర్‌కే దక్కింది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని విధంగా మెట్రోరైల్ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించి సీఎం కేసీఆర్ శభాష్ అనిపించుకున్నారు.



త్వరలోనే రెండో విడత మెట్రో రైల్ ప్రారంభానికి అవసరమైన పనులను ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. బంగారు తెలంగాణ సాధనే ధ్యేయంగా పని చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం వచ్చే ఏడాదిన్నర కాలంలో మరిన్ని నూతన పథకాలకు, కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. పంచాయితీరాజ్ వ్యవస్థను పటిష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. అందులో భాగంగానే నూతన పంచాయితీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చేందుకు భారీ ఎత్తున నిధులను వెచ్చిస్తున్న సంగతి తెలిసిందే. పాలనను ప్రజల ముంగిటకు తీసుకువెళ్ళాలన్న లక్ష్యంతో గత ఏడాది దసరా రోజున 21 కొత్త జిల్లాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా లక్షా 8వేల ఖాళీల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వైద్య ఆరోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న సీఎం కేసీఆర్ ఆరువేలకుపైగా వైద్యుల ఖాళీల భర్తీకి శ్రీకారం చుట్టింది. గ్రామీణ స్థాయిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పటిష్టంచేసే దిశగా చర్యలు చేపట్టిన ప్రభుత్వం ఈ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తోంది.

దేశానికి రైతే వెన్నుముక అనే నానుడిని నిజం చేయాలని ఏడాదికి రైతు పంటలు వేసుకునేందుకు రూ.8వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. నిజాం కాలంలో భూ సర్వే చేపట్టారని భూములకు సంబంధించిన వివరాలు ప్రభుత్వం దగ్గర ఆశించిన స్థాయిలో లేవని ఒక నిర్ణయానికి వచ్చిన సీఎం కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లోని భూములను పరిశీలించి వాటి నివేదికలు తెప్పించే పనిలో నిమగ్నమయ్యారు. రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు వీలుగా ప్రతి గ్రామంలో వ్యవసాయాధికారిని నియమించి వారు ఎటువంటి పంటలు పండించాలి, గిట్టుబాటు ధరలు ఎలా ఇప్పించాలన్న అంశంపై ప్రభుత్వం వీరిని నియమించి వారిద్వారా సలహాలు, సూచనలు చేస్తోంది. బలహీన వర్గాలతో పాటు అల్పసంఖ్యాక వర్గాలకు చెందిన పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యాబుద్ధులు నేర్పించేందుకు రాష్ట్రంలో భారీ ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. త్వరలోనే ప్రతి నియోజకవర్గంలో గురుకుల పాఠశాలతో పాటు జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం నడుం బిగించింది. వైద్యవిద్యను అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా ఇప్పటికే సిద్దిపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో త్వరలోనే మరో రెండు వైద్య కళాశాలలను ప్రభుత్వరంగంలో ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. పేదింటి పిల్లల వివాహాలను జరిపించేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబంలో వెలుగులు నింపేందుకు సీఎం కేసీర్ కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలను చేపట్టి దేశంలోనే అగ్రగామిగా నిలిచారు. మిగతా రాష్ట్రాలు కూడా ఈ తరహా పథకాలను అమలు చేయాలన్న నిర్ణయానికి వచ్చాయి. ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల వివాదానికి కూడా కేసీఆర్ పరిష్కారమార్గం చూపించారు. ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్యం తమ ప్రథమ కర్తవ్యమని భావించిన ప్రభుత్వం వారికోసం ప్రత్యేకంగా వెల్నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. గతంలో అమలైన జోనల్ విధానానికి గుడ్‌బై చెప్పింది.

పురపాలక సంఘాల్లో ఉంటున్న ప్రజలకు కేవలం రూపాయికే మంచినీటి కనెక్షన్‌ను అందించి తమది పేదల సంక్షేమ ప్రభుత్వంగా కేసీఆర్ గుర్తింపు తెచ్చుకున్నారు. వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు సన్నబియ్యంతో మూడు పూటలా భోజన వసతి కల్పిస్తోంది.

నకిలీ ఎరువులు, విత్తనాలు, పాలు తదితర ఆహార పదార్థాలను కల్తీచేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న వారి భరతం పట్టేందుకు రంగంలోకి దిగిన ప్రభుత్వం అటువంటి వారిపై పీడీ చట్టాన్ని ప్రయోగించాలని నిర్ణయించింది. ఈ మేరకు శాసనసభలో చట్టం కూడా తీసుకువచ్చింది. కొత్త సంవత్సరం రోజున రాష్ట్రంలోని రైతాంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలో గృహావసరాలకు ప్రభుత్వం నిరంతర విద్యుత్‌ను ఇప్పటికే అందిస్తోంది. బీసీ సంక్షేమానికి పెద్దపీట వేయాలని భావించిన ప్రభుత్వం త్వరలోనే బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం రాష్ట్రంలో యాదవులు, కురవలకు 70 శాతం సబ్సిడీపై గొర్రెలు పంపిణీ చేస్తుండగా, మత్స్యకారులకు వందశాతం సబ్సిడీతో చేప పిల్లలను అందిస్తున్న సంగతి తెలిసిందే.

రాష్ట్రంలో కల్లు దుకాణాలను పునరుద్ధరించడంతోపాటు రజకులు, నాయీ బ్రాహ్మణులకు చేయూతనిస్తోంది. నాయీ బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు గృహావసరాలకు ఇచ్చే విద్యుత్ టారిఫ్‌ను అమలు చేయాలని, బీసీ విద్యార్థులు విదేశీ విద్యకోసం ఆయా దేశాలకు వెళితే వారికి ఆర్థికసాయం చేయాలని ఇందుకోసం మహాత్మా జ్యోతిబాపూలే పేరుతో ప్రభుత్వం విద్యానిధిని ఏర్పాటు చేసింది. ప్రతి పేదవాడికి ఉండడానికి ఇల్లు కల్పించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు శ్రీకారం చుట్టింది. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రూ.25వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వం ప్రాజెక్టుల ఆకృతులను మార్చి కోటి ఎకరాలకు నీరందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పారిశ్రామిక విధానంపై ఎల్లెడలా హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచంలోని పేరొందిన పారిశ్రామికవేత్తలు ఈ నూతన పారిశ్రామిక విధానాన్ని స్వాగతించి రాష్ట్రంలో భారీఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ధ్యేయమని తరచూ చెప్పే ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రంలో పోలీస్ శాఖకు భారీఎత్తున నిధులు కేటాయించడంతో పాటు పోలీసుల సంక్షేమానికి పెద్దఎత్తున పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీని ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఇటీవలె వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్కుకు శ్రీకారం చుట్టింది.

సంక్షేమ కార్యక్రమాలు

ఆదాయ పరిమితి పెంపు, ఆసరా పెన్షన్లు, బీడీ కార్మికులకు భృతి, కల్యాణలక్ష్మీ/షాదీ ముబారక్, వడదెబ్బ మృతులకు అపద్బంధు, ప్రకృతి వైపరీత్యాలు మృతులకు రూ.5 లక్షలు, మునిసిపాలిటీల్లో రూపాయికే నల్లా కనెక్షన్, ఎకనమిక్ సపోర్టు స్కీమ్ సబ్సిడీ పెంపు, విద్యార్థులకు సన్నబియ్యం, ఆరు కిలోల బియ్యంవ్యవసాయం, రైతు సంక్షేమం, రుణమాఫీ, సకాలంలో ఎరువులు, విత్తనాలు, నకిలీ, కల్తీకి పాల్పడే వారిపై పీడీ చట్టం, రైతులకు ఉచితంగా ఎరువుల పంపిణీపై రూ.8వేలు, పసుపుసాగు, సైన్స్ పార్కు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల ఏర్పాటు, ఆయిల్‌పాం సాగు, ఇంటర్నెట్ ద్వారా వ్యవసాయ సమాచారం, భూసార పరీక్షలు, సాదా బైనామాలు, 11 లక్షల మంది, హెచ్ఎండిఏ, కుడా పరిధిలోని వ్యవసాయ భూములకు సాదాబైనామా, ప్రతి ఐదువేల ఎకరాలకు ఒక వ్యవయాధికారి, రాష్ట్రీయ కృషి వికాస యోజన ఏర్పాటు, మైక్రో ఇరిగేషన్,



గ్రీన్‌హౌస్ ఏర్పాటుకు 75శాతం సబ్సిడీ, ఫాం మెకనైజేషన్ కోసం రూ.420 కోట్లు కేటాయింపు, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం ఏర్పాటు, రామగుండం ఎరువుల పరిశ్రమ పునరుద్ధరణ, హార్టికల్చర్ కార్పొరేషన్, ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్, అటవీ కళాశాల, మూడు వ్యవసాయ పాలిటెక్నిక్‌లు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎర్రజొన్న రైతులకు రూ.9.5 కోట్లు, గోదాముల నిర్మాణం, రైతులకు వడ్డీలేని రుణం, మార్కెట్లలో సద్దిబువ్వ రూ.5కే భోజనం, మార్కెట్లలో హమాలీల కూలీరెట్ల పెంపు, గ్రీన్‌హౌస్ సబ్సిడీ, వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరా, కొత్తగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, మార్కెట్ కమిటీలలో రిజర్వేషన్లు, విత్తన భాండాగారంగా తెలంగాణ, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, మార్కెట్ యార్డు, కార్మికులకు వరాలు, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.6 లక్షలు.

సామాజిక వర్గాల సంక్షేమం

న్యాయవాదులకు రూ.100 కోట్లు, ప్రభుత్వ లాయర్ల గౌరవ వేతనం పెంపు, ట్రాక్టర్, ఆటోలపై రవాణాపన్ను రద్దు, జర్నలిస్టుల సంక్షేమానికి రూ.50 కోట్లు, పేద బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.100 కోట్లు, తెలంగాణ అమరవీరులకు రూ.10 లక్షలు, ఉద్యోగం, జర్నలిస్టులు, హోంగార్డులు, డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులకు రూ.5లక్షల ప్రమాదబీమా, గీత, మత్స్య కార్మికులకు రూ.5 లక్షల ప్రమాద బీమా, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి చర్యలు

మహిళా, శిశు సంక్షేమం

ఆరోగ్యలక్ష్మీ పోషకాహారం, ఐసిడిఎస్ సిబ్బందికి శిక్షణా తరగతులు, దీపం పథకం, అమ్మఒడి పథకం, అంగన్‌వాడీల జీతాలు 150శాతం పెంపు, ఆశావర్కర్లు జీతాలు రూ.6వేలకు పెంపు, ప్రసవానికి రూ.12వేల ఆర్థిక సహాయం, కేసీఆర్ కిట్లు, ఒంటరి మహిళలకు రూ.1000 భృతి, శ్రీనిధి, 10 లక్షల వరకు వడ్డీలేని రుణం, షీ టీమ్స్, మహిళా రక్షణ మిషన్.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమం

దళితులకు మూడెకరాల భూమి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్, ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు రాయితీలు, టిఎస్ ప్రైడ్, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ప్రగతి నిధి, తెలంగాణలో 62శాతం రిజర్వేషన్లు, గ్రామ పంచాయితీలుగా గిరిజన తండాలు, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు, ఎస్సీ, ఎస్టీలకు నేరుగా నిధులు, ఎస్టీల కోసం చల్లప్ప కమీషన్.

మైనారిటీల సంక్షేమం

మైనారిటీలకు 12శాతం రిజర్వేషన్లు, గురుకులాలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం, ఉపకార వేతనాలు, ఓన్ యువర్ ఆటో, మొదటి లాంగ్వేజ్ ఆప్షన్‌గా ఉర్దూ భాష, ఉర్దూలో నీట్ నిర్వహణ, మైనారిటీ శాఖలో ఉద్యోగాల భర్తీ, ప్రత్యేక వక్ఫ్‌బోర్డు ఏర్పాటు, సుధీర్ కమీషన్, ఇమామ్, మౌజంలకు రూ.1000 భృతి, ఇస్లామిక్ సెంటర్ కమ్ కన్వెన్షన్ హాల్, ఉర్దూలో ప్రత్యేక డిఎస్సీ.

బీసీల సంక్షేమం

బీసీ కమీషన్, ఎంబిసి ఫైనాన్స్ కార్పొరేషన్, బీసీలకు 119 ఆశ్రమ పాఠశాలలు, గొర్రెల పెంపకం, మత్స్య పరిశ్రమాభివృద్ధికి మంత్రివర్గ ఉపసంఘం, 75శాతం సబ్సిడీతో గొర్రెల పంపిణీ, 100 శాతం సబ్సిడీతో చేప పిల్లల పెంపకం, చేనేత కార్మికుల సంక్షేమం, కల్లు దుకాణాల పునరుద్ధరణ, రజకులకు, నాయీ బ్రాహ్మణులకు చేయూత, పవర్‌లూం కార్మికులకు రుణాలు మాఫీ, సెలూన్లకు గృహ కేటగిరి విద్యుత్, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ విదేశీ విద్యానిధి.

ఉద్యోగుల సంక్షేమం

ఎంప్లాయిస్ ఫ్రెండ్లీ గవర్నమెంట్, పదవీ విరమణ రోజునే పెన్షన్, కారుణ్య నియామకాలు, ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులపై నిషేధం ఎత్తివేత, ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్, ఉద్యోగులు, జర్నలిస్టులకు వెల్‌నెస్ సెంటర్లు, ఏకీకృత సర్వీస్ రూల్స్‌కు ప్రభుత్వం ఆమోదం, జోనల్ విధానం రద్దు, ఐకేపీ ఉద్యోగులకు వేతనాలు పెంపు, 776 మంది గురుకుల టీచర్ల సర్వీసుల క్రమబద్ధీకరణ, భాషా పండితులను, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి, ఉద్యోగులకు, పెన్షనర్లకు హెల్త్‌కార్డులు, వీఆర్ఏల జీతాలు 64.61 శాతం పెంపు, వీఏవోల వేతనం పెంపు, జలమండలి ఉద్యోగుల వేతన సవరణ, కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల వేతనాల పెంపు, సకల జనుల సమ్మె కాలం ప్రత్యేక సెలవు, ఔట్స్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపు, కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ, కాంట్రాక్టు లెక్చరర్ల జీతాలు 100శాతం పెంపు, నరేగా, సెర్ప్ ఉద్యోగుల వేతనాలు పెంపు, 90 రోజుల చైల్డ్ కేర్ లీవ్.

రాజధాని నగరాభివృద్ధి

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం, హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, ఎస్ఆర్‌డిపి ఏర్పాటు, హైదరాబాద్ నాలుగు వైపుల ఎక్స్‌ప్రెస్ హైవేలు, మెట్రోరైల్ ప్రాజెక్టు, స్వచ్ఛ హైదరాబాద్, హరితహారం, పారిశ్రామిక కాలుష్యరహిత హైదరాబాద్ ఏర్పాటు, మురుగు నీటి వ్యవస్థ ఏర్పాటు, పేదల విద్యుత్ బకాయిల మాఫీ, జీవో నెంబర్ 58 ప్రకారం లక్షా 25వేల మంది ఇళ్ళ పట్టాలు, హైదరాబాద్‌లో పేదల నల్లా నీటి బకాయిల మాఫీ, రూ.5కే పేదలకు కడుపునిండా భోజనం, ఆస్తిపన్ను తగ్గింపు, మినహాయింపు, ఈ-ఆఫీస్ నిర్వహణ, డీపీఎంఎస్ ఏర్పాటు, మై జిహెచ్ఎంసి యాప్, ఎల్ఈడీ లైట్లు, మోడల్ మార్కెట్ల నిర్మాణం, క్రీడారంగం అభివృద్ధి, డ్రైవర్లకు సొంతకార్లు, జిహెచ్ఎంసి కార్మికుల వేతనాలు పెంపు, నీటి అవసరాలు తీర్చడానికి రెండు రిజర్వాయర్లు, స్మార్ట్ హైదరాబాద్‌కు శ్రీకారం, సిస్కోతో ఒప్పందం, ఏసీ మెట్రో లగ్జరీ బస్సులు, వరంగల్, బెంగళూరు, విజయవాడ మార్గాలకు ఎలివేటెడ్ కారిడార్లు.

మౌలిక సదుపాయాల అభివృద్ధి

కొత్తల్లేని విద్యుత్ సరఫరా, మిగులు రాష్ట్రంగా తెలంగాణ, మిషన్ భగీరథ, తెలంగాణకు హరితహారం, రవాణా రహదారులు, భవనాలు, జాతీయ రహదారుల విస్తరణ, హైదరాబాద్‌శివార్లలో రీజినల్ రింగ్‌రోడ్డులు, రూ.8వేల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, తెలంగాణ రూరల్ రోడ్డు డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు, వాగులు, వంకలు, రైల్వేలైన్లపై వంతెనలు, మనోహరాబాద్ - కొత్తపల్లి రైల్వేలైన్ ఏర్పాటు.

వైద్య, ఆరోగ్య రంగం

శాశ్వత పోలియో పరిష్కారం, అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయికి పెంపు, కేంద్ర, ఏరియా ఆసుపత్రుల్లో 20 ఐసీయూ కేంద్రాల ఏర్పాటు.

పారిశ్రామిక రంగం

పరిశ్రమల ఏర్పాటులో తెలంగాణ, టిఎస్ ఐపాస్, సింగిల్ విండో పారిశ్రామిక విధానం, జహీరాబాద్‌లో నిమ్జ్, తరలివస్తున్న పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లాలో జాతీయ ఫార్మాకోపియా కమీషన్, రూ.250 కోట్లతో అమ్యూజ్‌మెంట్ పార్కు, టిఎస్ ప్రైమ్, టిఎస్ ప్రైడ్ ఏర్పాటు, ఫార్మాసిటీ ఏర్పాటు, స్థిరాస్తి రంగంపై వరాలు, వరంగల్ టెక్స్‌టైల్ పార్కు, రియల్ ఎస్టేట్ రంగానికి చేయూత, రాయితీలు, రూ.270 కోట్లతో 9 లెదర్ పార్కులు, ఆటోమొబైల్ రంగం అభివృద్ధి.

ఇతర సంక్షేమ కార్యక్రమాలు

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ, ఉద్యమకారులపై కేసుల ఎత్తివేత, తెలంగాణ రాష్ట్రం ప్రణాళికా సంఘం ఏర్పాటు, మాసాయిపేట దుర్ఘటనలో ప్రభుత్వ స్పందన, అమల్లోకి కొత్త భూసేకరణ చట్టం, సీఎం నూతన అధికారిక నివాసం ప్రగతి భవన్, ఏపీ సచివాలయం భవనాలు తిరిగి ఇవ్వాలని కోరుతూ తీర్మానం, విభజన సమస్యల పరిష్కారానికి ముగ్గురు సభ్యులతో కమిటీ, సమగ్ర సామాజిక కుటుంబ సర్వే, దుబ్బాకపై వరాలు, యువతకు ట్రాక్టర్ల పంపిణీ, పెరిగిన రాష్ట్ర వృద్ధిరేటు, నాలా పనులు తగ్గింపు, సమగ్ర పౌర సమాచార నిధి, పట్టణ సర్వీసుల ఏకీకృతం, గ్రేటర్ వరంగల్ ఏర్పాటు, కరీంనగర్ సమగ్రాభివృద్ధికి చర్యలు, స్థానిక ప్రజా ప్రతినిధుల జీతాల పెంపు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు పెంపు, సమీకృత జిల్లా కలెక్టరేట్లు, గోల్కొండలో స్వాతంత్ర్య దినోత్సవం, ఫుట్‌పాత్ వ్యాపారులకు సహాయం, అమరవీరుల స్మృతిచిహ్నం.

పంచాయితీరాజ్

గ్రామజ్యోతి, మన ఊరు - మన ప్రణాళిక, పల్లెప్రగతి, మనఊరు - మన కూరగాయలు.

సాంస్కృతికం, క్రీడలు, పర్యాటకం

తెలంగాణ సాంస్కృతిక సారధి, చలనచిత్ర పురస్కారాలకు తెలంగాణ పేరు, ఓయూ శతాబ్ది ఉత్సవాలు, ప్రపంచ తెలుగు మహాసభలు.

ప్రముఖులకూ ప్రాధాన్యత

మాజీ ప్రధాని పీవీ నరసింహరావు, కాళోజీ నారాయణరావు, దాశరథి కృష్ణమాచారి, నవాబ్ అలీ నవాజ్ జంగ్, ఈశ్వరీబాయి, జి.వెంకటస్వామి జయంతి, వర్ధంతి, కొమరంభీమ్ వర్ధంతి, కొండా లక్ష్మణ్ బాపూజీ.

విద్యాసంస్థలకు ప్రముఖుల పేర్లు

వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆచార్య జయశంకర్ పేరు, హెల్త్ యూనివర్సిటీ కాళోజీ నారాయణరావు పేరు.

జాతరలు, పుష్కరాలు

ఘనంగా గోదావరి, కృష్ణా పుష్కరాలు, మేడారం జాతరకు ఏర్పాట్లు, దూపదీప నైవేద్యం పథకం, దూపదీప నైవేద్యం నిధుల పెంపు, అర్చకులకు రూ.8వేల కనీస వేతనం, కొత్తగా పర్యాటక విధానం.

ప్రముఖుల పేరిట భవనాలు

దొడ్డి కొమురయ్య కురుమ మెమోరియల్, బంజారా ఆదివాసీలకు హైదరాబాద్‌లో భవన నిర్మాణం, అర్చకులకు ప్రత్యేకంగా బ్రాహ్మణ భవన్, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు, అజ్మీర్ దర్గా వద్ద రూ.5 కోట్లతో వసతి గృహం, శబరిమలలో 5 ఎకరాల స్థలం, హైదరాబాద్‌లో కేరళ భవన్, రూ.5 కోట్లతో లింగాయత్ భవన్, క్రిస్టియన్ భవన నిర్మాణానికి రూ.10 కోట్లు.

క్రీడాకారుల సంక్షేమం

అంతర్జాతీయ క్రీడాకారులకు ప్రోత్సాహం పెంపు, ఒలంపిక్ విజేతలకు నజరానాలు, సానియామీర్జా తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్, క్రీడా విధానాల రూపకల్పనకు చర్యలు, ఎవరెస్ట్ విజేతలకు నగదు ప్రోత్సాహం, ప్రముఖ క్రీడాకారులకు రూ.10వేల పెన్షన్.

-రాజేష్ జైన్

కార్మిక సంక్షేమం

ఆర్టీసీకి రూ.750 కోట్లు, ఉద్యోగులకు 44శాతం ఫిట్‌మెంట్, ఆర్టీసీ కార్మికులకు ప్రత్యేక ఇంక్రిమెంట్, కార్మికులు మరణిస్తే అంత్యక్రియలు ఇచ్చే సాయం రూ.20వేలకు పెంపు, విద్యుత్‌శాఖ ఉద్యోగులకు 27.5 శాతం ఫిట్‌మెంట్, విద్యుత్ ఉద్యోగులకు పీఆర్సీ, విద్యుత్‌శాఖలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ.



ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం

డిజిటల్ తెలంగాణ, ఐటి పాలన, టీ-హబ్, ఇంక్యుబేటర్. టిఎస్‌పిఎస్సీ ఏర్పాటు, కొత్త ఉద్యోగాల భర్తీ.





పోలీసు సంక్షేమం

హోంగార్డుల జీతాల పెంపు, ట్రాఫిక్ పోలీసులకు కాలుష్య అలవెన్స్, పోలీస్ వ్యవస్థ ఆధునీకరణ, జైళ్ళ సంస్కరణలపై సబ్‌కమిటీ, నగరంలో టాస్క్‌ఫోర్సులు, పోలీసులకు కొత్త వాహనాలు, హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ నూతన భవనం, కొత్తగా పోలీస్ కమీషనరేట్లు, గిన్నీస్ బుక్‌లోకి వరంగల్ పోలీస్ కమీషనరేట్, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో 10శాతం పోలీసులకు, పోలీస్ స్టేషన్ల నిర్వహణ వ్యయం భారీగా పెంపు, పోలీస్ అమరవీరుల ఎక్స్‌గ్రేషియా పెంపు, సైనికుల సంక్షేమానికి ప్రాధాన్యత, ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో రిజర్వు బెటాలియన్, 15వేల పోలీసు ఉద్యోగాల భర్తీ, పోలీస్ శాఖ నియామకాల్లో వయోపరిమితి మూడేళ్ళ సడలింపు.



నీటి పారుదల రంగం

మిషన్ కాకతీయ, జీయో ట్యాగింగ్, ఫీడర్ ఛానల్స్, తెలంగాణ జల సమగ్ర వినియోగ విధానం, బడ్జెట్‌లో సాగునీటి పారుదలశాఖకు రూ.25వేల కోట్లు, సమగ్ర మైనింగ్ విధానం, ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల పూర్తి, ఎస్ఆర్ఎస్‌పి కాల్వకు మరమ్మతులు, ఉపరితల ఓడరేవులు, ప్రాజెక్టుల రీడిజైనింగ్, నల్గొండ జిల్లా కాల్వల పునరుద్ధరణకు రూ.285 కోట్లు మంజూరు, కాళేశ్వరం, సీతారామ భక్తరామదాసు ప్రాజెక్టుల నిర్మాణానికి మహారాష్ట్రతో ఒప్పందాలు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, ప్రాజెక్టుల నుంచి మంచినీరు, పరిశ్రమలకు నీరు.

విద్యార్థుల సంక్షేమం

ఫీజు రీయింబర్స్‌మెంట్, రెసిడెన్షియల్ స్కూళ్ళ ఏర్పాటు, పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, విదేశీ విద్యకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్, విద్యార్థులకు మెస్ ఛార్జీల పెంపు, ప్రభుత్వ స్కూళ్ళలో ఆంగ్ల మాధ్యమంలో బోధన, ప్రభుత్వ స్కూళ్ళలో డిజిటల్ తరగతులు, గజ్వేల్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు రూ.104 కోట్లు, హైదరాబాద్‌లో ఏరో వర్సిటీ, బాల్కొండలో స్పైస్ బోర్డు, వరంగల్‌లో వ్యవసాయ కళాశాల, మామనూరులో వెటర్నరీ కళాశాల, ఎస్సీ, ఎస్టీ బీసీ స్టడీ సర్కిళ్ళ ఏర్పాటు, వరంగల్‌లో హెల్త్ యూనివర్సిటీ, మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు, అంతిమ యాత్ర వాహనాలు, వరంగల్‌లో గిరిజన విశ్వవిద్యాలయం, వరంగల్‌లో సైనిక స్కూల్, కొత్తగా ఏడు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, నిజామాబాద్‌లో ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల.





ఆలయాల అభివృద్ధి

వేములవాడ, యాదగిరిగుట్ట, దేవాలయాల అభివృద్ధి, యాదాద్రికి ఎంఎంటిఎస్, భద్రాద్రి డెవలప్‌మెంట్ అథారిటీ, నాగార్జునసాగర్ బౌద్ధక్షేత్రం అభివృద్ధి, అధికారికంగా తెలంగాణ పండుగలు, తెలంగాణ పండులకు అధికార హోదా, బతుకమ్మ రికార్డు, బక్రీద్, రంజాన్, క్రిస్మస్‌లకు రెండు రోజుల సెలవు, దేవాదాయ అర్చకులకు వేతన వ్యవస్థ, తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నాలు, తెలంగాణ మొక్కులు, ప్రభుత్వ దేవాలయాలకు సమర్పించనున్న అభరణాలు, తెలంగాణ శాస్త్రా, సాంకేతిక మండలి ఏర్పాటు, అతిపెద్ద జాతీయ జెండా, తెలంగాణ అవతరణ దినోత్సవ ఉత్సవాలు, మహిళా దినోత్సవం నిర్వహణ, జూన్ 2న ప్రభుత్వ ఆవిర్భావ దినోత్సవం.

కేసీఆర్ @ 64 బర్త్‌డే స్పెషల్

ప్రజామోదగ్రాఫ్ పైపైకి

రాజకీయ పండితులను నివ్వెరపరుస్తున్న కేసీఆర్ | సామాన్యుడి హృదయ స్పందన తెలిసిన సిఎం | నాలుగేళ్ళుగా విజయపరంపర | ఇటు సంక్షేమం.. అటు రాజకీయ వ్యూహం | 2019లక్ష్యంగా దూకుడు

కేసీఆర్ రాజకీయం వేరు.. వ్యూహం వేరు. తలపండిన రాజకీయ నేతలకే ఒకపట్టాన అర్థం కాని కెసిఆర్.. ప్రజామోదగ్రాఫ్ పైపైకి ఎగబాకుతోంది. దేశంలోని ఇతర రాష్ట్రాల నేతలను అబ్బురపరుస్తోంది. సామాన్యుల అంతరంగం తెలిసిన హృదయం.. అద్భుత వ్యూహం.. క్షేత్రంలో దానికి తగ్గ ఆచరణతంత్రం.. వెరసి కెసిఆర్ అతితక్కువ వ్యవధిలోనే తిరుగులేని జనాదరణను తీసుకొచ్చింది. టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి దాదాపు.. నాలుగేళ్ళు కావొస్తుండగా.. అనేక సంచలన విజయాలతో సరికొత్తరికార్డులు నమోదుచేశారు. దేశం తెలంగాణవైపు చూసేలా చేశారు. ఎన్నిక ఏదైనా.. క్షేత్రం ఏదైనా..తిరుగులేని విజయాలతో టిఆర్ఎస్‌ను అగ్రపథాన నిలిపారు. నూతన రాష్ట్రంలో తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసిన టీఆర్ఎస్ గడచిన నాలుగేళ్ళలో అప్రతిహత విజయాలతో దూసుకెళ్తోంది. 2019ఎన్నికలే లక్ష్యంగా దూకుడుగా..ధీమాగా దూసుకెళ్తోంది. తిరుగులేని పాలనతో దేశం చూపును తనవైపుకు తిప్పుకున్న కేసీఆర్ శనివారం 64వ జన్మదినం జరుపుకోనుండగా.. రాజకీయంగా ఆయన సాధించిన సంచలనాలు, పార్టీని తిరుగులేని శక్తిగా నిలిపిన విజయాలు.. ఆంధ్రప్రభ పాఠకులకు ప్రత్యేకంగా..

అప్రతిహత జైత్రయాత్ర

కేసీఆర్ నాయకత్వంలో టిఆర్ఎస్ గడచిన 45మాసాల పాలనలో అనేక అద్భుతాలు సాధించింది. ప్రత్యర్థులు పోటీకే భయపడేంత రికార్డులు సృష్టించింది. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో.. గడచిన 45మాసాల ప్రయాణంపై గులాబీపార్టీ అత్యంత సంతోషంగా ఉంది. ఇటు రాజకీయంగా.. అటు పాలనాపరంగా అనేక మైలురాళ్ళు అధిగమించి దేశం దృష్టిని ఆకర్షించింది. 75లక్షలకు పైగా సభ్యత్వం కలిగిన ఏకైక రాజకీయపార్టీగా చరిత్ర సృష్టించిన టీఆర్ఎస్.. వరుస జైత్రయాత్రలతో విజయమే అబ్బురపడేలా విజయదుందుభి మోగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో పది అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన టీఆర్ఎస్ రాష్ట్రశాసనసభకు జరిగిన తొలి ఎన్నికల్లో 63స్థానాలు సాధించి.. ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించి ప్రభుత్వాన్ని ఏర్పరచింది. ఆ తర్వాత ఉప ఎన్నికలు, వరుస విజయాలతో.. తిరుగులేని రాష్ట్ర సమితిగా చరిత్ర సృష్టిస్తోంది. ప్రస్తుతం 119స్థానాలున్న అసెంబ్లీలో 91స్థానాలతో.. తిరుగులేని దరహాసం ప్రదర్శిస్తోంది. మొత్తం 40సీట్లున్న శాసనమండలిలో 29స్థానాలు సాధించింది. రాష్ట్రంలోని మొత్తం పది జడ్పీలతో పాటు జిహెచ్ఎంసిలోని 150డివిజన్లకు 99డివిజన్లలో విజయఢంకా మోగించింది.

ప్రతి ఎన్నికా.. ప్రత్యేకమే

కేసీఆర్ అపర చాణక్యుడు. అధికారంలోకి వచ్చామని పొంగిపోలేదు. ఏ ఎన్నికనూ ఆషామాషీగా తీసుకోలేదు. ప్రతి ఎన్నికకూ.. ప్రత్యేక వ్యూహాన్ని అవలంభించి ప్రత్యర్థుల మైండ్‌బ్లాక్ చేశారు. విజయమే అబ్బురపడేలా.. మెదక్ నుండి పాలేరు దాకా టీఆర్ఎస్ జైత్రయాత్ర కొనసాగించారు. సాధారణ ఎన్నికల నుండి మొదలైన టిఆర్ఎస్ జైత్రయాత్ర ఓటమి ఎరుగకుండా.. అప్రతిహతంగా కొనసాగుతోంది. ముఖ్యమంత్రి రాజీనామాతో ఖాళీ అయిన మెదక్ పార్లమెంట్ స్థానానికి జరిగిన ఎన్నికలో టీఆర్ఎస్ ఎదురులేని విజయం సాధించగా, ఆ తర్వాత జరిగిన వరంగల్ పార్లమెంట్ ఉప ఎన్నికలో.. దేశంలోనే రికార్డు మెజారిటీ సాధించింది. నారాయణఖేడ్, పాలేరు ఉప ఎన్నికలో.. అదే జోరు కొనసాగించింది. ఉనికిలేదన్న ఖమ్మం జిల్లాలో.. చారిత్రాత్మక విజయం సాధించింది. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికల్లో.. 150డివిజన్లకు గాను 99డివిజన్లు సాధించి, కొత్త చరిత్ర సృష్టించింది. వరంగల్ మునిసిపల్ కార్పోరేషన్, ఖమ్మం మునిసిపల్ కార్పోరేషన్‌లను సునాయాసంగా గెలుచుకుంది. ఈ విజయాలే.. దేశ నేతలను నివ్వెరపరిచాయి. కేసీఆర్ రాజకీయ వ్యూహాలను అధ్యయనం చేసేలా చేశాయి.

75లక్షల సభ్యత్వంతో రికార్డు..

టీఆర్ఎస్ 75లక్షలకు పైగా సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద ప్రాంతీయ పార్టీగా గుర్తింపుపొందింది. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు జనామోదం వెల్లువెత్తుతోంది. అధికారంలోకి వచ్చాక చేపట్టిన తొలి సభ్యత్వనమోదులోనే ఇది కనిపించింది. పార్టీలు పక్కనబెట్టి గ్రామాలకు గ్రామాలే.. గులాబీజెండా పట్టాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వానికి ప్రజలు జేజేలు పలుకుతున్న విధానానికి, అండగా నిలవాలని కలిసి.. కదులుతున్న తీరుకు ఇది అద్దం పడుతోంది. ముఖ్యమంత్రి పిలుపునిచ్చిన రాజకీయ పునరేకీకరణ పిలుపుకు స్పందించి.. ప్రతి రోజూ గులాబీపార్టీలో పెద్దసంఖ్యలో చేరికలు కొనసాగుతుండగా, టీఆర్ఎస్‌లో పండుగ వాతావరణం ఇప్పటికీ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యూహచాతుర్యానికి ప్రత్యర్థిపార్టీలు కకావికలు కాగా.. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు.. ఎదురునిలిచే నేత రాష్ట్ర రాజకీయాల్లోనే కనబడని పరిస్థితి నెలకొందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.





సిద్దిపేట టూ సీఎం

పేరు: కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు
ప్రస్తుత హోదా: తెలంగాణ ముఖ్యమంత్రి
భార్య: కల్వకుంట్ల శోభ
కుమారుడు: కల్వకుంట్ల తారక రామారావు
కూతురు: కల్వకుంట్ల కవిత
విద్యార్హత: ఎంఏ (తెలుగు సాహిత్యం)
రాజకీయ నేపథ్యం: 1978లో యువజన కాంగ్రెస్ మెదక్ జిల్లా కార్యదర్శిగా ప్రారంభం

- ☞ 1983లో సిద్దిపేటలో టీడీపీ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి.
- ☞ ఇదే సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా వరుసగా నాలుగు పర్యాయాలు 1985, 1989,1994,1999లలో గెలుపొందారు.
- ☞ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా, ఉప సభాపతిగా పని చేశారు.
- ☞ 2001 లో టీడీపీ పార్టీకి, శాసన సభ్యత్వానికి, ఉప సభాపతి పదవికి రాజీనామా చేసి అదే ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో సిద్దిపేట నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా.. ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- ☞ 2004 లో సిద్దిపేట నుంచి ఎమ్మెల్యేగా, కరీంనగర్ నుంచి ఎంపీగా పోటీ చేసి రెండింటిలోనూ విజయదుందుభి మోగించారు. తరువాత ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, కరీంనగర్ ఎంపీగా కొనసాగారు. అప్పుడే కొద్ది కాలం కేంద్రంలో మంత్రిగా పని చేశారు.
- ☞ 2006లో కరీంనగర్ ఎంపీ పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో మళ్లీ గెలిచారు.
- ☞ 2008లో మరోమారు కరీంనగర్ ఎంపీ పదవీకి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో మళ్లీ గెలిచారు.
- ☞ 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి విజయం సాధించారు.
- ☞ 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, మెదక్ లోక్‌సభ నుండి పోటీ చేశారు. రెండింటిలోనూ గెలిచారు. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూ ఎంపీ పదవికి రాజీనామా చేశారు.